Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:57 • సంచిక:257 • మంగళవారం 1 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from:Hyderabad |Karimnagar| Nizamabad| Suryapet| Vijayawada| Guntur| Rajahmundry| Visakhapatnam|Tirupati |Kurnool |Anantapur| Nellore

విద్యుత్ రంగంలో తెలంగాణ చారిత్రిక విజయం

కేసీఆర్ మార్గదర్శకత్వంలో విద్యుత్ సంస్థల విజయనాదం




తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సర కానుక 800 మెగావాట్ల కెటిపిఎస్ 7వ దశ ప్లాంటు

అతి తక్కువ సమయంలో నిర్మించిన విద్యుత్తు ప్లాంటుగా కొత్త చరిత్ర

తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రారంభించి, పూర్తి చేసిన మొదటి ప్రాజెక్టు

మిగులు విద్యుత్ రాష్ట్రం దిశగా తెలంగాణ రాష్ట్రం మరో ముందడుగు

తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో చేపట్టిన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నది. రూ.6,405 కోట్ల వ్యయంతో చేపట్టిన కెటిపిఎస్ 7వ దశ నిర్మాణాన్ని కేవలం 42 నెలల్లోనే పూర్తి చేసి, 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ జెన్‌కో అందుబాటులోకి తెచ్చింది. ఇంత తక్కువ సమయంలో భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో మరే విద్యుత్ ప్లాంటు నిర్మాణం జరగలేదు. 2015 జనవరి 1న ఈ ప్లాంటు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 2018 జూన్ 30 నాటికి ప్లాంటు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మార్గదర్శకాల అనుగుణంగా, 48 నెలల్లోనే ప్లాంటు పూర్తి చేసి, ఉత్పత్తి ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రం విద్యుతు ప్లాంట్ల నిర్మాణంలో దేశానికే ఆదర్శంగా నిలిచింది.



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి రోజుల్లో భయంకరమైన విద్యుత్ సంక్షోభం ఎదుర్కొన్నది. దార్శనిక నాయకుడు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలు అతి తక్కువ సమయంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ఈ సంక్షోభాన్ని పరిష్కరించాయి. నేడు తెలంగాణ రాష్ట్రం వ్యవసాయంతో పాటు అన్ని రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నది. ఈ విజయపరంపరలో తెలంగాణ రాష్ట్రం విద్యుత్ రంగంలో అనేక కొత్త రికార్డులు సృష్టించింది.

విద్యుత్ రంగంలో తెలంగాణ సృష్టించిన సరికొత్త రికార్డులు

తలసరి విద్యుత్ వినియోగం వృద్ధిరేటులో దేశంలో నెంబర్ వన్

ప్రగతి సూచికల్లో అతి ముఖ్యమైన తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం రికార్డు స్థాయి వృద్ధి సాధించింది. 2014లో 1,084 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగం ఉంటే 2018 నాటికి 1,727 యూనిట్లకు చేరింది. ఏడాదికి వెయ్యి యూనిట్లకు పైగా తలసరి వినియోగం జరిగే రాష్ట్రాల్లో తెలంగాణ అత్యధికంగా 11.34 శాతం వార్షిక వృద్ధిరేటు సాధించి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

దేశ సగటును మించి గరిష్ట డిమాండ్ వృద్ధి

2016-17లో తెలంగాణలో 9,187 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదు కాగా, 2018-19 సంవత్సరంలో 10,818 మెగావాట్లకు చేరింది. దేశ సగటు వృద్ధి శాతం 2.43 అయితే, తెలంగాణ వృద్ధి రేటు 17.75 శాతంగా నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నేడు 10,818 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఏర్పడినా కోత లేకుండా విద్యుత్ సరఫరా చేయగలిగింది.

సోలార్ పవర్‌లో దేశంలోనే అగ్రగామి

3,416 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తితో దేశంలోనే 2వ స్థానంగా నిలిచింది.

వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం

రాష్ట్రంలోని మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా అవుతున్నది. ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కొత్త చరిత్రను సగర్వంగా లిఖించింది.

లోటు నుంచి మిగులు వరకు

2014లో స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్లు ఉండేది. 2,700 మెగావాట్ల లోటు ఏర్పడేది. ఇప్పుడు 110 శాతం పెరిగి 16,307 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది.

రూ. 21,970 కోట్లతో పంపిణీ, సరఫరా వ్యవస్థలు పటిష్టం

రూ.21,970 కోట్ల వ్యయంతో పంపిణీ, సరఫరా వ్యవస్థలను ప్రభుత్వం పటిష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఆరో నెల (2014, నవంబర్ 20) నుంచే కోతల్లేని విద్యుత్ సరఫరా జరుగుతున్నది.

శరవేగంగా విద్యుత్ ప్లాంట్‌ల నిర్మాణం

తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో 5,880 మెగావాట్ల సామర్థ్యంతో జెన్‌కో మూడు కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టింది. 4,000 మెగావాట్ల రికార్డు స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ప్లాంటు, 1080 మెగావాట్ల సామర్థ్యంతో భద్రాద్రి పవర్ ప్లాంటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కెటిపిఎస్-7 ప్లాంటు విద్యుత్ సరఫరా ప్రారంభించింది.

తెలంగాణ చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్‌ల అనుసంధానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్‌ల మధ్య వార్ధా నుండి హైదరాబాద్-765 కెవి డిసి లైన్ ప్రారంభం పి.జి.సి.ఐ.ఎల్ ద్వారా నిర్మించబడింది. దేశంలో ఎక్కడి నుంచైనా విద్యుత్‌ను ఇచ్చిపుచ్చుకునే సౌలభ్యం ఈ లైన్ వల్ల కలిగింది.

రికార్డు స్థాయిలో ఉద్యోగాల కల్పన - దళారీ వ్యవస్థ నిర్మూలన

జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్ లలో కొత్తగా 13,357 మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నది. వేల మందికి ఏకకాలంలో పదోన్నతి కల్పించింది. 22,500 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసింది. దళారీ వ్యవస్థను నిర్మూలించింది. ఉద్యోగులకు 35 శాతం ఫిట్‌మెంటు, అదనపు ఇంక్రిమెంట్లతో వేతనాలు భారీగా పెంచింది.

ఎత్తిపోతల పథకాలకు 9 వేల మెగావాట్ల విద్యుత్

కోటి ఎకరాలకు సాగునీరు అందించే సంకల్పంతో ప్రభుత్వం నిర్మిస్తున్న భారీ ఎత్తిపోతల పథకాలకు అవసరమైన 9వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయడానికి పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేసింది.

పవర్ బ్యాంకింగ్ విధానానికి శ్రీకారం

తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా పవర్ బ్యాంకింగ్ విధానానికి విద్యుత్ సంస్థలు శ్రీకారం చుట్టాయి. 500 మెగావాట్ల మిగులు విద్యుత్‌ను రాజస్థాన్‌కు అందించి అధిక డిమాండ్ ఉన్న యాసంగి సీజన్‌లో ఆ విద్యుత్‌ను రాజస్థాన్ నుంచి తిరిగి తీసుకుంటుంది.

విద్యుత్తు వెలుగులో బంగారు తెలంగాణ రూపుదిద్దుకుంటున్నది



తెలంగాణ రాష్ట్ర పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్

తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

RO No: 60/18



ఖరీఫ్ నుంచి క్రాప్ కాలనీలు

(మొదటిపేజీ తరువాయి)

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ప్రభుత్వపరంగా నమ్మకమైన, కల్తీరహిత బ్రాండెడ్ ఉత్పత్తులు జరగాలని, రైతులు నియంత్రణా విధానంలోనే పంటలు పండించాలని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల మీద కోట్లాది మంది ఆధారపడి ఉన్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా ఆ శాఖలో పనిచేయాలని, దేశం మొత్తంలోనే ఉత్తమమైన వ్యవసాయ, ఉద్యానవన, ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతులలో తెలంగాణ అగ్రభాగాన ఉండాలని సీఎం అధికారులకు సూచించారు. రైతులను ఆదుకునే విషయంలో యావత్ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని సీఎం చెప్పారు.

సరైన గణాంకాలు లేక సమస్యలు

"దురదృష్టవశాత్తు చాలా విషయాల్లో సరైన గణాంకాలు లేకపోవడంవల్ల, సరైన నిర్ణయానికి రావడం కష్టమవుతోంది. రాష్ట్రంలో ఎంత ధాన్యం పండుతుంది, ఎంతమేరకు పండ్ల ఉత్పత్తి జరుగుతోంది, ఏ మేరకు ప్రజల ఆహార అవసరాలు తీరుతున్నాయి అనే విషయాలపై గణాంకాలు ఉండాలి. ఉద్యానవన శాఖలు, సంబంధిత ఇతర శాఖలు ఒక దానికి ఒకటి సంబంధ అనుబంధంగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయి. దీని ద్వారా రైతుల్లో అశాంతి పూర్తిగా తొలిగిపోతుంది. దీనికి మొదటి అడుగగా రైతు సమన్వయ సమితుల ఏర్పాటు జరిగింది. వాళ్ళకు క్రమపద్ధతిలో శిక్షణ ఇవ్వాలి. తర్వాత వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించడం జరిగింది. భూమి లెక్కలు కూడా తేల్చడం జరిగినందున వ్యవసాయ అనుకూల భూమి ఎంతుందో తేలింది. పండిన పంటకు గిట్టుబాటు ధర లభించాలి. ఇదంతా ఒక గొలుసుకట్టు కార్యక్రమంలాగా జరిగితే తద్వారా వ్యవస్థ బాగుపడితే చాలా మంచిది" అని సీఎం కేసీఆర్ అన్నారు.

ప్రాసెసింగ్ చేస్తే ఆదాయం రెట్టింపు

"ఎటువంటి రకమైన వ్యవసాయ ఉత్పత్తినైనా ప్రాసెస్ చేస్తే దాని ధర పెరుగుతుంది. ఉదాహరణకు మిరపకాయ నుంచి కారంపొడి లేదా పసుపు కొమ్ముల నుంచి పసుపు తీసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ వస్తువు కొనాలన్నా కల్తీ అవుతున్నది. మనం గనక మార్కెట్‌లో ఒక బ్రాండ్ నేమ్ మన ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్తత్తులకు అదీ ప్రభుత్వపరంగా తయారైన వస్తువన్న నమ్మకం కలిగించాలి. మన రాష్ట్ర అవసరాలకు సరిపోను మిగిలినవి పక్క రాష్ట్రాల్లో, విదేశాలకు ఎగుమతి చేయాలి. ఈ యావత్ ప్రక్రియలో ఐకేపీ-మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలి. ఏ



మేరకు వీరిని భాగస్వాములను చేయవచ్చు అధ్యయనం చేయాలి. 130 కోట్ల ప్రజలున్న మన దేశం పెద్ద దేశీయ మార్కెట్. ఏ రాష్ట్రంలో ఏది పండదో దాన్ని విశ్లేషించి మన వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా వాటిని పండించగలగాలి. తద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులను తయారు చేయాలి. దేశ, విదేశాల్లో అత్యుత్తమమైన ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఎక్కడుందో అలాంటిది మన రాష్ట్ర వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాటు చేసుకునే విషయం అధ్యయనం చేయాలి" అని సీఎం చెప్పారు.

ఆర్థిక స్థితి బ్రహ్మాండం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా ఉందని, గత నాలుగేళ్ళలో సగటున 17.17 శాతం వృద్ధిరేటును సాధించామని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 29.97 శాతం వృద్ధిరేటు ఉందని, జీఎస్‌డీపీలో ప్రథమ స్థానంలో ఉన్నామని సీఎం అన్నారు. వచ్చే ఐదేళ్ళలో రూ.10 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేయనున్నామని, అన్నీ విధాలా మన పెరుగుదలకు అవకాశాలు ఉన్నాయని, అందుకే మూస పద్ధతిలో ఆలోచించకుండా నూతన ఒరవడికి సిద్ధం కావాలని సీఎం అన్నారు. ఈ సమావేశంలో జరిగిన చర్చల ప్రాతిపదికగా ఆలోచనలు పంచుకుని ఎలా ముందుకు పోవాలో నిర్ణయించాలని అధికారులు కోరారు.

ఫుడ్ ప్రాసెసింగ్ సామూహిక ప్రయత్నం

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఒక సామూహిక ప్రయత్నమని, మహిళా బృందాలతో పాటు పలువురిని ఇందులో భాగస్వాములను చేయాలని సీఎం చెప్పారు. తొలుత ఒక ఆరేడు మండలాలను పైలట్ పద్ధతిన తీసుకుని కార్యక్రమం ప్రారంభించాలని, ఆ తర్వాత పెద్దఎత్తున ప్రారంభించవచ్చని సీఎం చెప్పారు. ఈ సమీక్ష ఆధారంగా అధికారులు వివిధ స్థాయిల్లో మేథోమధన కార్యక్రమాలను, వర్క్‌షాప్‌లను నిర్వహించాలని సీఎం సూచించారు. కేంద్ర ప్రభుత్వపరంగా ఫుడ్ ప్రాసెసింగ్‌లో అమలు పరుస్తున్న కార్యక్రమాలను అధ్యయనం చేయాలని, అలానే అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు సంబంధించిన అంశాలను కూడా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఎంత ఖర్చు పెట్టడానికైనా ప్రభుత్వం వెనకాడదని, ఉత్తమ స్థాయి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన పూర్వరంగంలో ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్ళి అధ్యయనం చేసి రావచ్చని సీఎం సూచించారు.

త్వరలోనే కార్యాచరణ

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు సంబంధించి ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. 45 లక్షల మంది సభ్యులున్న 4 లక్షలకుపైగా ఐకేపీ మహిళా సంఘాల సభ్యులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం చెప్పారు. పంట కాలనీల ఏర్పాటు, విత్తన కంపెనీల నియంత్రణ, కల్తీ విత్తనాల అమ్మకం పూర్తిగా నిషేధం, విత్తనాలు విరివిగా అందుబాటులో ఉంచడం, అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలని సీఎం చెప్పారు. నాటు యంత్రాలు, కలుపుతీసే యంత్రాలు, పసుపు రైతులకు ఇవ్వాల్సిన యంత్రాల విషయంలో కార్యాచరణ రూపొందించాలని సీఎం చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు రాజీవ్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులు నర్సింగ్‌రావు, భూపాల్‌రెడ్డి, స్మితా సబర్వాల్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు అనురాగ్ శర్మ, మాజీమంత్రి సి.ముత్యంరెడ్డి, టిఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, శాసనమండలి చీఫ్ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, ఆనంద, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, వ్యవసాయ ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఒకే రకమైన పంటతో సమస్యలే...

"రైతులందరూ ఒకే రకమైన పంటవేస్తే సమస్యలు తలెత్తుతాయి కాబట్టి పంట మార్పిడి కోసం వాళ్ళకు అవగాహన కల్పించాలి. రైతుల సంప్రదాయబద్ధమైన కొన్ని ఆలవాట్లలో కొంత మార్పు రావాలి. అందరూ రైతులు ఒకే రకమైన పంటవేస్తే జరిగే లాభనష్టాల మీద చర్చ జరగాలి. ముల్కనూరు గ్రామం అనుభవాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అక్కడ సహకార పద్ధతిలో రైతులను సంఘటిత పరచడం ద్వారా గొప్ప ఫలితాలు సాధించడం జరిగింది. రైతులకు ఫలానా విధంగా నడుచుకుంటే లాభం కలుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు నమ్మకం కలిగించగలిగితే బ్రహ్మాండమైన ఫలితాలు వస్తాయి. వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త అశోక్ గులాటిని ఢిల్లీలో కలిసి ఈ విషయాలలో వర్క్‌షాప్ నిర్వహించాలని ఆహ్వానించానని అన్నారు. త్వరలో ఆయన మన రాష్ట్రానికి వస్తారు" సీఎం చెప్పారు.

పంట కాలనీలుగా వ్యవసాయ క్షేత్రాలు

"రాష్ట్రానికి ఖచ్చితంగా పంట కాలనీలుగా విభజించాలి. రైతు పండించే పంటకు డిమాండ్ ఉండాలి. మన ఆహార అవసరాలేంటో తెలుసుకోవాలి. రైతాంగం ఏ పంటలు వేయడానికి అలవాటు పడ్డొద్దు అర్థం చేసుకుని ఒకేసారి వాళ్ళమీద మన అభిప్రాయాలను రుద్దకుండా అంచలంచలుగా పంట కాలనీల విషయంలో అవగాహన కలిగించాలి. గ్రామీణ ఆహార అవసరాలతో పాటు నగర, పట్టణ ప్రజల ఆహార అవసరాలకు తగువిధంగా ఉత్పత్తులు జరగాలి. కూరగాయలు, కొత్తిమీర, జీలకర్ర లాంటివి కూడా దిగుమతులు చేసుకోవడం దృష్టకరం. నగరాలు, పట్టణాల దరిదాపుల్లో కూరగాయల పెంపకం జరగాలి. వచ్చే వానాకాలంకల్లా కాళేశ్వరం నీళ్ళు వస్తాయి. కొత్త ఆయకట్టు వస్తుంది. రాబోయే రెండేళ్ళలో నీటి పారుదల ప్రాజెక్టులన్నీ పూర్తయి కోటి ఎకరాలకుపైగా సాగు నీరందుతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి.. చెరువులు నిండుతాయి. ఈ నేపథ్యంలో ఎటువంటి భూమిలో ఎలాంటి పంట వేయాలో రైతులకు అవగాహన కలిగించాలి" అని సీఎం అధికారులను ఆదేశించారు.

ఏప్రిల్‌లో పూర్తికానున్న మేడిగడ్డ ప్రాజెక్టు



- వేగవంతంగా కాళేశ్వరం పనులు
- సందర్శించిన రిటైర్డ్ ఇంజనీర్ల బృందం

మహాదేవపూర్, ప్రభన్యూస్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ఏప్రిల్ మాసంలో పూర్తికానుందని రిటైర్డ్ ఇంజనీర్ల బృందం ప్రతినిధి శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ రెండవ సారి ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్న నేపథ్యంలో ముందుగా రిటైర్డు ఇంజనీర్లు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి వద్ద నిర్మిస్తున్న పంపుహౌజ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని, మేడిగడ్డ బ్యారేజీ పనులు వచ్చే ఏప్రిల్ మాసానికి పూర్తయితాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లను వచ్చే పంటకు అందించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కన్నెపల్లి పంపుహౌజ్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ఇప్పటికే మోటార్లు బిగింపు పూర్తయిందని తెలిపారు. కొన్ని పనులు మార్చికల్ల పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఇంజనీర్లు వేణుగోపాల్, రాంరెడ్డి, చంద్రమౌళి, సత్తిరెడ్డి, వెంకటరమణ, ఈఈ,డీఈలు ఉన్నారు.

కళ్లముందు కాళేశ్వరం

- కాళేశ్వర నామ సంవత్సరంగా చరిత్ర సృష్టించే అవకాశం
- తెలంగాణ జీవధారగా మారనున్న ప్రాజెక్టు
- ఈ ఏడాదే లక్షల ఎకరాలకు సాగు నీరు
- కార్యదీక్షతో సీఎం కేసీఆర్
- నేడు కాళేశ్వరం పనుల పరిశీలన

ఆంధ్రప్రభ, హైదరాబాద్: తెలంగాణకు ఈ ఏడాది కాళేశ్వర నామసంవత్సరం కానుంది. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కార్యదీక్షకు ఫలితం రానుంది. తెలంగాణలో సింహభాగానికి సాగునీరందించే ప్రాజెక్టును వవడివడిగా పరుగులుపెట్టించి రైతుల పొలాల్లోకి జలసవ్వడిని దుంకించేందుకు నూతన సంవత్సరం ఆరంభం రోజే కేసీఆర్ ప్రాజెక్టుల సందర్శనకు శ్రీకారం చుట్టారు. మంగళవారం ఉదయం 11:30కు హైకోర్టునుండి బయల్దేరనున్న సీఎం మధ్యాహ్నం 1గంటకు మేడిగడ్డ బ్యారేజీ వద్దకు చేరుకుంటారు. అక్కడ ప్రాజెక్టుపనులను పరిశీలించడంతో పాటు రిటైర్డ్ ఇంజనీర్ల బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా అధికారులతో పనులపురోగతిపై చర్చిస్తారు.

బ్యారేజీ ఎప్పటిలోగా పూర్తవుతుంది..పంప్‌హౌజ్‌ల పరిస్థితేంటి.. ఎప్పటిలోగా నీటిని కాల్వల్లోకి వదలొచ్చు అన్న అంశాలను చర్చించి ఖచ్చితమైన డెడ్‌లైన్లు విధించనున్నారు. మేడిగడ్డ బ్యారేజీ తర్వాత కన్నెపల్లి పంప్‌హౌజ్‌ను పరిశీలించనున్న ఆయన పెండింగ్ పనులపై అవగాహనకు వస్తారు. ఇప్పటికే పంప్‌హౌజ్ పనులు దాదాపు పూర్తికాగా, మిగతా పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు సమస్యలేమైనా ఉంటే తక్షణ ఆదేశాలిస్తారు. ఆ తర్వాత అన్నారం బ్యారేజీ, సుందిళ్ళబ్యారేజీలను పరిశీలించనున్న కేసీఆర్ మంగళవారం రాత్రికి కరీంనగర్ చేరుకుంటారు. సోమవారం రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్లబృందం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం బ్యారేజీలు, పంపుహౌజుల నిర్మాణపనులను పరిశీలించి సాయంత్రం ముఖ్యమంత్రికి నివేదిక అందజేసింది. మేడిగడ్డ బ్యారేజీ ఏప్రిల్ నాటికి మొత్తం పూర్తయ్యే అవకాశం ఉండగా, అన్నారం, సుందిళ్ళబ్యారేజీల పనులు ఇప్పటికే దాదాపు పూర్తయ్యాయి. ఏప్రిల్ నాటికి బ్యారేజీలు, పంప్‌హౌజ్‌లన్నీ పూర్తిచేయాలని కేసీఆర్ పట్టుదలగా ఉన్నారు. ఖరీఫ్‌కు 10నుండి 20లక్షల ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో వరుస సమీక్షలు చేపట్టాలని అధికారయంత్రాంగాన్ని పరుగెత్తించాలని నిర్ణయించారు.

రేపు ఎస్సారెస్పీ లింక్ పనుల పరిశీలన

బుధవారం ఉదయం కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎస్సారెస్పీకి నీరందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవపథకం పనులు జరిగే ప్రాంతాలను కేసీఆర్ పరిశీలించనున్నారు. రాజేశ్వర్‌రావుపేట, రాంపూర్‌లలో నిర్మాణంలో ఉన్న పంప్‌హౌజ్ పనులను పరిశీలించనున్న సీఎం మధ్యాహ్నానికి ప్రగతిభవన్ చేరుకుంటారు. కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని సీఎంకు వివరించిన శ్యాంప్రసాద్‌రెడ్డి బృందం మంగళవారం ఉదయం పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టు పనులు జరిగే ప్రాంతాలను సందర్శిస్తుంది.

అక్కడ పనులను పర్యవేక్షించి జరిగిన పనులు, జరగాల్సిన పనులపై నిర్ణయానికొచ్చాక బుధవారం ఖమ్మం జిల్లాలో సీతారామా ప్రాజెక్టు పనులు జరిగే ప్రాంతాలను సందర్శించనుంది. ఇక మూడురోజుల పాటు కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, డిండి, సీతారామ ప్రాజెక్టులను సందర్శించే తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల బృందం ముఖ్యమంత్రికి నివేదిక అందించాక 3లేదా 4వ తేదీలలో అన్ని ప్రాజెక్టులపై ప్రగతిభవన్‌లో కేసీఆర్ సమీక్ష నిర్వహిస్తారు.



సీఎం నేరుగా నీటిపారుదల ప్రాజెక్టులపై దృష్టిపెట్టడంతో అన్ని ప్రాజెక్టుల పనుల్లోనూ కదలికవచ్చింది. ఏజెన్సీలు కూడా తమ పనులవేగం మరింతపెంచగా, అధికారులు రేయింబవళ్ళు శ్రమిస్తున్నారు. తెలంగాణలో స్థిరీకరణతో కలిపి 37లక్షల ఎకరాలకు జీవధారగా మారే ప్రాజెక్టు దేశంలో మరో చరిత్రకు నాంది పలకనుంది. 2019కాళేశ్వర నామసంవత్సరంగా మారి దేశంలోని సాగునీటి ప్రాజెక్టులకు నమూనాగా నిలవబోతున్నదని ఇంజనీర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జూరాల జలాలు తాగునీటికే

ఆంధ్రప్రభ, హైదరాబాద్: నారాయణపూర్ ప్రాజెక్టు అధికారులు ఇచ్చిన సమాచారం ఆధారంగా జూరాల ప్రాజెక్టులో ఉన్న నికరజలాలను ఇకపై మిషన్ భగీరథకు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా త్రాగునీటి అవసరాలకే వినియోగించాలని జోగులాంబగద్వాల జిల్లా కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. నారాయణపూర్ అధికారులు పంటకు విరామం ప్రకటించగా, ప్రియదర్శిని జూరాలలోనూ నీటిలభ్యత తక్కువగా ఉంది.

చిన్ననీటి పారుదల సంస్థకింద ఎత్తిపోతల పథకాలకు రబీపంటలకు కూడా నీరివ్వడం సాధ్యంకాదని అధికారులు వివరించా రు. త్రాగునీటి అవసరాల దృష్ట్యా రబీ 2018-19 సాగునీరు అందించే అవకాశం లేదని చెప్పారు.

హెచ్‌ఎండీఏ పరిధిలో పచ్చదనం పెంచండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ మెట్రో డవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలో పెద్దఎత్తున హరితవనాలు పెంచాలని ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ఆదేశించారు. దేశంలోని ఇతర నగరాల మాదిరిగా కాకుండా హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్ కావద్దని ఆయన అన్నారు.హెచ్‌ఎండీఏ కమిషనర్ జనార్దన్‌రెడ్డితో సోమవారం ఆయన సమావేశమై హరితవనంపై సమీక్షించారు. భావితరాలు సంతోషపడే విధంగా హరితవనాలు పెంచాలని, హెచ్‌ఎండీఏ పరిధిలో దీనికోసం ఎక్కువ విస్తీర్ణం గుర్తించాలని ఆయన సూచించారు.

అలాగే వాకర్స్ క్లబ్‌లను ఏర్పాటుచేసి వాటి నిర్వహణను వారికే అప్పగించాలని కమిషనర్‌కు సూచించారు. హైదరాబా ద్ నుంచి మెదక్‌కు వెళ్ళే రహదారిలో అడవి ఏ రకంగా ఉండో ఆ తీరులో హెచ్‌ఎండీఏ పరిధిలో మొక్కలు పెంచాలని సీఎం చెప్పారు. అటవీశాఖ సమన్వయంతో ఇది సాధ్యమవుతుందని, ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టు ప్రాంతంలో గ్రీనరీ పెంచాలని చెప్పారు.

బెంగాల్లోనూ రైతుబంధు

(మొదటిపేజీ తరువాయి)

దేశ రాజకీయాలతో పాటు ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు.. తెలంగాలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా వివరించారు. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, రైతు బీమాల గురించి వివరించారు. రాష్ట్ర రైతాంగం సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల హర్షం వ్యక్తంచేసిన మమతా బెనర్జీ తమ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకాలకు శ్రీకారం చుడతామని కేసీఆర్‌తో చెప్పినట్లు సమాచారం. కేసీఆర్‌తో భేటీ అయిన వారం రోజుల్లోనే పశ్చిమ బెంగాల్ ప్రజలకు నూతన సంవత్సరం కానుకలను ప్రకటించారు.

గవర్నర్, కేసీఆర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు ప్రజలు నూతనసంవత్సరంలో సుఖ శాంతులతో వర్ధిల్లాలని గవర్నర్ నరసింహన్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా తెలుగు ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సుఖసంతోషాలు వెల్లివిరియాలి : కేసీఆర్



తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు పోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరిసేలా దీవించాలని భగవంతుడిని సీఎం ప్రార్థించారు.

రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు



రాష్ట్ర శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సుఖసంతోషాలతో గడపాలి



కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. చెడును విస్మరించి మంచిని కొనసాగించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ కార్యకర్తలు నూతనోత్తేజంతో ప్రజా సమస్యలపై పని చేయాలని ఉత్తమ్ సూచించారు. ప్రజలంతా సుఖశాంతులతో గడపాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.జానారెడ్డి ఆకాంక్షిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి ప్రజలకందాలి




రాష్ట్ర ప్రజలకు మాజీమంత్రి హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో ప్రజలకు అంది వారు సుఖసంతోషాలతో ఉండాలని, ఎన్నో ఆశయాలు, లక్ష్యాలు సాధించి సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కోటి ఎకరాల మాగాణి రాష్ట్రంగా సస్యశ్యామలం కావాలని ఆయన ఆకాంక్షించారు.

అందరికీ మంచి జరగాలి



నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అంతా మంచి జరగాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో ప్రజలు శాంతిసౌఖ్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

సామాన్యుడే రాజై వెలగాలి



కొత్త ఆశలకు ఊపిరి పోస్తూ 2019లోకి అడుగు పెడుతున్న తరుణంలో తెలుగు ప్రజలందరికీ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన ఏడాది అనుభవాలను ప్రేరణగా తీసుకుని నూతన నిర్ణయాలతో ముందడుగు వేద్దామన్నారు. ఈ కొత్త సంవత్సరంలో సామాన్యుడే రాజై వెలగాలని పవన్ ఆకాంక్షించారు.

ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, మార్గశిరమాసం; తిథి: బహుళ ఏకాదశి తె.3.41 వరకు, నక్షత్రం: స్వాతి మ.12.02 వరకు, అనంతరం విశాఖ; అమృతకాలం: తె.3.10 నుండి 4.50 వరకు; వర్జ్యం: సా.5.38 నుండి 7.34 వరకు; దుర్ముహూర్తం: ఉ.08.46 నుండి 9.29 వరకు, తదుపరి; రా.10.45 నుండి 11.35 వరకు; రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ.09.00 నుండి 10.30 వరకు.

ఆంధ్రప్రభ
Estd. 1938
www.prabhanews.com
Journalism
సంపుటి:57 • సంచిక:257 • మంగళవారం 1 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

ఖరీఫ్ నుంచి క్రాప్ కాలనీలు


సోమవారం సాయంత్రం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి భేటీ

- సంఘటిత వ్యవసాయానికి శ్రీకారం
- వ్యవసాయ ఉత్పత్తుల్లో తెలంగాణ ముందుండాలి
- ఫుడ్ ప్రాసెసింగ్‌తో ఎగుమతులను అందుకోవాలి
- తద్వారా రైతుల ఆదాయం రెట్టింపు ఖాయం
- వ్యవసాయం, అనుబంధ రంగాలపై ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మరింత లాభసాటి వ్యవసాయానికి రైతులు సంఘటిత సాగువైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అన్నారు. పంట కాలనీలతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని అభిప్రాయపడ్డారు. ఆ దిశగా అధికార యంత్రాంగం వారిలో చైతన్యం తీసుకువచ్చి అమలుకు శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ నుంచి ఖచ్చితంగా అమలు చేసి సాగు రంగంలోనూ పొరుగు రాష్ట్రాలకు, దేశానికి ఆదర్శంగా నిలువాలని ఆకాంక్షించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ తీరుతెన్నులపై, భవిష్యత్తులో అవలంబించాల్సిన విధానాలపై మహిళా సంఘాలను ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులలో భాగస్వాములను చేయడంపై, తెలంగాణలోని వివిధ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు సంబంధించి సోమవారం మధ్యాహ్నం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధ్యక్షత ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఆహార, వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు విషయాల్లో సరైన గణాంకాలు లేనందున రకరకాల సమ్యలు తలెత్తున్నాయని అన్నారు. వీటిని అధిగమించాల్సిన ఆవశ్యకత ఉందని, రైతుల సాంప్రదాయబద్ధమైన కొన్ని అలవాట్లలో మార్పు రావలసిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రైతులందరూ ఒకే రకమైన పంటలు వేయడంవల్లజరిగే లాభనష్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, రైతులను సంఘటిత పరచడం ద్వారానే గొప్ప ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. రాష్ట్రాన్ని ఖచ్చితంగా పంటల కాలనీగా విభజించాలని, రైతు పండించే ప్రతి పంటకు డిమాండ్ లభించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రాష్ట్రంలో నెలకొల్పనున్న ➪ 2వ పేజీలో...

హ్యాపీ న్యూ ఇయర్



పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సరం 2019 శుభాకాంక్షలు

- ముత్తా గౌతమ్
మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రభ

బెంగాల్లోనూ రైతుబంధు

- రైతులకు మమత నూతన సంవత్సర కానుక
- రైతుబీమా 2 లక్షలు.. రైతుబంధు 5వేలు
- స్వాగతించిన కేసీఆర్.. దీదీకి అభినందనలు

కోల్‌కతా : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. రాష్ట్రంలో అమలౌతున్న రైతు బంధు, రైతు బీమా పథకాలను తమ రాష్ట్రంలోనూ అమలు చేయనున్నట్లు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. రాష్ట్రంలో అమలౌతున్న రైతుబంధు, రైతు బీమాను పోలిన రెండు పథకాలను కృషి కర్షక్ బంధు పేరుతో ప్రకటించారు. ప్రతీ రైతు పేర ప్రభుత్వమే ఉచిత బీమాను చెల్లిస్తుందని.. ఒకవేళ రైతులు మరణిస్తే వారి కుటుంబాలకు బీమామొత్తం రూ. 2 లక్షల ఆర్థిక సాహాయంగా అందిస్తామని తెలియజేశారు. రైతులు పంటలు వేసే సమయంలో అవసరమయ్యే పెట్టుబడిని కూడా ఏడాదికి రెండు సార్లు రూ. 2500 చొప్పున చెల్లిస్తామని మమత సర్కారు ప్రకటించింది. తెలంగాణ ఇదే పథకం రైతు బంధు పేరుతో అమలౌతోంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఏడాదికి రెండుసార్లు రూ.4 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం చెల్లిస్తుండగా.. . త్వరలోనే ఆ మొత్తాన్ని రూ.5 వేలు చేయనున్నట్లు కేసీఆర్ ఇటీవలే ప్రకటించారు. కృషి కర్షక్ బంధు పథకం ద్వారా పశ్చిమ బెంగాల్‌లోని 72 లక్షల రైతు కుటుంబాలకు లబ్ది జరుగుతుందని మమతా బెనర్జీ ప్రకటించారు. రైతులను కష్టాల నుంచి గట్టెక్కించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. అన్నదాత సంక్షేమానికి కృషి కర్షక్ బంధు పథకం కింద వందల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మమత వివరించారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ➪ 2వ పేజీలో...



కొత్త ఏడాది కొత్త హైకోర్టు

- సాకారమైన తెలంగాణ హైకోర్టు కల
- నేడు కొలువుదీరనున్న ఉన్నత న్యాయస్థానం
- రాజ్‌భవన్‌లో నేడు సీజే ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ హైకోర్టు కల సాకారమైంది. కొత్త ఏడాది తొలి రోజు కొలువుదీరుతోంది. ఆంగ్లసంవత్సరాది జనవరి 1వ తేదీ నుంచి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పేరుకూడా మారబోతోంది. నాలుగున్నరేళ్ళ పాటు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా పనిచేసిన హైకోర్టు బదులు నూతన ఏడాదిలో తొలిరోజైన మంగళవారం నుంచి ఏపీ, తెలంగాణలలో విడివిడి హైకోర్టులు పనిచేయనున్నాయి. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన రాధాకృష్ణన్ చేత గవర్నర్ నరసింహన్ మంగళవారం ఉదయం రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో ప్రమాణం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్‌తో పాటు శాసనభ స్పీకర్ మధుసూదనాచారి, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, ఇతర న్యాయశాఖ అధికారులు హాజరు కానున్నారు. అనంతరం హైకోర్టులో జరిగే కార్యక్రమంలో 13 మంది న్యాయమూర్తులచేత ప్రధాన న్యాయమూర్తి రాధాకృష్ణన్ ➪ 5వ పేజీలో...

జూరాల జలాలు తాగునీటికే

- ఈ రబీ పంటలకు సాగునీరు బంద్
- ప్రభుత్వ జీఓ జారీ

2

సమ్మక్క సారలమ్మ జిల్లాకు మహర్దశ

- 490 ఎకరాలలో గిరిజన యూనివర్సిటీ
- స్థలాన్ని పరిశీలించిన కేంద్ర ప్రిన్సిపల్ సెక్రటరీ రెడ్డి సుబ్రహ్మణ్యం



ములుగురూరల్, ప్రభన్యూస్ : నూతనంగా ఏర్పడుతున్న సమ్మక్క సారలమ్మ జిల్లాకు మహర్దశ వచ్చిందని కేంద్ర ప్రిన్సిపల్ సెక్రటరీ రెడ్డిసుబ్రహ్మణ్యం , గిరిజన శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి క్రిష్టినా చౌటో అన్నారు. సోమవారం ములుగు మండలంలోని గట్టమ్మ దేవాలయం సమీపంలో 833 సర్వే నంబర్ లో 490 ఎకరాల్లో గిరిజన యూనివర్సిటీని ప్రారంభించేందుకు స్థలాన్ని పరిశీలించి ఇదే స్థలంలో అయితే గిరిజన యూనివర్సిటీ బాగుంటుందని స్థలాన్ని ఎన్నుకున్నారు. కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథులుగా కేంద్ర ప్రిన్సిపల్ కార్యాలయం నుంచి వచ్చిన వారికి మ్యాప్ ద్వారా స్థలాన్ని పరిశీలించి ఈ స్థలంలో అయితే గిరిజన యూనివర్సిటీ చాలా బాగుంటుందని ఈస్థలాన్ని ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జనవరి 26వ తేదీన సమ్మక్క సారక్క జిల్లాను ఏర్పాటుచేసి రాష్ట్రంలోనే సమ్మక్క సారక్క జిల్లా పేరు పోవాలని రెండు సంవత్సరాల కొకసారి జరిగే సమ్మక్క జాతరకు దేశ నలుమూలల నుండి కోటల్లో ప్రజలు సమ్మక్క సారక్క జాతరకు వచ్చి సమ్మక్క సారక్కను దర్శించుకుంటారని అందువల్లనే ములుగును సమ్మక్క సారక్క జిల్లాలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. గిరిజన యూనివర్సిటి ఏర్పాటుకు అతిత్వరలోనే ప్రతిపాదనలు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని అన్నారు. నూతనంగా ఏర్పడుతున్న సమ్మక్క సారక్క జిల్లాకు ఇప్పటి నుండి అధికారులు పూర్తి స్థాయిలో జిల్లాఏర్పాటుకు ప్రతిపాదనలు చేపట్టి సమ్మక్క సారక్క జిల్లాను త్వరలోనే ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఓ వి.చక్రాధర్ రావు, ఆర్డీఓ కూతాటి రమాదేవి, తహసీల్దార్ గనియా, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్

- నియమించిన కేంద్రం
- చైర్మన్‌గా జీఎంను ఎంపిక చేయడం ఇదే తొలిసారి



10

కళ్ల ముందు కాళేశ్వరం

- కాళేశ్వర నామ సంవత్సరంగా చరిత్ర!
- తెలంగాణ జీవధారగా సాగునీటి ప్రాజెక్టు
- ఈ ఏడాదే లక్షల ఎకరాలకు సాగునీరు
- కార్యదీక్షతో ముఖ్యమంత్రి కేసీఆర్
- నేడు కాళేశ్వరం పనులు పరిశీలన
- ఏప్రిల్‌కు బ్యారేజీలు రెడీ.. ఖరీఫ్‌కు నీళ్లు

2


ఏఐసీసీ అధికార ప్రతినిధిగా దాసోజ్ శ్రవణ్

- నియమించిన రాహుల్
- టీపీసీసీ నేతలు హర్షం



10

న్యూ ఇయర్ జోష్


ముంబై ఇండియా గేట్ వద్ద సోమవారం రాత్రి న్యూ ఇయర్ వేడుకలు

20 రాష్ట్రాలు.. 100 రోజులు



- సార్వత్రిక ఎన్నికలకు బీజేపీ బహుముఖ వ్యూహం
- కేడర్‌లో జోష్ నింపేలా మోదీ పర్యటనలు
- ప్రభుత్వ విజయాలే ప్రచారంలో ప్రధాన ఎజెండా

11

నకిలీ స్టాంపుల కేసు తెల్గీ నిర్దోషి



8

- మరణించిన ఏడాది తర్వాత నిర్దోషిగా తీర్పునిచ్చిన నాసిక్ కోర్టు

తలాక్ బిల్లుకు బ్రేక్

- సెలెక్ట్ కమిటీకి పంపాలన్న విపక్షాలు
- 90% విపక్షాలు మద్దతిచ్చాయి: ఆజాద్

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 1 జనవరి 2019

ఉపఖండంలో నిరంకుశ పోకడలు!

కొత్త సంవత్సరారంభంలో భారత ఉపఖండం పరిస్థితి ఎన్నడూ లేనంతగా నిరంకుశపు మేఘాలు కమ్ముకుని ఉంది.బంగ్లాదేశ్,పాకిస్తాన్‌లు ఒకప్పటి అఖండ భారత్‌లో అంతర్భాగాలే. పాకిస్తాన్ మతంపేరిట విడిపోయి ఏడు దశాబ్దాలు దాటింది. దాని అంతర్భాగమైన తూర్పు పాకిస్తాన్ (తూర్పు బెంగాల్)సుదీర్ఘ పోరాటంతో మన దేశం అండదండలతో బంగ్లాదేశ్ పేరిట కొత్త దేశంగా అవతరించింది. భారత్ వంటి ప్రజాస్వామిక దేశాల స్ఫూర్తితో ఏర్పడిన బంగ్లాదేశ్ అతి స్వల్ప కాలంలోనే సైనిక నియంతల చేతుల్లోకి వెళ్ళిపోయింది.అవిభక్త పాకిస్తాన్‌లో ప్రజాస్వామిక పాలన కోసం ఏళ్ళ తరబడి పోరాటం సాగించిన బంగ బంధు షేక్ ముజబుర్ రెహమాన్‌పై సైనిక నియంత తిరుగుబాటు చేయడమే కాకుండా, ఆయననూ,ఆయన కుటుంబ సభ్యులను హత్య చేశారు.ప్రస్తుత ప్రధానిగా ఉన్న షేక్ హసీనా ఆయన కుమార్తె. తన తండ్రిపై తిరుగుబాటు జరిగిన సమయంలో ఆమె దేశంలోలేకపోవడం వల్ల బతికి పోయారు.ఆమె,ఆమె తండ్రి ముజబుర్ రెహమాన్ ఇద్దరూ కూడా స్వతహాగా ప్రజాస్వామ్య వాదులే. చిన్నప్పటి నుంచి రాజకీయ,సైనిక కుట్రల మధ్య పెరగడం వల్ల ఆమెలో పగ,ప్రతీకార జ్వాలలు వెల్లువెత్తాయి.ప్రజాస్వామిక స్ఫూర్తి,భావాలు పూర్తిగా అంతరించి పోయాయి. కంటికి కన్ను, పంటికి పన్ను అనే ఆటవిక నీతికే ఆమె ప్రాధాన్యం ఇస్తున్నారు. తన తండ్రిపైనా, తమ కుటుంబ సభ్యులపైనా తిరుగుబాటు చేసి వారిని హతమార్చిన సైనికాధికారులనూ, నమ్మకంద్రోహం చేసిన రాజకీయ నాయకులనూ నిర్దాక్షిణ్యంగా ఉరితీయించారు.


పాకిస్తాన్‌లో మాదిరిగానే బంగ్లాదేశ్‌లో నేతి బీర ప్రజాస్వామ్యం నడుస్తోంది. దాయాది దేశంలోమాదిరిగానే బంగ్లాదేశ్ లో అవినీతి, లంచగొండి తనం,పేదరికం, నిరక్షరాస్యత తాండవిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులు మిక్కుటమైనప్పుడు ఏ దేశంలోనైనా చదువులు, ఉన్నతోద్యోగాలు గగనం కావడం అత్యంత సహజం. అందుకే, పాకిస్తాన్‌లో మాదిరిగానే బంగ్లాదేశ్‌లో యువత ఉగ్రవాదులుగా తయారు కావడంతో పాటుమాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి అసాంఘిక వృత్తుల ద్వారానే జీవనం సాగిస్తున్నారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లు బొమ్మ ,బొరుసు వంటివి. కాకపోతే పాకిస్తాన్ కన్నా బంగ్లా దేశ్ మన దేశం పట్ల ఉదార వైఖరిని అనుసరిస్తోంది.అది కూడా షేక్ హసీనా హయాంలోనే. ఆమె నాల్గవ సారి ప్రధానిగా ఎన్నిక కావడం పట్ల ప్రధాని నరేంద్రమోడీ హర్షం వ్యక్తం చేయడమే కాకుండా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.ఆమె ప్రత్యర్థి,మాజీ ప్రధాని ఖలీదా జియా ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఆమె నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పి) పార్లమెంటు ఎన్నికల బహిష్కరణకు పిలుపు ఇచ్చింది.షేక్ హసీనా నేతృత్వంలో ఎన్నికలు నిష్పాక్షికంగా, ప్రశాంతంగా జరుగుతాయన్న నమ్మకం తమకు లేదని బిఎన్పీ స్పష్టం చేసింది.తటస్థప్రభుత్వం నేతృత్వంలో ఎన్నికలు జరగాలని డిమాండ్ చేసింది.బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ తరఫున అభ్యర్థులు నామమాత్రంగా పోటీ చేశారు. బిఎన్పీ ఊహించినట్టే పోలింగ్ సందర్భంగా పెద్ద ఎత్తున హింసా కాండ చోటు చేసుకుంది. మొత్తం 17 మంది మరణించగా, డజన్ల కొద్దీపౌరులూ, రాజకీయ పార్టీల కార్యకర్తలు గాయపడ్డారు. ప్రజాస్వామ్య స్ఫూర్తి ఈ ఎన్నికల్లో మచ్చుకైనా కానరాలేదు.అధికారులు,పోలీసులు పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి దొంగ ఓట్లు వేయించినట్టు ఆరోపణలు వచ్చాయి. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం ఉన్న సైనికాధికారులు ప్రధాని షేక్ హసీనాకు వీరవిధేయులు . మీడియా మొత్తం ప్రభుత్వ అదుపులో ఉందని ఐదు మాసాల క్రితమే టైమ్స్ అసోం పత్రిక నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో వెల్లడైంది.వెబ్ సైట్లు, టెలివిజన్ చానల్స్,ఇతర ప్రచార సాధనాలన్నీ ప్రభుత్వం గుప్పెట్లో ఉన్నాయి.హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా అక్రమ కేసులు బనాయించి జైళ్ళలో కుక్కేవారని ఆ పత్రికపేర్కొంది. బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య ముసుగులో సైనిక పాలన జరుగుతోందంటూ ఆ పత్రిక వ్యాఖ్యానించినందుకు ఆ పత్రికపైన కూడా ప్రభుత్వంచర్యలు తీసుకుంది.పాకిస్తాన్‌లో కూడా పేరుకి మాత్రమే ప్రజాస్వామిక ప్రభుత్వం నడుస్తోంది. మాజీ క్రికెట్ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ తెహ్రిక్ ఎ ఇన్సాఫ్ కూడా ప్రత్యర్థులను అణచివేసేందుకు సైన్యం సహకారాన్ని తీసుకుంటోంది. మాజీప్రధాని నవాజ్ షరీఫ్‌పై కేసులు ఉన్న మాటనిజమే కానీ, ఆయనపై ప్రభుత్వం త్వరితంగా విచారణ జరిపించి జైలులో పెట్టించింది.అంతకన్నా తీవ్రమైన కేసులున్న మాజీ అధ్యక్షుడు,రిటైర్డ్ జనరల్ ముషార్రఫ్ దర్జాగా విదేశీపర్యటనలు జరుపుతున్నాడు. పాక్,బంగ్లాదేశ్ లలోదాదాపు ఒకే రీతిలో పరిస్థితులు ఉన్నాయి. కొత్త సంవత్సరారంభంలో సరిహద్దుల్లో మనస్థావరాలపై పాక్ దళాలు జరిపిన కాల్పులను మన జవాన్లు తిప్పికొట్టారు.

ఆ రెండుదేశాలతో పోలిస్తే మన దేశంలో పరిస్థితి చాలా వరకూ నయమే అయినా, ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వ పోకడలు సాగుతున్నాయి. ప్రత్యర్థుల నోళ్ళు నొక్కేందుకు పాత కేసుల బూజు దులపడం, బయోపిక్‌ల పేరిట వ్యంగ్య చిత్రాలను ఎన్నికల ముందు విడుదల చేయడం, సమాచార హక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కడం, ఎదురుతిరిగిన వారి ఇళ్ళల్లో సీబీఐ,ఆదాయం పన్ను శాఖ విభాగాల అధికారులచేత దాడులు జరిపించడం వంటివి గడిచిన కొన్ని మాసాలుగా చూస్తున్నాం.

ఈదాడుల విషయంలో అస్మదీయుల పట్ల ఉదార వైఖరిని ప్రదర్శించడాన్ని కూడా చూస్తున్నాం. సైనిక నియంతల పాలనకూ, ప్రజాస్వామికంగా ఎన్నికై అధికారంలో ఉన్న నాయకుల పాలనకూ తేడా ఏమాత్రం లేదనిపించేరీతిలో పరిస్థితులు నెలకుంటున్నాయి. ప్రజాస్వామిక స్ఫూర్తిని అపహాస్యం చేసే రీతిలో ఎన్నికలు జరుగుతున్నాయన్న ప్రతిపక్షాల ఆరోపణలు అరణ్య రోదన అవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా నియంతృత్వ పోకడలకు గతంలో పేరు మోసిన దేశాల్లో ప్రజాస్వామ్య వీచికలు విస్తారంగా కానవస్తున్న వేళ భారత ఉపఖండంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉండటం గమనార్హం.

పాత ఏడాదిలో చక్రం తిప్పారు... కొత్త ఏడాదిలో తెలంగాణాకు ఇరుసుగా మారారు. కల్వకుంట్ల తారక రామారావు రాజకీయ ప్రస్థానం ఏ ఇతర యువనేతల కన్నా పూర్తి భిన్నం...!

కొత్త వారధి!



తెలంగాణ ఉద్యమంలో, రాష్ట్ర ప్రభుత్వ పాలనలో, ఎన్నికల సమరంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉన్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు కుమారుడు, మంత్రి కె టి రామారావు తండ్రి పేరును నిలబెట్టడమే కాకుండా, దిగంతాలకు వ్యాపింపజేస్తున్నారు. అతడే ఒక సైన్యంగా నిలిచి గెలిచిన కెటి ఆర్ తెలంగాణ ప్రగతి పథానికి యువశక్తికి ప్రతిరూపం.

తెలంగాణ ఎన్నికలు రాజకీయంగా ఎన్నో సంచలనాలను నమోదు చేసింది. చాలా మంది ఆలోచనలనూ, అంచనాలనూ శాస్త్రీయం అని చెప్పుకుంటున్న సర్వేలను తారుమారు చేసింది. చాలామంది ఊహించని ఫలితాలను తెచ్చింది. ఒక ఆలోచన ప్రకారం జాతీయ,అంతర్జాతీయ మీడియా రాజకీయ విశ్లేషకులకు సైతం ఊహకందని, అంతుచిక్కని ఫలితాలను ఇచ్చాయనే చె ప్పాలి. ఈ విజయం వెనక ఒక సైన్యం నడిచింది. యుద్ధం జరిగింది. ఆ సైన్యం తెరాస కార్యకర్తలు. ఆ కార్యకర్తల సైన్యాన్ని దిశానిర్దేశం చేసింది పార్టీ, ప్రభుత్వ అధినేత కేసీఆరే. అయితే, ఈ అఖండ విజయం సాధించడంలో కె.తారక రామారావు (కేటీఆర్) పోషించిన పాత్రను సరైన పద్ధతిలో అంచనా వేసే ప్రయత్నం ఇది. చంద్రశేఖరరావు గారి కుమారుడు తారక రామారావు తానే ఒక సైన్యంగా పని చేశారు. చాలా రాష్ట్రాల్లో అనువంశిక వాతావరణం ఉన్నా, కల్వకుంట కుటుంబంలో చంద్రుడు రాముడుల అనుబంధం భిన్నమైన రీతిలో ఉంది.

పుత్రాధిచ్ఛేత్ పరాజయమ్ అనే ఒక సంస్కృత న్యాయం ఉంది. అంటే ఏ తండ్రి అయినా కొడుకే గెలవాలని అనుకుంటాడు. కేసీఆర్ విషయంలో ఈ సంస్కృత న్యాయం సరిగ్గా సరిపోతుంది.తెలంగాణ సమరంలో అప్పుడు ఉద్యమంలో ఇటీవల ఎన్నికల్లో కేసీఆర్, కెటిఆర్ ల సంబంధం ఈ రీతిగానే సాగింది. ఎన్నికల వ్యూహం కర్త, కర్మ, క్రియ అన్నీ కేసీఆర్ కాగా, ఈ యుద్ధాన్ని నడిపించింది సైన్యాధిపతి కేటీఆర్. తండ్రి వ్యూహాలకు అనుగుణంగానే యుద్ధాన్ని నడిపిన వీరుడు నేటి తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.

తెరాస అధినేత, రెండో అధినేత మాత్రం ఈ ఫలితాలు ఈ విధంగానే ఉంటాయని ముందుగానే చెప్పి తమ, ధైర్యాన్నీ, ధీమాని ప్రజల చెవికి ఎక్కేలా ఘోషించారు. వంద సీట్లు తగ్గకుండా వస్తాయని కేటీఆర్ ఘంటాపథంగా చెప్పారు. రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం వస్తుందని అందులో మా కూటమి విజయం తథ్యమని వైరి పక్షం నాయకుడు అంటే కేటీఆర్ వారిది నిశ్శబ్ద విప్లవమో, కానీ మాది శబ్ద విప్లవం అందరికీ వినబడేలా, గూబ గుయ్ మనే శబ్దం వస్తుంది. మాకు విజయం వస్తుంది. అని పెద్ద ఢంకా భజాయించి మరీ స్పష్టం చేశారు. ఈ శబ్దం తెరాస విజయానికి భేరీ నాదం అయింది.తారక రామారావు నలభై రెండేళ్ళ పడిలో ఎనిమిది దశాబ్దాల రాజకీయ పరిణతిని ,వ్యూహరచనా చమత్కారాన్నీ చూపారు. కేటీఆర్ పూణేలో బయోటెక్నాలజీలో ఎమ్మెస్సీ పూర్తి చేసిన తర్వాత అమెరికాలో చదువులకు వెళ్ళారు. న్యూయార్క్ సిటీ యూనివర్సిటీ నుంచి మేనేజిమెంట్ అండ్ ఈ కామర్స్‌లో ఎమ్మెస్సీ చేసి అక్కడే ఒక కంపెనీలో ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తుండగా, ఆ ఉద్యోగంలో భాగంగా ఆ కంపెనీ వారు ఆయనను స్వదేశానికి పంపారు. ఆ విధంగా కేటీఆర్ 2004లో హైదరాబాద్ తిరిగి వచ్చారు. అదే సమయంలో ఇక్కడ తెలంగాణ ఉద్యమం వేడెక్కి మంచి ఊపులో ఉంది. అయితే, కేసీఆర్ తన కుమారుడు ఈరంగంలోకి రావాలని కోరుకోలేదు.

రాష్ట్ర సాధన ఎప్పటికి జరుగుతుందో తెలియని పరిస్థితి ఆనాటిది. ఇతర రాజకీయ నాయకులతో పోలిస్తే ఈ విషయంలో కేసీఆర్‌లో తేడా ఏమిటో తెలుస్తుంది. 2006లో కేసీఆర్ కరీంనగర్ ఉప ఎన్నికల్లో లోక్‌సభకు పోటీ చేసినప్పుడు అది తెరాసకు జీవన్మరణ సమస్య అయింది. ఆ సందర్భంగా కేటీఆర్ తండ్రికి బాసటగా నిలవడం ధర్మంగా భావించారు. మూడు నెలలు సెలవు కావాలని కంపెనీ వారిని కోరగా వారు తిరస్కరించారు. దాంతో ఉద్యోగాన్ని వదులు కుని కేటీఆర్ ప్రచారంలోకి దూకారు. కేటీఆర్ రాజకీయ రంగ ప్రవేశానికి ఇదే నాంది. ఆ తర్వాత పార్టీ విస్తరణ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీకి జవసత్వాలు చేకూర్చారు. దాదాపు ఏడాదిన్నర మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జిగా ఉంటూ తండ్రికి అండగా నిలిచారు. 2009 అసెం బ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి తెరాస అభ్యర్థిగా గెలుపొందినా ఏడాదికే ఉద్యమంలో అత్యవసర చర్యగా తనపదవికి రాజీనామా చేశారు. మళ్ళీ పోటీచేసి తనను తాను నిరూపించుకున్నారు. అరవై వేలకు పైగా మెజారిటీ సాధించారు.

ఏ నాయకుడికైనా, వాక్శుద్ధి, వాదనాపటిమ, వక్తత్వశక్తి అనేవి పులికి పంజాలాంటివి. వక్తృత్వంలో వాదనా పటిమలో కేటీఆర్ అగ్రస్థానంలో ఉంటాడు. ఈ విషయంలో తండ్రికి తగిన తనయుడు అంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. కేటీఆర్ తొలి ఎంఎల్ఏ గా ఉన్న సందర్భంలోనే ప్రతిపక్షంలో ఉన్న నాయకులు కూడా కేటీఆర్ వక్తృత్వ నైపుణ్యాన్ని కొనియాడారు. సిసలైన తెలంగాణ యాసని పలకడంలో, అటు హైదరాబాదీ ఉర్దూని రక్తి కట్టించడంలో, అంతర్జాతీయ స్థాయి ఉచ్చారణతో ఆంగ్లంలో మాట్లాడి విదేశీయులతో సెభాష్ అనిపించుకోవడంలో కేటీఆర్ తిరుగులేని రీతిలో నిలిచాడు. ఈ వాదనా పటిమే ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది.


ఎక్కడికి ఏ సభకి పోయినా ఆయన ప్రసంగాలకు యువతరం బ్రహ్మరథం పట్టింది. పెద్దతరం నాయకులు ఇతని అడుగుజాడల్లో నడవడమే తన ప్రగతికి, రాష్ట్ర ప్రగతికి చాలా బాగుంటుంది అని అనుకునే స్థాయిలో సాగాయి అతని ప్రసంగాలు. మంత్రిగా మాట్లాడేటప్పుడు ఏ సంయమనం పాటించాలో చూపాడు. ఇక రాజకీయాలలో ఎన్నికల సమరంలో ఎంత విజృంభించి మాట్లాడాలో ప్రత్యర్థులు ఎత్తుగడలను తుత్తునియలు చేయడానికి ఏ భాష వాడి ఎలా నిప్పులు చెరగాలో విజ్ఞత ప్రదర్శించాడు కేటీఆర్. ఈ యువ నాయకుడు చేసిన వాదనలే తెలంగాణ ఓటర్లలో ఒక స్పష్టత రావడానికి తమకు ఏ విధమైన అన్యాయం జరుగుతుందో తెలుసుకొని నాయకత్వాన్ని ఎన్నుకోవడంతో తెలివి చూపించడానికి తోడ్పడింది.

వైరిపక్షాల కూటమి ఏర్పడే ఆలోచన కన్నా ముందే సమరభేరి మోగి 105 మంది అభ్యర్థులను ఎన్నుకోవడం అవతలి గట్టున చెమటలు పుట్టించిన నేపథ్యంలో కూటమి ఏర్పాట్లను ఎన్నడూ కలవని వైరిపక్షనాయకులు ఒక్క మనిషిని ఓడించడానికి ఒక్కటిగా కత్తులు నూరే సమయంలో దానిని అపవిత్ర కూటమి అని గట్టిగా నిరూపించాడు. మీరు ఎంతమంది వచ్చినా, సింహం సింగిల్ గానే వస్తుంది అని సినిమా డైలాగ్‌ని ప్రతిభావంతంగా సందర్భోచితంగా ప్రయోగించాడు. ఇక ప్రతిపక్షం వారు మాది అపవిత్ర కూటమి అయితే తెరాస తెదేపాతో, కాంగ్రెస్‌తో కూడా కూటమి కట్టింది పొత్తుపెట్టుకొని నిలబడలేదా అది అపవిత్రమేనా అని ఎద్దేవా చేసినప్పుడు కూడా వారికి ధీటైన సమాధానం చెప్పిన నాయకుడు కేటీఆర్ ఒక్కడే. ఈ విషయంలో తండ్రి సమాధానం చెప్పకపోయినా ఆ పని కూడా కేటీఆరే చేశాడు. అసలు వీరిద్దరి ప్రసంగాలలో ఒక వ్యాకరణ శాస్త్రం గుర్తుకు వస్తుంది. అదెలాగంటే తండ్రి సూత్ర ప్రాయంగా మాట్లాడితే కేటీఆర్ దాని కి వ్యాఖ్యాప్రాయంగా విస్తరించి

అవతలి వారిని మాటల్తోనే సంహరించే స్థితిలో ఉండేది ప్రసంగం. తెరాస ఒకసారి కాంగ్రెస్‌తో జట్టుకట్టినా, మరొకసారి తెదేపాతో పొత్తు కలిపినా, దాని వెనుక తెలంగాణ రాష్ట్రానికి మద్దతునిచ్చి కేంద్రానికి లేఖ రాసిన తర్వాతనే దానికి మద్దతునిచ్చి తెలంగాణ వ్యతిరేక శక్తులను ఎండకట్టాము. మేము చేసిన ప్రతి కూటమి వెనుకా తెలంగాణ సాధించాలనే లక్ష్యమే ఉంది. కానీ మీరు కట్టే కూటమి వెనుక ఉన్నది కేవలం మీ అధికార దాహం ఒక్కడిని ఓడించాలనే ఏవ తప్ప ఏముంది అని వారి లక్ష్యాలను తీవ్రంగా దెబ్బకొట్టి కూటమి వెనుక ఉన్న కుయుక్తులను ఎండగట్టాడు.

చంద్రబాబునే కాదు కాంగ్రెస్ నాయకులను కూడా ఎన్నికల సమరంలో ఉపన్యాసాల వేదికల మీద చీల్చి చెండాడడంలో ప్రధాన పాత్ర పోషించింది కేటీఆరే. ఉత్తమ్‌కుమార్ రెడ్డిని వట్టి ఉత్తర కుమార ప్రగల్భాలేనని చాలాసార్లు తన ప్రసంగాలలో చెప్పాడు. వాళ్లు చెప్పే లెక్కల్ని కాకి లెక్కలుగా రుజువు చేశాడు. తెరాస గెలిస్తే ఎవరు ముఖ్యమంత్రి అవుతారో తెలంగాణలో ఏ చిన్న పిల్లవాడిని అడిగినా చెబుతారని అదే కూటమి గెలిస్తే ఒకడు చొప్పున 50 మంది ముఖ్యమంత్రులు అయ్యే అవకాశం ఉంది అని గడ్డి పెట్టినట్లు చెప్పేవాడు. మీరు సీట్లు పంచుకోవడమే చేతకాని దద్దమ్మలు మీరు కలిసి పరిపాలన ఎలా చేస్తారు ప్రజలు ఎలా నమ్ముతారు అని చెప్పేవాడు. మీరు సీట్లు పంచుకునేలోపే మేము స్వీట్లు పంచుకుంటామని చమత్కరించారు కూడా. కోదండరాం ధోరణిని విమర్శించినా ఏ నాయకుడిపైన నిప్పులు కురిపించినా సభామర్యాద, ఉపన్యాస మర్యాద, మరువలేదు కేటీఆర్. చౌకబారు విమర్శలు చేయకపోవడం అతని ఉపన్యాసాల విలువను మరింత పెంచింది. ఉద్యమం సాగించి వందల మంది మనబిడ్డలు అమరులు అయి మనం సాధించి తెచ్చుకున్న తెలంగాణని తిరిగి ఈ కూటమి నాయకులు ఇక్కడ అమరావతికో, అక్కడ ఢిల్లీకో కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ సమస్యని ప్రతిభావంతంగా ప్రజలముందు పెట్టాడు. నాలుగు సీట్లని ఎంపిక చేయడానికి వీరు పదిసార్లు ఢిల్లీ చుట్టూ తిరిగారు వీరు అధికారంలోకి వస్తే ప్రజల అధికారం తీసుకుపోయి ఢిల్లీ పాదాల కింద పెడతారు. తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీ పాదాల కిందికి పోతుంది లేదా అమరావతికి పోతుంది అని గట్టిగా వక్కాణించి ప్రజల మనస్సుల్లో జరగబోయే నష్టాన్ని గట్టిగా ముద్రవేసేలా చెప్పగలిగాడు. ఇదే తెరాస అఖండ విజయానికి బాటవేసింది. వైరిపక్షం నాయకులు తనపైన, తండ్రిపైన, సోదరిపైన చేసిన అనుచిత విమర్శలు అన్నింటికీ అదే పదునైన రీతిలో సమాధానం చెప్పాడు కేటీఆర్. అన్ని పార్టీల జాతీయ నాయకులు చేసిన ఆరోపణలను ప్రతిభావంతంగా తిప్పికొట్టాడు.

కేసీఆర్ కుటుంబపాలన గురించి ప్రతి నాయకుడూ మాట్లాడడు. ఇలా మాట్లాడిన నాయకులు అందరూ తమ భార్యకో, తమ తమ్ముడికో, అల్లుడికో సీటు కావాలని తిరిగి పోట్లాటకు దిగిన వారే. కానీ ప్రజాస్వామ్యంలో ప్రతిభ ఉన్న నాయకులు కొడుకులైనా, కూతుళ్లయినా వారికై వారు గెలవాల్సిన పరిస్థితిని గురించి ప్రజల మెప్పు పొందవలసిన అవసరం గురించి కేటీఆర్ చెప్పడమే కాదు అతనే ఒక ప్రత్యక్ష ఉదాహరణ. నాయకులు ఎంత చేయి పట్టుకొని నడిపించిన ప్రతిభలేని నాయకులు అసమర్థులుగా ఎలా డీలా పడింది కూడా మనం చూస్తూనే ఉన్నాం. కేటీఆర్‌ని తెరాస పార్టీకి కార్యనిర్వాహక అధ్యక్షుడుగా కేసీఆర్ ఎంపిక చేయడం దానిని పార్టీ శ్రేణులు అన్నీ ఏకగ్రీవంగా ఆమోదించడం కేటీఆర్ ఇప్పటికే చేస్తున్న పనికి కొత్త పేరు పెట్టి పట్టం కట్టడమే. అధినేత చంద్రశేఖరరావు అతని ప్రతిభని గుర్తించే భవిష్యత్తులో పార్టీని మరింత పటిష్టం చేసే ఉద్దేశ్యంతో చేసిన పనిగానే దీనిని చెప్పుకోవాలి.



-డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

కిటికీలు తెరుద్దాం!

కాలం కేలండర్లో ఓ పేజీ చిరిగిపోయింది.
కాల పుష్పంలోంచి ఓ దళం రాలిపోయింది.
కాలభ్రమణంలో... ఓ అడుగు
కలిసి పోయింది...
కనుమరుగైపోయింది.
కాలం ఉరుకుతోంది...
ఉరకలు వేస్తోంది!
ఉత్సాహం ఊయలలూగుతోంది...
ఉద్రూతలూగుతోంది.!!
కొత్తగాయాలు వస్తున్నాయ్!
కొంగొత్త ఆశలు పూస్తున్నాయ్!!
మమతల పూవులు
మది మదిన విరుస్తున్నాయ్!
అమృతం జల్లులు హృది
హృదిన కురుస్తున్నాయ్!
తూరుపు గట్టున వెలుతురు పిట్టలు
అణువణువునా వెలుగుల గుట్టలు.
చిమ్మ చీకట్లను
తరుముతోంది ఉషోదయం!
ప్రతి ముంగిటా
నిలుస్తోంది శుభోదయం!!
కొత్తగాలులు వీస్తున్నాయ్...
కొంగొత్త ఆశలు పూస్తున్నాయ్!!
కిటికీలు తెరుద్దాం!
పరదాలు పరుద్దాం!!

-రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

నూతన సంవత్సరంపై వివాదం అనవసరం

జనవరి 1న నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవద్దని, అలా జరుపుకోవడం మన సంస్కృతి సాంప్రదాయాలకు విరుద్ధమని, ఉగాదే మనకు తెలుగు సంవత్సరమని కొందరు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ వాదనని బలపరుస్తూ గత ఏడాది డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ నూతన సంవత్సర వేడుకలని దేవాలయాల్లో జరుపరాదని, ఆలయాలని పుష్పాలతో అలంకరించరాదని, భక్తులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెప్పరాదని ఒకసర్క్యులర్ జారీచేసింది. ప్రపంచ వ్యాప్తంగా కుల, మత, వర్గ, జాతులకతీతంగా ప్రజలందరూ నూతన సంవత్సరం సంబరాలని జరుపుకుంటారు. చరిత్రని పరిశీలిస్తే నూతన సంవత్సర సంబరాలనేవి పాశ్చాత్య సంస్కృతి కాదు. నాలుగు వేల సంవత్సరాల క్రితమే మెసపటోమియా (ప్రస్తుత ఇరాక్) ఈ సంబరాలని ప్రారంభించినట్లుగా తెలుస్తుంది. రోమన్లు కొంతకాలం మార్చి 1న నూతన సంవత్సర వేడుకలు జరుపుకొనేవారు. అప్పట్లో సంవత్సరానికి పది నెలలు మాత్రమే ఉండేవి. కొంతకాలం తర్వాత క్రీస్తు జన్మదినమైన డిసెంబర్ 25న నూతన సంవత్సర సంబరాలు జరుపుకోవడం అనేది ఆనవాయితీగా కొనసాగింది.

చైనా, జపాన్, ఈజిప్ట్, దక్షిణ కొరియా వంటి దేశాలు తమ తమ దేశాలలో అక్కడ కాలమాన పరిస్థితులని బట్టి వివిధ కాలాల్లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నాయి. అయితే జనవరి 1నే అవి ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ప్రతి సంస్కృతిలోనూ కొంత మంచి, మరికొంత చెడూ ఉంటాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో అంతర్జాతీయంగా వచ్చే అనేక మార్పులలో మంచిని స్వీకరిస్తూ, మన సమాజంలో ఉన్న చెడుని తొలగించుకోవడం ద్వారా నవ సమాజానికి నాంది పలకవచ్చు. అయితే నూతన సంవత్సర వేడుకలలో మద్యం ఏరులై పారకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరపకుండా ప్రభుత్వమే గట్టి నిఘాని ఏర్పాటు చేయాలి. అప్పుడే నూతన సంవత్సరం గత స్మృతులని నెమరువేసుకోవడానికి అందమైన వేదికగా ఉపయోగపడ్తుంది.

-యం.రాంప్రదీప్
9492712836

సాహిత్యం

భళా భారత్!

ఆస్ట్రేలియన్లు ప్రతిష్ఠాత్మకంగా భావించే బాక్సింగ్ డే టెస్ట్‌లో వారి గడ్డపైనే వారిని మట్టికరిపించిన భారత్ ప్రతిభ ప్రశంసనీయం. కోహ్లీ సేన ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాపై ఏకంగా రెండు టెస్టులు గెలిచి చరిత్ర సృష్టించి భారత్ క్రీడాభిమానులకు పండగ చేశారు. భారత్ సమిష్టి కృషి ఇకముందు కూడా ఇలానే కొనసాగాలి. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ వెన్నులో చలిపుట్టించిన బుమ్రా మెల్‌బోర్న్ టెస్ట్ విజయాన్ని భారత్‌కు కానుకగా అందజేశాడు. టెస్ట్, వన్డే సిరీస్‌లను చేజిక్కించుకోవడం, భవిష్యత్‌లో ప్రపంచకప్‌ను గెలవడంపై భారత్ సీరియస్‌గా దృష్టిసారించాలి. భారత్ అన్న ఫార్మాట్లలోనూ ప్రపంచ నంబర్ వన్ జట్టుగా ఎదగాలి. భారత క్రీడాభిమానులు ఆనందోత్సాహాలతో నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతున్నారు.

-శ్రీశ, భువనగిరి

"ఇదే నైజం"

మనదేశం స్వాతంత్ర్యం పొందటం చాలా ఆలస్యమయినా, దేశ ప్రజలు -చివరికి దేశం విభజింపబడి, ముక్కలయినా ఇదే నైజాన్ని వదిలిపెట్టకుండా కొనసాగిస్తోంది కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం. మన దేశంలో లక్షలాది సోదరీమణులు తీరని అన్యాయానికి అవమానానికి, వివక్షకు, నిత్య అభద్రతా భావానికి గురవుతూ, దినదినగండంగా జీవితాల్ని గడుపుతుంటే... ఏ మహిళా హక్కులు, ఏ మానవ హక్కులు, సమానత్వం గుర్తుకు తెచ్చుకోకుండా, నిస్సిగ్గుగా ఓట్ల కోసం తలాక్ బిల్లుని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోంది. విదేశీయులయిన సుల్తానులు, మొగల్ దురాక్రమణదారులు తమ సంతానాన్ని వృద్ధి చెందించటం కోసం మన సమాజానికంటించిన ఒక వికృత సంప్రదాయంగానే దీన్ని గమనించాలి. తలాక్‌ని ముస్లిం దేశాలు నిషేధించాయి. దీనికి ఇస్లాం మతంతో, ఖురాన్‌తో సంబంధం లేదని ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు. మరి ఎందుకు, ఏ విధంగా తలాక్ బిల్లుని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందో దేశ ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత ఆ పార్టీకి లేదా? తలాక్ చెప్పిన పురుషులు హాయిగా మరో అమ్మాయిని... మరో అమ్మాయిని... ఇట్లా జీవిస్తుంటే, తలాక్‌కు గురయిన సోదరీమణులు దుర్భర జీవితం గడపాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. స్త్రీ సమానత్వం గురించి టన్నులకొద్దీ ఉపన్యాసాలు దంచే కుహనా లౌకికవాదుల స్వార్థ కర్కశత్వాన్ని -వీరి కన్నీళ్ళు కదిలించలేకపోతున్నాయి. దేశప్రజల జీవన్మరణ సమస్యల పరిష్కారంలో కూడా స్వార్థ ప్రయోజనాల గురించి, విభజన రాజకీయాల గురించీ ఆలోచించి రాజకీయ స్వార్థానికే కాంగ్రెస్, దాని పిలక పార్టీలు మొగ్గు చూపుతున్నాయి. విజ్ఞులయిన సోదర ప్రజలారా ఆలోచించండి!

-వీరుభొట్ల పేరయ్య శాస్త్రి, విజయవాడ.

ఆంగ్ల సంవత్సరం కథ... కమామీషు!

క్రీ.పూ. 46 సంవత్సరంలో రోమన్ చక్రవర్తి అయిన జూలియస్ సీజర్, తన ఆస్థాన జ్యోతిష విద్వాంసుడైన సోసీజెన్ అనే వ్యక్తి సహాయంతో ఒక క్యాలెండర్‌ను రూపొందించాడు. ఇది సౌరమాన క్యాలెండర్. భూమి సూర్యుని చుట్టూ ఒకసారి ప్రదక్షిణం చేయడానికి 365.1/4 రోజులు పడుతుంది. సంవత్సరానికి 365 రోజులు, 12 నెలలు, ఏప్రిల్, జూన్, సెప్టెంబర్, నవంబర్ నెలలకు ముప్పయి రోజులు ఫిబ్రవరి నెలలో 28 రోజులు. మిగిలిన నెలల్లో 31 రోజులుంటాయి. 4 చేత నిశ్శేషంగా భాగింపబడే సంవత్సరానికి లీపు సంవత్సరమని పేరు పెట్టినారు. లీపు సంవత్సరంలో మాత్రం 1 ఫిబ్రవరి నెలకు 29 రోజులుంటాయని చెప్పి మిగిలిన 1/4 రోజును సరిపెట్టారు.

1582లో ఇటలీ దేశీయుడైన పోప్ గ్రెగరీ, సీజర్ తయారు చేసిన క్యాలెండర్‌ను మరింత సవరించారు. ఖచ్చితంగా చెప్పాలంటే భూమి, సూర్యుని చుట్టూ ప్రదక్షిణం చేయడానికి 365 రోజులు పడుతుంది. అందువల్ల సీజర్ రూపొందించిన క్యాలండర్‌ను అనుసరిస్తే వెయ్యి సంవత్సరాలకు 7 నుండి 8 రోజులు తేడా వస్తుంది. 400 చేత నిశ్శేషంగా భాగింపబడే సంవత్సరాలలో ఫిబ్రవరి నెలకు 29 రోజులుంటాయని చెప్పి ఈ లోపాన్ని సవరించాడు. అనగా 1500, 1700, 1800, 1900 సంవత్సరాలలో ఫిబ్రవరి నెలలో 28 రోజులుంటాయి. 2000 సంవత్సరంలో ఫిబ్రవరి నెలకు 29 రోజులుంటాయి. మిగిలినవన్నీ సీజర్ తయారు చేసిన క్యాలెండర్ వలెనే ఉంటాయి. దీనిని గ్రిగేరియన్ క్యాలెండర్ అందురు. ఈ క్యాలెండర్ నేడు ప్రపంచవ్యాప్తంగా వాడుకలో ఉంది. అయితే గ్రిగేరియన్ క్యాలెండర్‌ను ఏ నెలతో ఏ తేదీతో ప్రారంభించాలనే సమస్య వచ్చింది. అంతవరకు వివిధ దేశాలలో ఎవరికి ఇష్టమైన నెలను వారు సంవత్సరారంభంగా పరిగణించేవారు. అస్సీరియన్లు సెప్టెంబర్ నెలను సంవత్సరంలో మొదటి నెలగా పరిగణించేవారది. పర్షియన్లు, ఈజిప్షియన్లు, సెప్టెంబర్ 21న నూతన సంవత్సర ఆరంభంగా భావించేవాళ్లది. గ్రీకులకు డిసెంబర్ 2వ తేదీ నూతన సంవత్సరానిది. కన్యమేరికి తాను గర్భం దాల్చబోతున్నట్లుగా, గాబ్రియేలు దూత తెలిపిన రోజు డిసెంబర్ 25. కనుక బ్రిటిష్ వారు ఈ తేదీని నూతన సంవత్సరాదిగా లెక్కించేవారు. 16వ శతాబ్దం వరకు ఫ్రాన్స్‌లో ఏప్రిల్ 1వ తేదీని నూతన సంవత్సర ఆరంభ దినంగా భావించేవారు.

క్రీ.శ.1752 లో ఈ విషయాన్ని గూర్చి బ్రిటిష్ ప్రభుత్వాధికారులు మత పెద్దలతో చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన జనవరి 1వ తేదీని నూతన సంవత్సరాదిగా ప్రకటించారు. వాస్తవ కాలమానానికి ప్రస్తుతం క్యాలెండర్ 42 రోజులు తక్కువగా చూపుతుందని అస్సాంకి చెందిన రాజకీయవేత్త గణేష్ ప్రసాద్ అంటున్నారు. మొదటిసారి 1582 లో అక్టోబర్ 5వ తేదీ నుండి అదే నెల 15వ తేదీ వరకు పది రోజులు తగ్గించారు. గణాంక శాస్త్రజ్ఞులు పదిరోజులను కలపాల్సింది పోయి పొరపాటున తగ్గించారని వారి వాదన. 1752 లో కూడా సెప్టెంబర్ 2 నుండి 14 వ తేదీ వరకు 11 రోజులు తగ్గించారని ఇది కూడా 11 రోజులు కలపాల్సింది పోయి గణాంక శాస్త్రజ్ఞులు పొరపాటున పడి తగ్గించారని ఈయన అభిప్రాయం.

22.3.1957 నుండి చాంద్రమానం ఆధారమైన సంవత్సరాన్ని భారత ప్రభుత్వం అధికారిక క్యాలెండర్‌ను స్వీకరించింది. క్రీ.శ.శక సంవత్సరం 78 సంవత్సరాలు వెనుకబడి ఉంటుంది. హిజ్రీ సంవత్సరం క్రీస్తు శకానికికంటే 584 సంవత్సరాలు వెనుకబడి ఉంటుంది. క్రీ.శ.లక్షసంవత్సరం (31.12.1,00,000) వరకు ఏ రోజున ఏ తేదీ వస్తుంది అనే అంశాన్ని తెలియజేసే క్యాలెండర్‌ను ఇత్యదన్ విత్తయతిల్ (కేరళ వాసి) తయారుచేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆంగ్ల సంవత్సరాదిని జరుపుకుంటారు. 31వ తేదీ రాత్రి 12 గంటలకి కేకులను



కత్తిరించి, స్వీట్లను పంచుతూ, డ్యాన్స్, ఆట, పాటల మధ్య నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. నూతన సంవత్సరం పేరిట భారీగా ఖర్చు పెడతారు. మెసేజ్‌లు పంపడం, గ్రీటింగ్ కార్డులు అందజేయడం ఒకరికొకరు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు చెప్పుకోవడం ఆనవాయితీగా వస్తుంది. యువత పార్టీలు చేసుకుని చిందులు వేయడం, తదనంతరం రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. బైక్‌లపై వేగంగా వెళ్లి మృత్యువాతపడుతున్నారు. పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి ఆంగ్ల సంవత్సరాన్ని ఘనంగా జరుపుకుంటున్నారు. వాస్తవంగా ఉగాది పర్వదినమే తెలుగు సంవత్సరాది. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుదాం. హంగు, ఆర్భాటాలు లేకుండా నూతన సంవత్సరాన్ని స్వాగతిద్దాం.

-కామిడి సతీష్‌రెడ్డి, జడలపేట



భావోద్వేగాల మధ్య అమరావతికి!

- ఉమ్మడి హైకోర్టు చివరి రోజు లాంఛనంగా విధుల నిర్వహణ
- ఏపీ న్యాయమూర్తులు, సిబ్బందికి వీడ్కోలు
- ప్రత్యేక బస్సుల్లో విజయవాడకు పయనం
- హైకోర్టు విభజనపై సుప్రీంలో తొలగిన అడ్డంకులు
- అత్యవసర విచారణకు నో... రేపు పరిశీలన
- విభజన కొనసాగించాలంటూ తెలంగాణ కేవియెట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉద్విగ్న వాతావరణం మధ్య తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు విభజన షురూ అయింది. విభజన నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించకపోవడంతో న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడంతో సోమవారం విభజన ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి హైకోర్టు హోదాలో సోమవారం ఒక గంటసేపు పనిచేసిన న్యాయస్థానం...ఆ తరువాత విభజనకు ఉపక్రమించింది. ఉదయం 1వ కోర్టు హాలులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ మరో న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌విభట్‌తో కలసి సుమారు గంటసేపు విధులు నిర్వర్తించారు. అనంతరం బెంచ్ దిగిపోయారు. దీంతో ఉమ్మడి హైకోర్టు చివరి రోజు పూర్తయినట్లయింది. అనంతరం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌కు జస్టిస్ రాధాకృష్ణన్‌తోపాటు పలువురున్యాయమూర్తులు, న్యాయవాదులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. మరో వైపు హైకోర్టు విభజన కొనసాగించాలంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియెట్ దాఖలు చేసింది.

ఉమ్మడి హైకోర్టు విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది అమరావతికి తరలి వెళుతుండటంతో ఉమ్మడి హైకోర్టు ప్రాంగణంలో సోమవారం హడావిడి, ఉద్విగ్న వాతావరణం చోటు చేసుకుంది. ఆంధ్ర ప్రాంతానికి తరలివెళ్తున్న న్యాయమూర్తులకు, న్యాయ, సిబ్బంది, తెలంగాణ ప్రాంతానికి చెందిన న్యాయవాదులు, సిబ్బంది బాధాతప్త హృదయంతోనే పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏళ్ల తరబడి వారితో ఉన్న అనుబంధాన్ని ఒకరికొకరు గుర్తు చేసుకున్నారు. అందరూ కలసి సెల్ఫీలు తీసుకుంటూ ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఏపీకి న్యాయసిబ్బందిని, న్యాయవాదులను తరలించేందుకు ఐదు గరుడ ఏసీ బస్సులను తెప్పించారు. ఏపీ హైకోర్టు ఫైళ్లను ట్రక్కుల్లో తరలించారు. మంగళవారం నుంచి 900 మంది ఉద్యోగులు ఏపీలోని కోర్టులలో విధులు నిర్వరించనున్నారు.

సుప్రీంలో తొలగిన అడ్డంకులు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు భవన నిర్మాణం పూర్తయ్యే వరకు హైకోర్టు తరలింపును నిలిపివేయాలంటూ ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన హౌజ్ మోషన్ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. ఆ వ్యాజ్యంపై బుధవారం విచారణ చేపడ్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు బుధవారం పనిచేయనుంది. దీంతో ఉమ్మడి హైకోర్టు విభజన సోమవారం అమలైంది. మరోవైపు ఉమ్మడి హైకోర్టు విభజన కొనసాగాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం కేవియెట్ దాఖలు చేసింది.

ఏపీ సీజే ప్రవీణ్‌కుమార్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

హైదరాబాద్ నుంచి హైకోర్టు న్యాయమూర్తులకు ఏపీ ప్రభుత్వ అధికారులు స్వాగతం పలకనున్నారు. న్యాయమూర్తులకు విజయవాడలోని హోటల్‌లో బస ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఇందిరా గాంధీ స్టేడియంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చాగరి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, 14 మంది న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. హైకోర్టు కార్యకలాపాలకు, జడ్జిలు, అధికారుల వసతికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జనవరి 1న హైకోర్టు చీఫ్ జస్టిస్, ఇతర జడ్జిల ప్రమాణ స్వీకారం చేశాక 2వ తేదీ నుంచి హైకోర్టులో విధులు మొదలవుతాయి. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. హైకోర్టు కార్యాలయం కోసం ఎంజీ రోడ్డులోని ఏపీఏటీ భవనంలో 10వేల చదరపు అడుగులు కేటాయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ ఉత్తర్వులు ఇచ్చారు. అక్కడే మౌలిక వసతులు సమకూర్చాలని సీఆర్‌డీఏను ఆదేశించారు. హైకోర్టు కార్యకలాపాలకు అవసరమైన కంప్యూటర్లను సమకూర్చాలని ఐటీ శాఖను ఆదేశించారు. హైకోర్టు జడ్జిలు, రిజిస్ట్రార్లకు నోవాటెల్ హోటల్‌లో వసతి ఏర్పాటు చేయాలని ప్రోటోకాల్ డైరెక్టర్‌ను ఆదేశించారు. ఇతర న్యాయశాఖ అధికారులకు స్టేట్ గెస్ట్‌హౌస్‌లో వసతి ఏర్పాటు చేయనున్నారు. అమరావతిలోని నేలపాడులో హైకోర్టు భవన నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో తాత్కాలిక ఏర్పాట్లు చేశారు.



ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చాగరి ప్రవీణ్ కుమార్‌కు స్వాగతం పలికిన అధికారులు

ఇదిలా ఉండగా ఉమ్మడి హైకోర్టు విభజనకు నిరసనగా రాయలసీమ ప్రాంతానికి చెందిన న్యాయవాదులు సోమవారం ఉదయం హైకోర్టు ఎదుట నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ఉమ్మడిగా కేక్ కట్ చేసి న్యూఇయర్ సంబురం

విడిపోయే సమయంలో కూడా రెండు రాష్ట్రాలకు చెందిన న్యాయవాదులు కలిసి 2019 నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఉమ్మడిగా కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఉమ్మడి హైకోర్టు ప్రాంగణంలోని హైకోర్టు న్యాయవాదుల సంఘం సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్.రాధాకృష్ణన్ తో పాటు ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ చాగరి. ప్రవీణ్ కుమార్ కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘాల అధ్యక్షులు సి.దామోదర్ రెడ్డి, కేబీ రామన్నదొర కార్యదర్శులు జనార్ధన్ గౌడ్, కోమటిరెడ్డి వెంకట నర్సింహా రెడ్డి .సురేష్ కుమార్ రెడ్డి, ఎం. ఆర్కే చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్.రాధాకృష్ణన్, ఏపీ హైకోర్టు ఏసీజే జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ సంయుక్తంగా 2019 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీకి వెళ్లి పోతున్న ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేబీ.రామన్న దొరకు తెలంగాణ న్యాయవాదులు ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని వీడ్కోలు పలికారు.

నేడు తెలంగాణ ప్రధాన న్యాయమూర్తిగా రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ చేత గవర్నర్ నరసింహన్ మంగళవారం ఉదయం 8.30 గంటలకు రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. మిగతా న్యాయమూర్తులచేత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ హైకోర్టు ఆవరణలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కూడా హాజరయ్యే అవకాశం ఉంది.

ప్రధాన న్యాయమూర్తికి, జడ్జీలకు సాదరస్వాగతం

విజయవాడ చేరుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్‌కు సాదర స్వాగతం లభించింది. నగరంలోని ఒక ప్రముఖ హోటల్‌కు చేరుకున్న ఆయనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ, ప్రోటోకాల్ సెక్రటరీ నాగులపల్లి శ్రీకాంత్, కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం స్వాగతం పలికారు. అదే విధంగా విజయవాడకు తరలి వస్తున్న మిగిలిన హైకోర్టు జడ్జీలకు అధికార యంత్రాంగం ఏపీ సరిహద్దుల్లో స్వాగతం పలికారు. కోర్టు సిబ్బందితో పాటు ఏపీకి సంబంధించిన ఫైళ్ళను 10 బస్సుల్లో తీసుకువచ్చారు. విజయవాడ చేరుకున్న న్యాయమూర్తులు సీఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హైకోర్టును పరిశీలించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు రావడంతో విజయవాడలో సందడి వాతావరణం నెలకొంది.



వీడ్కోలు సమావేశంలో హైకోర్టులో ఉభయ ప్రధాన న్యాయమూర్తులు కేక్ కట్ చేస్తున్న దృశ్యం



రాయలసీమ న్యాయవాదుల నిరసన

కొత్త ఏడాది కొత్త హైకోర్టు

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాణం చేయిస్తారు. ఈ కార్యక్రమంలోనూ సీఎం కేసీఆర్ పాల్గొంటారని అధికార వర్గాలు చెబుతున్నాయి. నాలుగున్నరేళ్ళపాటు ఉభయ రాష్ట్రాలకు హైదరాబాద్ కేంద్రంగా హైకోర్టు పనిచేసింది. 29 మంది న్యాయమూర్తులు ఇక్కడి హైకోర్టులో పనిచేయగా, విభజన అనంతరం తెలంగాణకు 13 మంది న్యాయమూర్తుల కేటాయింపు జరిగింది. ఈ మేరకు సుప్రీంకోర్టు కోలీజియం న్యాయమూర్తుల ఎంపికను పూర్తిచేసి నోటిఫికేషన్‌ను జారీచేసింది. మంగళవారం నుంచి తెలంగాణలో 13 మంది న్యాయమూర్తులతో హైకోర్టు పని చేయనుంది. హైకోర్టు ఉమ్మడిగా ఉన్నప్పుడు ఒక్కో కోర్టులో ప్రతిరోజూ 60 నుంచి 90 కేసులు నమోదయ్యేవని, ఇందులో 60 శాతం కేసులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చేవని, మిగతా 40 శాతం తెలంగాణవని అధికారులు చెబుతున్నారు. ఈ గణాంకాల ప్రకారం తెలంగాణలోని హైకోర్టులో ప్రతిరోజూ 30 నుంచి 40 కేసులు దాఖలయ్యే అవకాశాలు ఉన్నాయని హైకోర్టు రిజిస్ట్రార్ కార్యాలయం అంచనా వేస్తోంది.

ఇక పెండింగ్ కేసుల పరిష్కారం వేగవంతం

ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం హైకోర్టులు ఏర్పాటు కావడం ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వరంగా పరిష్కారమవుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే హైకోర్టులో పెండింగ్ కేసులు అధికం కావడంతో ప్రతినెలా లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు నిర్వహించి కేసులను పరిష్కరిస్తున్న సంగతి తెలిసిందే. సుదీర్ఘ కాలంగా కేసులు పరిష్కారం కాక కక్షిదారులు హైకోర్టు చుట్టూ తిరగవలసిన పరిస్థితి ఏర్పడుతోందన్న విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి హైకోర్టులో న్యాయమూర్తుల ఖాళీలను భర్తీ చేయకపోవడం, విధులు నిర్వర్తిస్తున్న న్యాయమూర్తుల్లో అడపాదడపా సెలవులపై వెళ్ళడంతో విచారణకు రావలసిన కేసులు వాయిదా పడుతూ వచ్చాయి. తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు కావడంతో ఇక కేసుల పరిష్కారం త్వరితగతిన సాగుతాయని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి హైకోర్టులో ఐదు లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇందులో రెండు లక్షలు తెలంగాణ రాష్ట్రానికి చెందినవని తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శి కోమటిరెడ్డి నర్సింహారెడ్డి చెప్పారు. తెలంగాణ హైకోర్టుకు 24 మంది న్యాయమూర్తులు అవసరం కాగా, ప్రస్తుతం 13 మందిని మాత్రమే కేంద్రం నియమించింది. మరో 11 మందిని నియమించాల్సి ఉంది.

పేరు మారుతోంది

హైదరాబాద్‌లో ఉమ్మడి హైకోర్టు పనిచేసిన సమయంలో 'హైకోర్టు ఎట్ ద జ్యూడికేచర్ ఆఫ్ హైదరాబాద్ ఫర్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్' అని బోర్డు ఉండేది. ఏపీకి హైకోర్టు తరలివెళ్ళడంతో ప్రస్తుతం ఈ పేరుమారి 'హైకోర్టు ఫర్ ద స్టేట్ ఆఫ్ తెలంగాణ'గా మారిపోయింది. మంగళవారం నుంచి తెలంగాణ హైకోర్టు పూర్తిస్థాయిలో పనిచేయనుంది. ప్రస్తుతం 13 మంది న్యాయమూర్తుల్లో ఆరుగురు చొప్పున మూడు డివిజన్ బెంచ్‌లను ఏర్పాటుచేసి ఆ డివిజన్ బెంచ్‌లకు న్యాయమూర్తులను కేటాయించనుంది. ఒక్కో డివిజన్ బెంచ్‌కు ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులను ఎంపికచేసే సంప్రదాయం ఉంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణన్ ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. 13 మంది న్యాయమూర్తుల్లో ఆరుగురిని మూడు డివిజన్ బెంచ్‌లకు ఇద్దరేసి చొప్పున కేటాయిస్తే మిగిలేది ఏడుగురు న్యాయమూర్తులు. పది కోర్టులు పనిచేస్తుండగా ఏడుగురు న్యాయమూర్తులు వీటిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. మిగతా మూడు న్యాయస్థానాలకు జడ్జీలను సుప్రీంకోర్టు కోలీజియం భర్తీచేస్తే ఈ మూడు కోర్టులు కూడా పూర్తిస్థాయిలో పనిచేయనున్నాయి. ఏపీకి చెందిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది అమరావతికి తరలి వెళ్ళడంతో సోమవారం హైకోర్టులో భావోద్వేగ వాతావరణం ఏర్పడింది. ఉమ్మడి హైకోర్టులో పనిచేసిన 900 మంది సిబ్బంది ఏపీకి తరలివెళ్ళారు. హైకోర్టు విభజనతో తెలంగాణ హైకోర్టులో సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయని హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి నర్సింహారెడ్డి చెప్పారు. ఇప్పటిదాకా ఉమ్మడి హైకోర్టులు పని చేయడంతో వాహనాల పార్కింగ్‌తో పాటు ఇతర కార్యాలయాన్నీ కిటకిటలాడేవని ప్రస్తుతం ఆ సమస్యను అధిగమించగలిగామని చెప్పారు. హైకోర్టు పరిధిలో ఉన్న పది అంతస్తుల పరిపాలనా భవనం ఇతర సౌకర్యాలకు వినియోగించుకుంటామని చెబుతున్నారు. దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కారమై కక్షిదారులకు ప్రయోజనం చేకూరుతుందన్న ఆశాభావాన్ని తెలంగాణ న్యాయవాదులు వ్యక్తంచేస్తున్నారు. లక్షలాది కేసులు పరిష్కారం కాకపోవడంతో కక్షిదారులు పడుతున్న వెతలు అన్నీఇన్నీ కావని విభజనతో ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెబుతున్నారు.

గ్రామంలో ఓటుంటేనే పోటీకి ఛాన్స్

- వార్డుల్లో ఓటుంటేనే సభ్యుడిగా పోటీకి అర్హత
- పంచాయతీ ఎన్నికల నిబంధనలు కఠినతరం
- జైలుశిక్ష పడ్డవారు ఐదేళ్లపాటు అనర్హులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు పాటించాల్సిన నియమ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి పోటీ చేయదలిచిన వారు ఆ గ్రామ పంచాయతీ పరిధిలో ఓటరుగా నమోదై ఉండాలి. అదేవిధంగా వార్డు స్థానానికి పోటీ చేయదలిచిన వారు అదే వార్డుపరిధిలో ఓటరై ఉండాలి. ఒక అభ్యర్థి ఒక వార్డుకు మించి పోటీచేయకుండా ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది.

ఇలా అయితే అనర్హతే

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం నామినేషన్ పరిశీలన నాటికి అభ్యర్థి వయస్సు 21ఏళ్లు పూర్తియి ఉండాలి.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి ఇద్దరికంటే ఎక్కువగా పిల్లలు ఉంటే ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు. ఒకవేళ పోటీ చేసే వ్యక్తికి 1995 మే 31నాటికంటే ముందే ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను కలిగివున్నట్లయితే అతడు లేదా ఆమె ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత కలిగి ఉంటారు. 1995జూన్ 1 తర్వాత ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలను కలిగినవారు పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనర్హులు. ఉమ్మడి రాష్ట్రంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం దత్తత ఇచ్చిన పిల్లలు స్వంత తల్లిదండ్రులకు చెందిన పిల్లలుగానే పరిగణించబడతారు. ఇద్దరు పిల్లలు ఉన్న తరువాత భార్య గర్భవతి అయినా ఎన్నికల్లో పోటీకి అనర్హులుగానే పరిగణిస్తారు.

క్రిమినల్ కోర్టు దోషిగా నిర్ధారించిన వారిని శిక్ష ఖరారైన రోజునుంచి ఐదేండ్ల వర కూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడిగా పరిగణించనున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. బెయిల్‌పై విడుదలైన వారికి కూడా పోటీ చేసే అవకాశం ఉండదు. ఆర్థికంగా దివాళా తీసినట్టు కోర్టు నిర్ధారించిన వారు, ఐపి పెట్టిన వారు, ఐపీకి దర ఖాస్తు చేసుకున్న వారు కూడా పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనర్హులే. మతిస్థిమితం సరిగా లేనివారు, చెవిటి, మూగవారు ఎన్నికల్లో పోటీకి అనర్హులు. ప్రస్తుత, లేదా గత ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీకి బకాయిలు ఉండటం, నోటీసులు ఇచ్చినా, తదుపరి గడువు ముగిసినా బకాయిలు చెల్లించని వారు ఎన్నికల్లో పోటీకీ అనర్హులు.

వీరికి నో ఛాన్స్

పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో, స్థానిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ వర్కర్లు, దేవాలయాలు, మత సంస్థల ఛైర్మన్లు, ఆర్టీసీ, సింగరేణి సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం లేదు. అయితే వారు తమ ఉద్యోగానికి రాజీనామా చేసి ఆమోదింపచేసుకున్న తరువాతే ఎన్నికల్లో పోటీకీ అర్హులవుతారు. అభ్యర్థి తప్పుడు సమాచారం ఇచ్చినప్పటికీ నామినేషన్ తిరస్కరించరు. కాని అభ్యర్థిపై ఇతరులు ఫిర్యాదు చేస్తే మాత్రం అభ్యర్థి ఇచ్చిన నామినేషన్ పత్రాల్లోని సమాచారం తప్పు అని రిటర్నింగ్ అధికారి భావించినట్టయితే నేరుగా ఐపీసీ సెక్షన్ 177, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 195 ప్రకారం అదే ప్రాంతానికి చెందిన న్యాయస్థానంలో ఫిర్యాదు చేయాలేతప్ప నామినేషన్ తిరస్కరించరు. ఒక్కసారి నామినేషన్ వేసిన తరువాత మార్పులు చేర్పులకు అవకాశం ఉండదు. నామినేషన్ వేస్తున్న వ్యక్తి ఎలాటి ధ్రువీకరణ పత్రాలు అదే రోజు సమర్పించకపోయనప్పటికీ నామినేషన్ స్వీకరిస్తారు. నామినేషన్ల చివరితేది సాయంత్రం 5 గంటల లోపు ధ్రువీకరణ పత్రాలు అందచేయాలి.

అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం


హైదరాబాద్, ఆంధ్రప్రభ: పంచాయతీ ఎన్నికలల్లో పోటీ చేసే అభ్యర్థులకు అవగాహన కల్పించేందుకు ఉచిత శిక్షణను జాయిన్ ఫర్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. జనవరి ఆరు, ఏడు తేదీలలో జరిగే శిక్షణా కార్యక్రమంలో పాల్గొనే అభ్యర్థులకు మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ పలు అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జనవరి మూడవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఫౌండేషన్ కోరింది. మేధావులు, పంచాయతీరాజ్ సంస్థ నిపుణులు అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారని ఫౌండేషన్ తెలిపింది. పంచాయతీ రాజ్ చట్టం, గ్రామీణాభివృద్ధి, 73,74వ రాజ్యాంగ సవరణ సహా పలు అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు ఫౌండేషన్ పేర్కొంది. అభ్యర్థుల దరఖాస్తు వివరాలకై జెడిఫౌండేషన్ డాట్ ఇన్ వెబ్‌సైట్, 9533327563 నెంబర్లలో సంప్రదించాలని ఫౌండేషన్ కోరింది.



సిమ్లాలో న్యూఇయర్ వేడుకల్లో పాల్గొన్న యువత

పోలవరం సాగులోకి... మరో 32 లక్షల ఎకరాలు!

- జల వనరుల అధ్యయనం పూర్తి
- 7న గిన్నిస్ రికార్డుకు శ్రీకారం
- 30 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు: ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి



అమరావతి, ఆంధ్రప్రభ : పోలవరం సాగు విస్తీర్ణం మరో 32 లక్షల ఎకరాలు పెరిగిందని, దీంతో మొత్తం 75.38 లక్షల ఎకరాలకు సాగునీరంది రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. సోమవారం ఉండవల్లి ప్రజావేదికలో పోలవరం ప్రాజెక్టుపై 84వసారి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ రివ్యూ నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్ల ఎత్తు వరకు నిర్మించడం వల్ల తలెత్తే ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని ముంపు ప్రాంతాల ప్రజలను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సకల చర్యలు తీసుకుని ముందుకుపోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. ముంపు బాధితులకు సంబంధించి ఆర్ఆర్ ప్యాకేజీ కింద నిర్మిస్తున్న ఇళ్ల కాలనీలను మార్చి నాటికి పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పనుల పురోగతి వివరాలను జలవనరుల శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలో 75.38 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం సాధ్యమవుతుందని జలవనరుల శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి, రాష్ట్రంలో ఏ జిల్లాకు ఎంతమేర ప్రయోజనం కలుగుతుందనే లెక్కలు తేల్చామని చెప్పారు. మొత్తం 13 జిల్లాలకు లబ్ధి కలుగుతుందని పేర్కొన్నారు. అత్యధికంగా ప్రకాశం జిల్లాకు సాగునీటి వసతి సాధ్యమవుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో 32.2 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి రావడమే కాకుండా 43.18 లక్షల ఎకరాలు స్థిరీకరణ జరుగుతుందని చెప్పారు. అలాగే విశాఖ నగరానికి తాగునీరుకు 7.32 టీఎంసీలు, విశాఖ పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలకు 16.12 టీఎంసీలు, కాలువల ద్వారా 540 గ్రామాల్లోని 28.5 లక్షల మందికి తాగునీరు లభిస్తుందన్నారు. ఒడిషాకు 5 టీఎంసీలు, చత్తీస్‌గఢ్‌కు 1.5 టీఎంసీలు అందించడం సాధ్యమవుతుందన్నారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు మొత్తం 63.27 శాతం పూర్తికాగా, తవ్వకం పనులు 83.60 శాతం, కాంక్రీట్ పనులు 57.90 శాతం పూర్తయినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కుడి ప్రధాన కాలువ 90 శాతం, ఎడమ ప్రధాన కాలువ 66.77 శాతం, రేడియల్ గేట్ల ఫ్యాబ్రికేషన్ 62.52 శాతం పూర్తికాగా, కాఫర్ డ్యామ్ పనులు 6.04 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. గత వారం స్పిల్‌వే, స్పిల్ చానల్ ఫైలట్ చానల్, అప్రోచ్ చానల్, లెఫ్ట్ ఫ్లాంక్‌కు సంబంధించి 4.22 లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వకం పనులు, స్పిల్‌వే, స్పిల్ చానల్, స్టిల్లింగ్ బేసిన్‌కు సంబంధించి 51 వేల క్యూబిక్ మీటర్ల వరకు కాంక్రీట్ పనులు పూర్తయినట్లు తెలిపారు. కాంక్రీట్ పనులు 36.79 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 21.30 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తయ్యాయి. తవ్వకం పనులు 1115.59 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 933.01 లక్షల క్యూబిక్ మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. జనవరి 7వ తేదీన 28వేలు నుంచి 30 వేల క్యూబిక్ మీటర్ల మేర కాంక్రీట్ పనులు పూర్తి చేసి,గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు అధికారులు సీఎంకి వివరించారు. అలాగే ప్రాధాన్య ప్రాజెక్టులను సమీక్షించిన ముఖ్యమంత్రి మదనపల్లి, చిత్తూరు, కుప్పం, రామ కుప్పం, పుంగనూరు, బద్వేలు, మడకశిర, హిందూపురం, పులివెందులకు సాగునీరు, తాగునీరు అందేలా చూడాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్రప్రభుత్వం మొత్తం రూ.15,380.97 కోట్లు ఖర్చు చేయగా, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత రూ. 10,245.10 కోట్లు ఖర్చు పెట్టినట్లు అధికారులు చెప్పారు.

అందరికీ సదుపాయాలు కల్పించాం

- టెలి కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ సీఎం

అమరావతి, ఆంధ్రప్రభ: ''నేను బృంద నాయకుడిని మాత్రమే మొత్తం ఘనత బృందానికే చెందుతుంది.. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.. 2019లో అందరికీ శుభం జరగాలి.. తిరుగులేని శక్తిగా ఆంధ్రప్రదేశ్ రూపొందాలి. ప్రపంచం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపే చేడాలి...'' అంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 'నీరు-ప్రగతి' పురోగతిపై ముఖ్యమంత్రి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పలు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరి ఇబ్బందులు తొలగించడంలో ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, ప్రతీ ఒక్కరికీ సదుపాయాలు కల్పించామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2018 సంవత్సరంలో వివిధ శాఖల ఉన్నతాధికారలు, అధికారులు అద్భుతంగా పనిచేశారని, తద్వారా అన్ని శాఖల్లోనూ పురోగతిని సాధించామని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 2018లో చేసిన కృషికి ఫలితాలను 2019లో వస్తాయన్నారు. తొలి 6 నెలల్లోనే 11.5 శాతం వృద్ధిని సాధించడం గర్వించతగిన విషయమన్నారు. ఈ ఏడాది వివిధ రంగాలలో 675కు పైగా అవార్డులు సాధించడమే ఇందుకు నిదర్శనమని సీఎం స్పష్టం చేశారు. కృషికళ్యాణ యోజనలో రాష్ట్రంలోని విజయనగరం, విశాఖపట్నం, కడప 3 జిల్లాలు దేశంలోనే మొదటి స్థానాన్ని సాధించాయన్నారు. ముందుచూపు, నూతన ఆవిష్కరణలు, జవాబుదారీతనం, డిజిటలైజేషన్, ఉబరైజేషన్, కన్జర్వేషన్, టెక్నాలజీ, ట్రాన్స్‌ఫర్మేషన్ (వయాడక్ట్) తోనే ఇన్ని అవార్డులు లభించాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విశాఖపట్నంలో మెడ్‌టెక్ జోన్ దేశానికే తలమానికమని, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువత ఉపాధి కోసమే ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఐదు వేల మంది కౌలు రైతులకు పంటరుణాలు అందించడం అనేది దేశంలోనే చరిత్ర అని, రాష్ట్రంలో కౌలు రైతులు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా చేశామని, పంటబీమా రాష్ట్రప్రభుత్వ వాటాను కేంద్రప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో నరేగాలో ఇప్పటి వరకూ రూ.7 వేల కోట్లను సద్వినియోగం చేయడంలో సహకరించిన అధికారులందరికీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే 4 నెలలు మరిన్ని నిధులు సాధించుకోవాలని సీఎస్ సూచించారు.

Andhraprabha business 2018

బిజినెస్



7.25 కోట్లు హాం ఫట్

ముంబై : ఈ ఏడాది చివరి ట్రేడింగ్ సోమవారంతో ముగిసింది. ఇన్వెస్టర్ల సొమ్ము ఏకంగా రూ.7.25 లక్షల కోట్లు హారతి కర్పూరంలా కరిగిపోయింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీలమార్కెట్ల క్యాప్ ఏకంగా రూ.7,25,401.31 కోట్లు క్షీణించి రూ.1,44,48,465.69 కోట్లకు దిగివచ్చింది. ఈ ఏడాది బెంచ్‌మార్కు సూచి 2,011.5 పాయింట్లు లేదా 5.90 శాతం లాభపడింది. ఈ ఏడాది ఆగస్టులో అత్యధికంగా సెన్సెక్స్ ఆగస్టు 29న రికార్డుస్థాయిలో 68,989.65 పాయింట్లకు చేరగా..అటు తర్వాత చివరి రోజు 36,068.33 పాయింట్ల వద్ద ముగిసింది. దీని ప్రకారం చూస్తే సెన్సెక్స్ 2,921.32 పాయింట్లు లేదా 7.5 శాతం క్షీణించింది. సోమవారం నాటి ట్రేడింగ్ విషయానికి వస్తే సెన్సెక్స్ 8.39 శాతం క్షీణించి 36,068.33 పాయింట్ల వద్ద ముగిసింది. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ ఏడాది ద్వితీయార్థం మార్కెట్లు పలు సవాళ్లను ఎదుర్కొందని.. ముఖ్యంగా గ్లోబల్ పరిణామాలతో పాటు దేశీయ పరిణామాల కారణాల వల్ల మార్కెట్లు ఒడిదుడుకులను చవిచూడాల్సి వచ్చిందని చెబుతున్నారు. రాబోయే రోజుల్లో అంటే స్వల్పకాలికానికి మార్కెట్లు ఇలానే ఒడిదుడుకులకు లోనవుతుంటాయని చెబుతున్నారు. దీనికి కారణం షేర్లు ప్రీమియం వాల్యుయేషన్‌లో ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. 2019 ప్రథమార్ధంలో మార్కెట్ సరళి గురించి జియోజిత్ రీసెర్చి చీఫ్ వినోద్ నాయర్ అంచనా ప్రకారం దేశీయ ఆర్థిక వ్యవస్థ మందగించడం, వచ్చే రెండు త్రైమాసికాల పాటు కార్పొరేట్ లాభాలు అంతంత మాత్రంగానే ఉండటం, పట్టణ, గ్రామీణ మార్కెట్లలో ద్రవ్యకొరత, వచ్చే ఏడాది లోకసభ ఎన్నికలు, ప్రభుత్వం జనాకర్షక పథకాలు ప్రకటించే అవకాశం, గ్లోబల్ మార్కెట్ల ప్రభావం, కరెన్సీ ఒడిదుడుకులు తదితర అంశాలు వచ్చే ఏడాది ప్రథమార్ధంలో మార్కెట్లపై ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. వచ్చే ఏడాది ద్వితీ యార్థం నుంచి పరిస్థితులు మెరుగుపడతాయని, దీర్ఘ కాలిక ప్రాతిపదికన పెట్టుబడులు వస్తాయని దీంతో మార్కెట్లు పుంజుకుంటాయని నాయర్ వివరించారు. సోమవారం బీఎస్ఈలోని 30 షేర్లలో 15 షేర్లు నష్టాలతో ముగిశాయి. భారతి ఎయిర్‌టెల్, యాక్సి స్‌బ్యాంకు, హీరోమోటో, ఎన్‌టీపీసీలు నష్టాలను చవి చూశాయి. దేశంలో అత్యంత విలువైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఇలా ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.7, 10,584.48 కోట్లు, టీసీఎస్ రూ.7,10,532.81 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రూ.5,77,309.35 కోట్లు, హిందుస్తాన్ యూనీలీవర్ లిమిటెడ్ రూ.3,93,544 కోట్లు, ఐటీసీ రూ.3,44, 934.39 కోట్లు వరుసగా టాప్ ఐదులో నిలిచాయి. బీఎస్ఈలో సోమవారం 1503 షేర్లు లా భాలతో ముగియగా.. 110 5షేర్లు నష్టపోయాయి. 192 షేర్లలో ఎలాంటి మార్పులేవు.

భారీగా నష్టపోయిన షేర్లు

కంపెనీ పేరు	31 డిసెంబర్ 18	29 డిసెంబర్ 17	శాతం
టాటామోటార్స్ లి.	173.1	431.9	-59.9
ఎస్ బ్యాంకు	181.9	315.9	-42.3
భారతి ఎయిర్‌టెల్	312.3	529.7	-41.0
వేదాంత లిమిటెడ్	202.2	329.9	-38.7
హెచ్‌పీసీఎల్	253.1	418.6	-39.5

మురిపించని మార్కెట్

- చివరి ట్రేడింగ్ స్వల్ప నష్టాలతో వీడ్కోలు
- వరుసగా మూడో ఏడాది లాభాలతో ముగింపు

ఈ ఏడాది చివరి ట్రేడింగ్ సెషన్ సోమవారం ఇన్వెస్టర్లను పెద్దగా మురిపించలేకపోయింది. స్వల్పనష్టాలతో వీడ్కోలు పలికింది. అయితే ఏడాది ప్రాతిపదికన చూస్తే వరుసగా మూడో సంవత్సరం లాభాలను పంచిందని చెప్పుకోవచ్చు. గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు రావడంతో పాటు రూపాయి బలపడ్డం మార్కెట్లకు బాగా కలిసొచ్చింది. మొత్తానికి బీఎస్ఈ 30 షేర్ల సూచి 8.39 పాయింట్లు లేదా 0.02 శాతం క్షీణించి 36,068.33 వద్ద ముగిసింది. నిఫ్టీ 2.65 పాయింట్ల నష్టపోయి 10,862.88 వద్ద ముగిసింది. ఫారెక్స్ మార్కెట్లో భారతీయ కరెన్సీ రూపాయి 16 పైసలు బలపడి 69.80 వద్ద స్థిరపడింది..

ఏడాది ప్రాతిపదికన చూస్తే సెన్సెక్స్ 2,011 పాయింట్లు లేదా 5.9 శాతం (2018లో) లాభపడింది. గతేడాది అంటే 2017లో 30 షేర్ల సెన్సెక్స్ మాత్రం రికార్డు స్థాయిలో 28 శాతం లాభాలను పంచి ఇచ్చింది. అదే 2016లో కేవలం రెండు శాతం మాత్రమే ఇన్వెస్టర్లకు లాభాల రుచిని చూపించింది. ఇక నిఫ్టీ విషయానికి వస్తే ఈ ఏడాది మొత్తానికి చూస్తే 332 పాయింట్లు లేదా 3.2 శాతం లాభపడింది. క్రితం ఏడాది రికార్డుస్థాయిలో 28.65 శాతం, అదే 2016లో కేవలం మూడు శాతం మాత్రమే ఇన్వెస్టర్లకు లాభాలను పంచి ఇచ్చింది. సోమవారం నాడు సెన్సెక్స్‌లో అత్యధికంగా లాభపడిన షేర్ల విషయానికి వస్తే సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, వేదాంత, ఎస్‌బ్యాంకు, టాటామోటార్స్, హెచ్‌సీఎల్ టెక్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, కొటక్ బ్యాంకు, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, బజాజ్‌ఆటోలున్నాయి. నష్టపోయిన షేర్ల విషయానికి వస్తే.. ఐటీసీ, ఎల్‌అండ్‌టి, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఓఎన్‌జీసీ, ఐసీఐసీఐ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీలున్నాయి. ఈ ఏడాది స్టాక్ మార్కెట్లు ఆద్యంతం ఒడిదుడుకులకు లోను కావడంతో ఇన్వెస్టర్లు సుమారు రూ.7.25 లక్షల కోట్ల సొమ్ము నష్టపోయారు. బీఎస్ఈలో లిస్ట్ అయిన కంపెనీల మార్కెట్ క్యాపిటల్ ఈ ఏడాది రూ.7,25,401.31 కోట్లు క్షీణించి రూ.1,44,48,465.69 కోట్లకు దిగివచ్చింది.

ఇదిలా ఉండగా గ్లోబల్ మార్కెట్లు, కమాడిటీ ధరలు సోమవారం నాడు పెరిగాయి. దీనికి కారణం అమెరికా - చైనాల మధ్య వాణిజ్య యుద్ధానికి ముగింపు పలకాలని రెండు అగ్రరాజ్యాలు నిర్ణయించడమే. ఈ ఏడాది సెన్సెక్స్ అత్యధికంగా 38,989.65 పాయింట్లకు ఆగస్టు 29న ఎగబాకింది. అదే మార్చి 23వ తేదీన అత్యంత కనిష్ఠానికి 32,483.84 మార్కుకు దిగివచ్చింది.

ఈ ఏడాది చివరి ట్రేడింగ్ రోజు ట్రేడింగ్ విషయానికి వస్తే.. గ్లోబల్ మార్కెట్లు లాభాలతో దూసుకుపోవడంతో సెంటిమెంట్ ప్రకారం దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై కనిపించింది. అమెరికా - చైనాలు వాణిజ్య యుద్ధానికి తెరదించాలని నిర్ణయించడమే దీనికి ప్రధాన కారణం.. అయితే కొంత మంది ఇన్వెస్టర్లు గ్లోబల్ వృద్ధిరేటు ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశాలున్నాయని లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో మార్కెట్లు స్వల్పనష్టాలతో ముగిశాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా బ్రెంట్ క్రూడ్ పీపా 1.84 శాతం పెరిగి 54.19 వద్ద ట్రేడ్ అయ్యింది. 2019 మార్కెట్ గురించి : వచ్చే ఏడాది స్టాక్ మార్కెట్లను శాసించే అంశాలు గురించి విశ్లేషకులు పలు అంశాలను ప్రస్తావించారు. వాటిలో ముడిచమురు ధరలు, కరెన్సీ, కార్పొరేట్ లాభాలు, కేంద్ర బడ్జెట్, లోక్‌సభ ఎన్నికలు, వాణిజ్య యుద్ధాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనం తదితర అంశాలు కలిసి మార్కెట్లపై ప్రభావం చూపుతాయని విశ్లేషిస్తున్నారు. చివరి ట్రేడింగ్ గురించి షేర్‌ఖాన్, బీఎన్‌పీ పారిబస్‌లకు చెందిన విశ్లేషకులు మాత్రం గ్లోబల్ మార్కెట్లో మిశ్రమ స్పందనలు, అలా గే మార్కెట్లకు దశదిశ చూపించే అంశాలు లేనందువల్ల మార్కెట్లు నష్టాలతో వీడ్కోలు పలికాయని చెబుతు న్నారు. వచ్చే ఏడాది 2019 మార్కెట్ల గురించి ప్రస్తావి స్తూ.. తక్షణమే ఇన్వెస్టర్ల దృష్టి సాధారణ ఎన్నికలపై ఉంటుందని.. అయితే మొత్తానికి మార్కెట్లను నడిపిం చేది మాత్రం రిజ ర్వుబ్యాంకు వడ్డీరేట్లు.. ఫెడరల్ రిజ ర్వు... రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా వడ్డీరేట్లు.. చమురు ధరలు, అమెరికా - చైనా వాణిజ్య యుద్ధాలు, బ్రెగ్జిట్‌ల ప్రభావం చూపుతాయని అంచనా వేస్తున్నారు.

యాక్సిస్ బ్యాంకు ఎండీ, సీఈవో శిఖాశర్మ పదవీ విరమణ

- కొత్త ఎండీ, సీఈవో అమితాబ్ చౌదరి



న్యూఢిల్లీ : యాక్సిస్ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో శిఖాశర్మ డిసెంబర్ 31వ తేదీన పదవి విరమణ చేశారని యాక్సిస్ బ్యాంకు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఆమె స్థానంలో జనవరి 1, 2019 నుంచి మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా అమితాబ్ చౌదరి బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపింది. ఇక చౌదరి విషయానికి వస్తే ఆయన హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీ మాజీ ఎండీ, సీఈవోగా పనిచేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే ఆయనను యాక్సిస్ బ్యాంకు ఎండీ, సీఈవోగా మూడు సంవత్సరాల కాలపరిమితికి ఎంపిక చేశారు. ఇదిలా ఉండగా ఈ నెల 8వ తేదీన యాక్సిస్ బ్యాంకు చౌదరిని అదనపు డైరెక్టర్ నియమించింది. చౌదరి (54) విషయానికి వస్తే ఆయన బ్యాంకు ఆఫ్ అమెరికాలో 1987 లో కార్పొరేట్ బ్యాంకింగ్‌తో తన కెరిర్‌ను ప్రారంభించారు. అక్కడే ఆయన వివిధ హోదాల్లో పనిచేసి విశేష అనుభవం గడించారు. విద్యార్హత విషయానికి వస్తే ఆయన బీటెక్ (ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్) డిగ్రీని బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌నుంచి పొందారు. అలాగే పిలాని, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి. ఇక శిఖాశర్మ విషయానికి వస్తే తన పదవి కాలాన్ని మూడు సంవత్సరాల నుంచి తగ్గించి ఏడు నెలలకు పరిమితం చేసుకున్నారు. దీనికి వ్యక్తిగత కారణాలని ఆమె చెప్పారు. దీన్ని బోర్డు కూడా ఆమోదించింది. అయితే శర్మ నియామకంపై మరోసారి ఆలోచించుకోవాలనియాక్సిస్ బోర్డును ఆర్‌బీఐ కోరింది. ఆమె పదవి కాలంలో బ్యాంకుల్లో మొండిబకాయిలు పెరిగిపోయాయని ఆరోపణలను ఆమె మూటగట్టుకున్నారు.

మౌలిక రంగం డీలా

- నవంబర్‌లో 3.5 శాతం
- 16 నెలల కనిష్ఠానికి.. తగ్గిన ముడిచమురు, ఎరువుల ఉత్పత్తి



న్యూఢిల్లీ : కీలకమైన ఎనిమిది రంగాలు గత నెలలో బాగా నీరసించాయి. వృద్ధిరేటు ఏకంగా 16 నెలల కనిష్ఠానికి 3.5 శాతానికి దిగివచ్చాయి. ముఖ్యంగా ముడిచమురు, ఎరువులు ఉత్పత్తి తగ్గిపోవడమే కారణమని ప్రభుత్వం సోమవారం నాడు విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. చివరగా ఇలాంటి పరిస్థితి జులై 2017లో 2.9 శాతం కనిపించింది. మౌలికరంగానికి చెందిన ఎనిమిది కీలక రంగాలు ఇలా ఉన్నాయి. బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ రంగాల్లో గత ఏడాది నవంబర్‌లో 6.9 శాతం సాధించాయి.

అయితే ఈ ఏడాది నవంబర్‌లో ముడిచమురు, ఎరువుల ఉత్పత్తి తిరోగమనబాటపట్టాయి. -3.5 శాతం, -8.1 శాతంవృద్ధిని సాధించాయి. ఇక సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఉక్కు, సిమెంట్ రంగాల్లో మాత్రం వరుసగా 0.5 శాతం, 2.3 శాతం, 6 శాతం, 8.8 శాతం వృద్ధి కనిపించింది. ఈ ఎనిమిది కీలకరంగాలు పారిశ్రామికోత్పత్తివృద్ధిరేటు (ఐఐపీ) సూచిలో 41 శాతం వాటాను ఆక్రమిస్తుంది. అయితే బొగ్గు, విద్యుత్ ఉత్పత్తి రంగాలు వరుసగా 3.7 శాతం, 5.4 శాతం వృద్ధిని కనబరిస్తే.. క్రితం ఏడాది ఇదే నెలలో 0.7 శాతం, 3.9 శాతం వృద్ధి కనిపించింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు చూస్తే ఈ ఎనిమిది కీలక రంగాల్లో 5.1 శాతం కనిపిస్తే.. క్రితం ఏడాది ఇదే కాలంలో 3.9 శాతం వృద్ధి కనిపించింది.


ఎన్‌సీడీల ద్వారా నిధుల సేకరణ రూ.29,300కోట్లు

న్యూఢిల్లీ : భారతీయ కంపెనీలు నాన్ కన్వర్టబుడల్ డిబెంచర్స్ (ఎన్‌సీడీ)ల ద్వారా రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 2018లో రూ.29,300 కోట్లు సేకరించింది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే మూడు రెట్లు పెరిగింది. కంపెనీలు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి, లేదా వ్యాపారావసరాల కోసం ఈ నిధులను సేకరించాయి. ఎన్‌సీడీల ద్వారా సేకరించే బాండ్లు షేర్లుగా మారవు. అయితే సాధారణంగా బ్యాంకులు ఇచ్చే వడ్డీ కంటే ఎక్కువ వడ్డీ రేటు గిట్టుబాటు అవుతుంది. మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి విడుదల చేసిన తాజా గణాంకాలను బట్టి చూస్తే.. ఈ ఏడాది ఎన్‌సీఎడీల ద్వారా కంపెనీలు మొత్తం రూ.29,394 కోట్లు సేకరిస్తే.. 2017లో రూ.9,779 కోట్లు మాత్రమే సేకరించగలిగాయి.

ఇంతకు కార్పొరేట్లు ఎన్‌సీడీల ద్వారా నిధులు సేకరణకు కారణం ఏమిటంటే ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు కార్పొరేట్‌లకు రుణాలు ఇవ్వడానికి వెనుకంజ వేయడం, దీంతో పాటు బ్యాంకు వడ్డీరేట్ల కంటే కార్పొరేట్ బాండ్లపై వడ్డీరేటు ఎక్కువ గిట్టుబాటు కావడంతో ఎన్‌సీడీలకు డిమాండ్ పెరిగిందని డబ్ల్యుజీసీ వెల్త్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ రాజేష్ చతుర్వేది చెప్పారు. కంపెనీలు ఎన్‌సీడీల ద్వారా సేకరించిన నిధులను వ్యాపారాలు విస్తరించుకోవడానికి, రిటైరింగ్ డెబిట్, మూలధనం కోసం, దీంతో పాటు సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం ఈ నిధులను సేకరించాయి. ఈ ఏడాది ఎన్‌సీడీల ద్వారా నిధులు సేకరించిన కంపెనీల జాబితా ఇలా ఉంది. ముత్తూట్ ఫైనా న్స్, కోసమట్టమ్ ఫైనాన్స్, శ్రేయి ఈక్విప్‌మెంట్ ఫైనాన్స్, దీవాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్, క్రెడిట్ సొల్యూష న్స్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ కంపెనీ, ఈసీఎల్ ఫైనాన్స్, ఇండియా బుల్ కమర్షియల్ క్రెడిట్, టాటా క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్, మణప్పురం ఫైనాన్స్, కెఎల్‌ఎం యాక్సివా ఫిన్‌వెస్ట్. కోసమట్టమ్ ఫైనాన్స్, శ్రీరామ్‌ట్రాన్స్ ఫోర్టు ఫైనాన్స్ కంపెనీ, జెఎం ఫైనాన్షియల్ క్రెడిట్ సొల్యూషన్స్‌లు ఈ ఏడాది రెండుసార్లు ఎన్‌సీడీల ద్వారా నిధులు సేకరించాయి. దీవాన్ హౌసింగ్ రూ.10,945 కోట్లు సేకరించింది. వాస్తవానికి రూ.3,000 కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. టాటా క్యాపిటల్ ఫైనాని షియల్ సర్వీసెస్ వాస్తవానికి రూ.2,000 కోట్లు సేకరించాలని అనుకున్నా.. రూ.3,373 కోట్లు సేకరించింది.

మొండిబకాయిలు తగ్గుతున్నాయి

- బ్యాంకింగ్ రంగం కోలుకుంటోంది :ఆర్‌బీఐ గవర్నర్ దాస్



ముంబై : బ్యాంకింగ్ రంగంలో మొండిబకాయిలు గాడినపడుతుండటంతో బ్యాంకింగ్ వ్యవస్థ క్రమంగా కోలుకుంటోందని రిజర్వుబ్యాంకు గవర్నర్ శక్తికాంతదాస్ సోమవారం నాడు చెప్పారు. అయితే ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల్లో పలు సంస్కరణలు తేవాల్సిన అవసరం ఉందన్నారు. బలహీనమైన పీఎస్‌యు బ్యాంకులకు మూలధనం అవసరం ఎంతైనా ఉందని ఆర్‌బీఐ అర్థ సంవత్సరం ఆర్థిక స్థిరత్వం నివేదికలో (ఎఫ్‌ఎస్‌ఆర్) ముందుమాటలో చెప్పారు. సుదీర్ఘకాలం పాటు బ్యాంకింగ్ రంగం మొండిబకాయిలతో సతమతమైందని.. ప్రస్తుతం క్రమంగా కోలుకుంటుందని దాస్ పేర్కొన్నారు. సెప్టెంబర్ చివరి నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో ఎన్‌పీఏ నిష్పత్తి క్రమంగా కోలుకుందని.. మూడు సంవత్సరాల తర్వాత మొట్టమొదటిసారి సెప్టెంబర్‌లో ఎన్‌పీఏ నిష్పత్తి తగ్గిందని అన్నారు. పెద్దమొత్తంలో మొండిబకాయిలకు కేటాయింపు వల్ల బ్యాంకులు ఎలాంటి సంక్షోభాన్ని అయినా తట్టుకోగలవని.. బ్యాంకింగ్ వ్యవస్థకు ఇది అనుకూలమైన సంకేతమని ఆయన అన్నారు. బ్యాంకుల్లో గరిష్ఠ ఎన్‌పీఏ ఈ ఏడాది మార్చి చివరి నాటికి 11.5 శాతం నుంచి సెప్టెంబర్ చివరి నాటికి 10.8 శాతానికి దిగివచ్చింది. అలాగే ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల ఎన్‌పీఏ ఈ ఏడాది మార్చిలో 15.2 శాతం నుంచి సెప్టెంబర్ చివరి నాటికి 14.8 శాతానికి దిగివచ్చిందన్నారు. అలాగే గరిష్ఠ ఎన్‌పీఏ నిష్పత్తితో కూడా బాగా మెరుగుపడిందన్నారు. ఈ ఏడాదిమార్చిలో 10.8 శాతం నుంచి సెప్టెంబర్ చివరి నాటికి 10.3 శాతానికి దిగివచ్చిందన్నారు. ప్రస్తుతం ఎన్‌పీఏ కాస్తా ఎక్కువగా ఉన్నా.. భవిష్యత్తులో మరింత తగ్గుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. మొండిబకాయిలు తగ్గించడానికి పెద్దెత్తున కసరత్తు చేయడంతో దాని ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. ప్రస్తుతం పీఎస్‌యు బ్యాంకులు పనితీరును మెరుగుపర్చుకోవాల్సి ఉందని నిరర్థక ఆస్తులపై పెద్దెత్తున కసరత్తు చేయాల్సి ఉందన్నారు. భాగస్వాములతో పాటు బ్యాంకులు సుపరిపాలనలో భాగంగా సంస్కరణలు తీసుకురావడం, దీంతో పాటు ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.41వేల కోట్లు మూలధన సమకూరుస్తామని ప్రకటించడం బ్యాంకింగ్ రంగం సంక్షోభం నుంచి గట్టెక్కడానికి కారణాలన్నారు.

పీసీఏ ఫ్రేంవర్కుతో నష్టాలు తగ్గాయి

భారీ నష్టాల్లో కూరుకుపోయిన 11 ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ) ఫ్రేం కిందికి తేవడంతో ఈ బ్యాంకులు నష్టాలు తగ్గించుకునే అవకాశం ఏర్పడిందని ఆర్‌బీఐ తాజా నివేదికలో వెల్లడించింది. మొత్తం 11 పీఎస్‌యు బ్యాంకులు వాటిలో బ్యాంకు ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంకు, యునైటెడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు, యూకో బ్యాంకులను పీసీఏ ఫ్రేం వర్కుకు కిందికి ఆర్‌బీఐ తెచ్చింది. కొత్త ఫ్రేం వర్కుకు కింద ఈ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వీలుండదు. దీంతో ఈ బ్యాంకులు తమ నష్టాలను గణనీయంగా తగ్గించకోగలిగాయని పేర్కొంది. ఈ 11 బ్యాంకులు నష్టాలు రూ.73,500 కోట్లు మొత్తం టైర్-1 క్యాపిటల్ కింది 6.8 శాతం నుంచి రూ.34,200 కోట్లు 3.1 శాతానికి గత నాలుగు త్రైమాసికాల్లో తగ్గించుకున్నాయని నివేదికలో వివరించింది.

ఎన్‌బీఎఫ్‌సీ బ్యాలెన్స్‌షీట్ రూ. 26 లక్షల కోట్లకు.....

సెప్టెంబర్ చివరి నాటికి 17.2 శాతం వృద్ధినాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల బ్యాలెన్స్ షీట్ ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి రూ. 26 లక్షల కోట్లకు చేరింది. ఏడాది క్రితం ఏడాది ఇదే సెప్టెంబర్ చివరి నాటికి రూ.22.2 లక్షల కోట్లని.. ఏడాది ప్రాతిపదికన 17.2 శాతం వృద్ధి కనిపించిందని ఆర్‌బీఐ తాజా నివేదికలో వెల్లడించింది. అలాగే ఎన్‌బీఎఫ్‌సీ రంగం సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో నికరలాభం 16.2 శాతం సాధించాయి. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ఎన్‌బీఎఫ్‌సీ లాభం 22.9 శాతంగా తేలిందని నివేదికలో వెల్లడించింది. అలాగే ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో మొండిబకాయిలు సెప్టెంబర్ చివరి నాటికి 6.1 శాతానికి ఎగబాకగా.. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి 5.8 శాతంగా నమోదైంది. కాగా ఈ రంగంలో రుణాల డిమాండ్ 16.3 శాతానికి ఎగబాకగా.. పెట్టుబడులు 14.1 శాతం పెరిగాయి.


బ్యాంకుల్లో మోసాలు రూ. 41వేల కోట్లు

- 2017-18 ఆర్థికసంవత్సరంలో..నీరవ్‌మోడీ ఎఫెక్ట్

న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వంలో బ్యాంకు ఖాతాలు ఆకాశమే హద్దుగా పెంచుకుంటూ పోయింది. ముఖ్యంగా సామాజిక భద్రత స్కీం కింద సర్కార్ జనధన్ స్కీం ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపిం చింది. బ్యాంకుల్లో ఖాతాలు ఎంతైతే పెరిగాయో.. అదే స్థాయిలో బ్యాంకుల్లో మోసాలు కూడా పెరిగిపోయాయి. మోసాల సంఖ్యతో పాటు సొమ్ము కూడా భారీగా పెరిగిపోయింది.

గత వారం రిజర్వుబ్యాంకు విడుదల చేసిన 2017-18 వార్షిక నివేదికలో ఈ వివరాలను పొందుపరిచింది. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల్లో జరిగిన మోసాల విలువ ఏకంగా రూ.41,200 కోట్లకు చేరిందని తేల్చింది. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 2014-15 సంవత్సరంలో అధికారంలోకి వచ్చినప్పటి మోసాల సంఖ్య 112 శాతం పెరిగిపోయిందని నివేదికలో వివరించింది. అయితే నివేదికలో బ్యాంకులను ఎవరెవరూ మోసం చేశారో వివరాలు మాత్రం వెల్లడించలేదు. మొత్తానికి 2017-18 ఆర్థిక సంవత్సంలో బ్యాంకింగ్ రంగంలో మోసాలు మాత్రం గణనీయంగా పెరిగాయని తేల్చి చెప్పింది. అతి పెద్ద మోసం కేసుల విషయానికి వస్తే నీరవ్‌మోడీ పంజాబ్‌నేషనల్ బ్యాంకుకు రూ.13,500 కోట్లు మోసం చేసింది మాత్రం అగ్రస్థానంలో నిలిచింది. ఒక వేళ నీరవ్‌మోడీ మోసం కేసును పక్కన పెడితే బ్యాంకుల్లో 2016-17తో పోల్చుకుంటే గత ఆర్థిక సంవత్సరం రూ.3800 కోట్లు మాత్రం పెరిగేవి. 2016-17ఆర్థిక సంవత్సరంలో భారత బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.5200 కోట్లు మాత్రమే తేలాయి. అయితే 2014-15 ఆర్థిక సంవత్సరంలో చూస్తే అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో పోల్చుకుంటే 800 కోట్లు తగ్గాయి.

మోసాలన్నీ రుణాల ద్వారానే : బ్యాంకుల్లో జరిగే 90 శాతం మోసాల్లో .. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఎగ్గొట్టినవే. బ్యాంకింగ్ రంగంలో నీరవ్‌మోడీ, మెహుల్‌చోక్సీలు ఎల్‌ఓయుల ద్వారా మోసాలకు పాల్పడ్డం లాంటి కేసులు బ్యాంకింగ్ రంగానికి ప్రమాదం పొంచి ఉందన్న సంకేతాలిస్తోంది. బ్యాంకుల్లో చోటుచేసుకుంటున్న అతి పెద్ద మోసాల విషయానికి వస్తే.. చాలా మంది మోసగాళ్లు.. విదేశాల్లో కరెంటుఖాతాలు తెరవడం అటు తర్వాత .. విదేశీ బ్యాంకుల కన్సార్షియం ద్వారా మోసపూరితంగా ఏదో విధంగా నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ పొంది.. ఇక్కడ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఆ డబ్బును విదేశాల్లో బ్యాంకులకు తరలిస్తుంటాయని పేర్కొంది. (మనీ లాండరింగ్)కు పాల్పడుతుంటాయి. ఆర్‌బీఐ అంచనా ప్రకారం 2017-18లో ఇలాంటి మోసాలు 80 శాతం పెరిగాయని తేల్చి చెప్పింది. ఇలాంటి మోసాలు సుమారు రూ.3500 కోట్ల వరకు ఉంటాయని నివేదికలో వెల్లడించింది. రుణాల మంజూరులో నిర్లక్షయం: బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందు పూర్తిగా అధ్యయనం చేసి రుణాలు మంజూరు చేయాలని, నిర్లక్ష్యంగా ఇష్టం వచ్చినట్లు డొల్ల కంపెనీలకు రుణాలు మంజూరు చేస్తూ పోతే.. భవిష్యత్తులో బ్యాంకింగ్ రంగం తీవ్రమైన సంక్షభంలో కూరుకుపోతుందని హెచ్చరించింది. బ్యాలెన్స్‌షీట్లలో మోసాలు, అలాగే సైబర్ మోసాలు బ్యాంకింగ్ రంగంలో చేసుకుంటున్నాయి. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిజిటల్ లావదేవాలను పెద్దెత్తున ప్రోత్సహించారు. పెద్దనోట్ల రద్దు తర్వాత ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్‌ఫోన్‌ల లావాదేవీలు పెరిగిపోయాయి. దీంతో పాటు సైబర్ మోసాలు గత ఆర్థికసంవత్సరంలో రెట్టింపు అయ్యాయి. 2015-16లో పెద్దనోట్ల రద్దు జరిగింది. ఈ ఏడాది సైబర్ మోసాలద్వారా బ్యాంకులు రూ.2,800 కోట్ల వరకు మోసాలు వెలుగుచూశాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఈ మోసాలు (ఇంటర్నెట్ బ్యాంకింగ్) ద్వారా రూ.7,000 కోట్లకు పెరిగిపోయాయి. అలాగే బ్యాలన్స్‌షీట్ మోసాలు రూ.1,114 కోట్ల వరకు జరిగాయి. 2016-17 ఆర్థికసంవత్సరంతో పోల్చుకుంటే ఏకంగా 250 శాతం పెరిగి పోయాయి. ఈ అంశాలన్నీ బ్యాంకులు తమ బ్యాలెన్స్‌షీట్లలో చూపిం చలేదని.. దీని వల్ల బ్యాంకుల పనితీరుపై వ్యతిరేక ప్రభావం పడు తుందన్న ఆందోళనతో వీటికి చూపించవని ఆర్‌బీఐ నివేదికలో వివరించింది.



ఈవీఎంలపై న్యాయ పోరాటం

ఎన్నికల్లో ఓటమికి సమష్టి బాధ్యత




కాంగ్రెస్ నాయకుల సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న కుంతియా, ఉత్తమ్

- అధికార దుర్వినియోగంతోనే తెరాస విజయం
- పంచాయతీ పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తమవుదాం
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ నేతల సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రజాబలంతో విజయం సాధించలేదు. ఈవీఎంల ట్యాంపరింగ్, విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి అధికార దుర్వినియోగంతోనే టీఆర్ఎస్ గెలిచింది. అయితే కాంగ్రెస్ ఓటమికి కారణాలు అనేకం ఉన్నప్పటికి.. సీనియర్ల మందరం సమష్టిబాధ్యత వహిద్దాం. తక్కువ ఓట్లతో ఓడిన నియోజక వర్గాల విషయంలో న్యాయపోరాటం చేద్దాం. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, కేంద్ర ఎన్నికల కమిషన్, దేశంలోని వివిధ పార్టీల నేతలతోపాటు కలెక్టర్లకు ఫిర్యాదు చేద్దాం' అని కాంగ్రెస్ నేతలు నిర్ణయించారు. పంచాయతీ ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సమాయత్తం చేసి ఎక్కువ స్థానాల్లో పాగా వేయాలని, ఆ తర్వాత వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తా చాటాలనే అభిప్రాయానికి కాంగ్రెస్ నేతలు వచ్చారు. సోమవారం నగరంలోని గోల్కొండ హోటల్‌లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, పార్టీ ఘోర పరజాయనికి సంబంధించి అంశాలపై కాంగ్రెస్ పార్టీ సమీక్షనిర్వహించింది. ఈ సమీక్షకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పార్టీ సీనియర్లు జానారెడ్డి, షబ్బీర్‌అలీ, దామోదర రాజనరసింహ, రేవంత్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, విజయశాంతి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, అద్దంకి దయాకర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈవీఎంలపై న్యాయపోరాటానికి సంబంధించి సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్‌తోనూ చర్చించారు. ఎన్నికల్లో టీఆర్ఎస్ అక్రమాలపై పార్టీ తరపున న్యాయపోరాట కమిటీని వేయాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, కానీ ఈ పార్టీ విజయం సాధించింది కేవలం ఈవీఎం ట్యాంపరింగ్ వల్లేనంటూ కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడ్డారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌పైన కూడా చర్చించారు. కేసీఆర్‌పైన ఉన్న కేసుల మాఫీ కోసమే నరేంద్రమోడి జపం చేస్తున్నారని, కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఈఎస్ఐ, పీఎఫ్ నిధుల గోల్‌మాల్ కేసులను నుంచి తప్పించుకోవడానికి కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ అంటూ తిరుగుతున్నారని చర్చించారు.

తెరాస అక్రమాలపై ఆధారాలున్నాయి




అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అనేక అక్రమాలకు పాల్పడినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా అన్నారు. మధ్యాహ్నం వరకు 50 శాతం దాటని పోలింగ్ పర్సెంటేజీ.. ఆ తర్వాత 80 నుంచి 90 శాతానికి పైగా ఎలా పెరగిందని ఆయన ప్రశ్నించారు. పోలింగ్ శాతానికి, కౌంటింగ్‌లోని ఓట్ల శాతానికి తేడా ఎందుకు వచ్చిందో ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సమీక్ష అనంతరం కుంతియా మీడియాతో మాట్లాడారు. రీ కౌంటింగ్ అవసరం ఉన్న దగ్గర ఓట్ల లెక్కింపు ఎందుకు చేపట్టలేదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ నియోజక వర్గాల్లో 48 ఈవీఎం మిషన్లు పాడైనాయని, మరో ఈవీఎంలు పనిచేయలేదన్నారు. ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత ఎన్నికలు వచ్చే తేదీలను కేసీఆర్ ఎలా చెబుతారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి రజత్‌కుమార్ తప్పుల వల్ల 22 లక్షల మంది ఓట్లు గల్లంతైనాయని, ఎన్నికల తర్వాత ఆయన క్షమాపణలు చెప్పడం దేనికి సంకేతమన్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న చోట్లనే ఓట్లను తొలగించారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు కూడా విచ్చల విడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో పాలనను పట్టించుకోకుండా సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరుతో ఒడిషా, పశ్చిమ బెంగాల్ తిరగడం మోదీకి మద్దతు కోసమే అంటూ కుంతియా మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో రాష్ట్రంలో ఏర్పడిన ప్రజాకూటమి కొనసాగుతోందని మీడియా అడిగిన ప్రశ్నకు కుంతియా సమాధానమిచ్చారు. అయితే మోడికి బీ టీమ్‌గా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

పార్టీ నిర్మాణంపై చర్చించాం: జానారెడ్డి

పంచాయతీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ నిర్మాణంపై ఈ సమావేశంలో చర్చించామని సీనియర్ నేత జానారెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య విధానాలపైన పాలన సాగాలని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య సూచించారు. రాష్ట్రంలో మెజార్టీ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పాలన నడుస్తోందని ఆయన విమర్శించారు. పార్టీ ఓటమికి సమిష్టి బాధ్యత వహించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ తెలిపారు. పోలింగ్ శాతం, కౌంటింగ్ శాతానికి గల తేడాపై ఈసీ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

కోర్టు చెప్పినా పట్టించుకోని ఈసీ

తక్కువ ఓట్ల తేడాతో ఓడిన నియోజక వర్గాల్లో వీవీ ప్యాట్ స్లిప్‌లను లెక్కించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికి రాష్ట్ర ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కోదాడ, తుంగతుర్తి, ధర్మపురి, ఇబ్రహీం పట్నం నియోజక వర్గాల్లో అక్రమాలు జరిగాయని, అక్కడ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారని ఉత్తమ్ పేర్కొన్నారు. అయితే అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఎన్నికల అధికారులు ఫలితాలను తారుమారు చేశారని ఆయన ఆరోపించారు. ఈవీఎంలు పనిచేయడం లేదని సాకులు చూపారని ఆయన విమర్శించారు. పంచాయతీ ఎన్నికలకు విజయం సాధించిన ఎమ్మెల్యేలు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారని ఆయన వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. విజయం సాధించిన ఎమ్మెల్యేలతో ఇరవై రోజులు గడుస్తున్నా ప్రమాణస్వీకారం చేయించడం లేదని ఆయన విమర్శించారు.



రెండేళ్ల వరకు మీడియాతో మాట్లాడను



అధికార టీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబంపైన ఒంటికాలిపై విమర్శలకు దిగే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్పుడు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రజా సమస్యల విషయంలో పదునైన వ్యాఖ్యలతో నిత్యం మీడియాలో ఉండే రేవంత్‌రెడ్డి ఇక రెండేళ్ల వరకు మీడియాకు దూరంగా ఉంటున్నట్లు ఆయన తెలిపారు. 'ఇన్నాళ్లు మీ కోసం.. ఇప్పుడు నా కోసం మానేస్తున్నా' అంటూ తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని కొడంగల్ నియోజక వర్గం నుంచి రేవంత్‌రెడ్డి పోటి చేసి ఓటమి చెందిన విషయం తెలిసిందే. అయితే రేవంత్‌రెడ్డి నిర్ణయంతో ఆయన అభిమానులు షాక్‌కు గురికాగా.. కాంగ్రెస్ పార్టీ నేతలు ఎలా స్పందిస్తారో వేచ్చి చూడాల్సి ఉంది.

బాబుకు ఓటమి భయం

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



ఆంధ్రప్రభ, హైదరాబాద్: తెలంగాణ సీఎం కేసీఆర్‌ను బూచిగా చూపి ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లుపొందాలనుకుంటే అది చంద్రబాబు తెలివితక్కువతనమేనని మాజీ మంత్రి, టీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం సాయంత్రం తెలంగాణభవన్‌లో చెన్నూరు ఎమ్మెల్యే బాల్కసుమన్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఏవేవో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తీరుచూస్తుంటే ఆ రాష్ట్రంలో ఫలితాలు ఎలా ఉంటాయో స్పష్టమవుతుందన్నారు. ఓటమికి చంద్రబాబు ఇప్పటినుండే సాకులు చెబుతున్నారని ఎద్దేవాచేశారు. ప్రధాని నరేంద్రమోడీ, బీజేపీలతో టీఆర్ఎస్‌కు ఎపుడూ రాజకీయ సంబంధాలు లేవని, కేవలం రాజ్యాంగ బద్ధమైన సంబంధమే ఉందన్నారు. పూటకోవిధానంతో చంద్రబాబు ముందుకుపోతున్నారని మండిపడ్డారు. హైకోర్టు అఫిడవిట్ గురించి మాట్లాడమని కేసీఆర్ అడిగితే ఏదోదో మాట్లాడాడని దుయ్యబట్టారు. వైస్రాయ్ ఎపిసోడ్‌లో కేసీఆరే సిద్దాంతకర్త అయితే ఆయనే సీఎం అయ్యేవారు కదా అని ప్రశ్నించారు. చంద్రబాబు అబద్దాలతో ఏపీ ప్రజలను వంచిస్తున్నారని తెలిపారు. తెలంగాణ కోసమే 2004లో కాంగ్రెస్, 2009లో టీడీపీలతో కేసీఆర్ పొత్తులు పెట్టుకున్నారన్నారు. తెలంగాణ కోసం అన్ని పార్టీలను ఒప్పించిన ఘనత కేసీఆర్‌దేనని, చివరకు చంద్రబాబును కూడా ఒప్పించి ఆయన పార్టీతో పొత్తు పెట్టుకున్నారని పేర్కొన్నారు. 2004లో చంద్రబాబును బండకేసి కొట్టింది కాంగ్రెస్సేనని, 2009లో టీఆర్ఎస్‌తో పొత్తుకు ముందుకు వచ్చింది టీడిపినే అన్నారు. కేసీఆర్ బాబు దారిలోకి రాలేదని, చంద్రబాబే కేసీఆర్ దారిలోకి వచ్చారన్నారు. ఎన్నికల్లో మోడీతో కేసీఆర్ దోస్తీ అని చంద్రబాబు ఎంత మొత్తుకున్నా ప్రజలు నమ్మలేదన్నారు. గోబెల్సే ఆశ్చర్యపడే రీతిలో చంద్రబాబు అబద్దాలు ఆడుతున్నారన్నారు. ఈ గోబెల్స్ సిద్ధాంతాలను తెలంగాణ ప్రజలు తిరస్కరించారని, రేపు ఏపిలో కూడా ఇదే జరగబోతున్నదన్నారు.

కేసీఆర్‌తో పోటీపడలేరు


రాష్ట్రాలు విడిపోయినా హైకోర్టు ఎందుకు కలిసి ఉండాలన్న కారణాన్ని బాబు చెప్పలేకపోయారని, నాలుగున్నరేళ్ళలో కోర్టు భవనం కూడా కట్టలేకపోయారని జగదీష్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్‌తో చంద్రబాబు పోటీపడలేరని, ఎవరిని అడిగినా తెలంగాణ అభివృద్ధి గురించే చర్చిస్తున్నారన్నారు. మోడీ, జగన్‌లతో ఎలా వ్యవహరించాలో కేసీఆర్‌కు బాగా తెలుసన్నారు. పక్క రాష్ట్రాలతో సంబంధాల విషయంలో కేసీఆర్ రాజకీయ పరిణతితో వ్యవహరిస్తారన్నారు. కేసీఆర్ పరిణతి ఏందో చెప్పడానికి మహారాష్ట్రతో సాగునీటి ఒప్పందం ఒక్కటే చాలన్నారు.

బీసీలకు కేసీఆర్ పెద్ద పీట

ఎంపీ లింగయ్యయాదవ్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: బీసీలకు సీఎం కేసీఆర్ మొదటి నుంచి పెద్దపీట వేస్తున్నారని టీఆర్ఎస్ ఎంపీ లింగయ్యయాదవ్ అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోర్టు ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ పంచాయతీ ఎన్నికలకు వెళ్తున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీసీలకు ఏదో ఇబ్బంది జరుగుతుందని కాంగ్రెస్ నేత ఉత్తమ్ మాట్లాడటం సరికాదన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. బీసీలకు మార్కెట్ లో 50 శాతం రిజర్వేషన్ అమలు చేసిన నేత కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ గత పదేళ్ల కాలంలో ఏం చేసిందో చెప్పాలని, ఈ నాలుగేళ్లలో బీసీలకు ఏం చేశామో చెప్పడానికి తాము సిద్ధమన్నారు. గొల్ల కురుమలకు 75 శాతం సబ్సిడీతో గొర్రెల పంపిణీ చేశామన్నారు.

ఉత్తమ్.. దమ్ముంటే చర్చకు రా




ఆంధ్రప్రభ, హైదరాబాద్: తెలంగాణలో ప్రతిపక్షాలన్నీ బీసీలపై మొసలిక న్నీరు కారుస్తున్నాయని, ఉత్తమ్ దమ్ముంటే బీసీలకు ఎవరేం చేశారో బహిరంగచర్చకు రావాలని టీఆర్ఎస్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య సవాల్ చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియాసమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు పంచాయతీలలో 24శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిందని, కానీ తెలంగాణ ప్రభుత్వం అందుకు ఒప్పుకోకుండా స్పెషల్ లీవ్ పిటీషన్ దాఖలుచేసిందన్నారు. దానిని సుప్రీంకోర్టు కొట్టివేయడంతో గత్యంతరం లేని పరిస్థితిలోనే సీఎం కేసీఆర్ ఆ తీర్పును అంగీకరించారన్నారు. అధికారంలో ఉండగా బిసి ఫెడరేషన్లకు కాంగ్రెస్ పార్టీ ఒక్కపైసా కూడా ఇవ్వలేదని. ఇప్పుడు ఉత్తమ్, కోదండరాంలు మొసలికన్నీరు కారుస్తున్నారన్నారు.బీసీలకు పంచాయతీలలో 90శాతం సబ్సిడీతో పెట్టుబడి సమకూరుస్తున్నామన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో తీర్మానాలు చేయించాలని డిమాండ్ చేశారు. విపక్షనేతలు ఇల్లు కాలితే పేలాలు ఏరుకున్నట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీకి అఖిలపక్షంగా వెళ్ళినా ప్రస్తుతం సాధించేదేమీ ఉండదని, బిసి నేత ఆర్.కృష్ణయ్య వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. చంద్రబాబు కల్లుతాగిన కోతిలా వ్యవహరిస్తున్నారని, కేసీఆర్ బాషను తప్పుపడుతున్నారన్నారు.

చంద్రబాబు అభివృద్ధిలో కుట్ర కోణం : ఎమ్మెల్సీ భాను ప్రసాద్



చంద్రబాబు సైబరాబాద్‌ను అభివృద్ధి చేసిన కుట్రకోణం అందరికీ తెలుసు అని, సైబరాబాద్ డెవలప్‌మెట్ అథారిటీ ఏర్పాటుచేసి తన బంధుగణం, భజనబృందం సభ్యులతో భూములు కొనిపించారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాద్ ఆరోపించారు. తెలంగాణ భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శిలాఫలకాలు వేయడంలో చంద్రబాబును మించిన వారులేరని, చంద్రబాబుకు భారతరత్న తరహాలో ఫౌండేషన్ రత్న బిరుదు ఇవ్వొచ్చన్నారు. కేసీఆర్ కు చంద్రబాబు తరహాలో చీకటి ఒప్పందాలు లేవని, ఏది ఉన్నా నేరుగానే చెప్పి చేస్తారన్నారు. చంద్రబాబు అబద్ధాలు మాని హుందాగా వ్యవహరించాలన్నారు.

అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అవినీతినే పుట్టిళ్ళుగా చేసుకున్న కాంగ్రెస్ పార్టీ అబద్ధాలను నిజమని ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నేతలు మల్లారెడ్డి, చింతా సాంబమూర్తి, ఎస్.కుమార్, ప్రకాష్‌రెడ్డి తదితరులతో కలిసి మాట్లాడిన లక్ష్మణ్ కాంగ్రెస్ అంటే కరప్షన్ - కలెక్షన్‌గా పేరొందిందన్నారు.సోనియా కనుసన్నల్లో సాగిన పదేళ్ళ యూపీఏ పాలన అంతా కుంభకోణాల మయమైందన్నారు. కాంగ్రెస్ పార్టీకి దేశ రక్షణ, ప్రజల రక్షణ పట్ల ఏ మాత్రం బాధ్యత లేదని దుయ్యబట్టారు. అగస్టా వెస్ట్‌లాండ్ కుంభకోణం నిందితుడిని ఇటీవల భారత్‌కు తీసుకు వచ్చారని, అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ, రాహుల్, సోనియా, ఇతర నేతలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. తమ దోపిడీ ఎక్కడ భయటపడుతుందోనన్న ఆందోళనతో దొంగే దొంగా, దొంగా అన్నట్లుగా అరుస్తున్నారన్నారు. గడచిన 30 సంవత్సరాలుగా దేశంలో జరిగిన కుంభ కోణాల్లో అండర్సన్, ఖత్రోచీ, ఇప్పుడు క్రిస్టియన్ మిషల్ లకు గాంధీ కుటుంబంతో ఎందుకు సంబంధం ఉందన్న విషయాన్ని కాంగ్రెస్ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అగస్టా వెస్ట్‌లాండ్ కుంభకోణం నుంచి సోనియా కుటుంభం తప్పించుకోలేదని ఆయన స్పష్టం చేశారు.

దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వోకు పదోన్నతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి (సీపీఆర్వో) ఎం ఉమా శంకర్ కుమార్‌కు రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీర్స్ 1997 బ్యాచ్‌కు చెందిన ఉమా శంకర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఈసీఈ ఇంజనీరింగ్ పట్టా అందుకున్నారు. సింగపూర్‌లోని లీ కువాన్ యూ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీలో ప్రొఫెషనల్ ట్రైనింగ్ పొందారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ పబ్లిక్ పాలసీ మేనేజ్‌మెంట్ విభాగం నుండి అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెట్ ప్రోగ్రాం పూర్తి చేశారు. గత నాలుగేళ్ళుగా ఎస్‌సీఆర్ సీపీఆర్వో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

అమెరికాలో తెరాస గెలుపు సంబురాలు

ఆంధ్రప్రభ, హైదరాబాద్: టీఆర్ఎస్ తెలంగాణ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని అమెరికాలోని ఆస్టిన్ నగరంలో సోమవారం టీఆర్ఎస్-యుఎస్ఏ ఆస్టిన్ విభాగం ఔత్సాహికుల ఆనందోత్సాహాల మధ్య నిర్వహించింది. యుఎస్ఏ టీఆర్ఎస్ కార్యదర్శి నర్సింహారావు, నాగులవంచా ఈ సందర్బంగా మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వ పటిమ, అభివృద్ధి పథకాలు, కాళేశ్వరం ప్రాజెక్టు వంటివి ఈ ఎన్నికల్లో ఘనవిజయానికి దోహదం చేశాయన్నారు. టీఆర్ఎస్ ఆస్టిన్ కార్యదర్శి హరీష్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరు ఎన్ని కుట్రలు చేసినా విజయం కేసీఆర్‌నే వరించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్ కాసారపు, వేణు జూపల్లి, రాకేష్, శ్రీనాధ్, జగదీశ్ జొన్నాడ, నవీన్ నూతి, ప్రదీప్ భట్టిప్రోలు పాల్గొన్నారు. యుఎస్ నాయకులు మహేష్ తన్నీరు. మహేష్ బిగాల, పూర్ణచందర్ బైరి, నవీన్ జలగం, అనిల్ కూర్మాచలం ఆస్టిన్ కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

13 నుండి అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్

ఆంధ్రప్రభ, హైదరాబాద్: ఈనెల 13నుండి 15వరకు మూడురోజులపాటు సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో తెలంగాణ పర్యాటక సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్, దానికి అనుబంధంగా ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. సోమవారం ఈ ఫెస్టివల్స్ నిర్వహణపై తెలంగాణ రాష్ట్రం లో నివసిస్తున్న వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన సంఘాల ప్రతినిధులతో ఆయన సమీక్షనిర్వహించారు. గత సంవత్సరం నిర్వహించిన ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్‌లో 1000రకాల స్వీట్స్‌ను ప్రదర్శించామన్నారు. ఈ ఫెస్టివల్‌లో వివిధ రాష్ట్రాలతో పాటు 15దేశాలనుండి ప్రతినిధులు వారి సాంప్రదాయ స్వీట్స్‌తో స్వీట్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారని, సుమారు 8లక్షలమంది సందర్శకులు పాల్గొన్నారన్నారు. ఈ ఏడాది నిర్వహించే స్వీట్ ఫెస్టివల్‌లో 20దేశాల ప్రతినిధులు స్వీట్ స్టాల్స్ ఏర్పాటుచేయబోతున్నారని, 10లక్షలమంది సందర్శకులు వచ్చే అవకాశముందని బుర్రా వెంకటేశం తెలిపారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ట్రయల్‌రన్ సక్సెస్

- ఏప్రిల్, మే నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి..



కర్నూలు బ్యూరో, ప్రభ న్యూస్ : ఆకాశ విహంగంలో ప్రయాణించాలన్న కర్నూలు జిల్లా ప్రజల సహకార కల త్వరలో నెరవేరబోతుంది. ఓర్వకల్లు మండలం, పూడిచెర్ల, కన్నమడకల గ్రామ సమీపాన నిర్మితమైన విమానాశ్రయ ప్రాజెక్టు సర్వంసిద్ధమైంది. జనవరి 8న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విమానాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేయబోతుండగా, ఇందులో భాగంగా సోమవారం ఎయిర్‌పోర్టులో విమాన ల్యాండింగ్ ట్రయల్‌రన్‌ను నిర్వహించారు. హైదరాబాద్ టర్బో ఏవియేషన్‌కు చెందిన సిజ్‌నా సిసియేషన్ సిజెజెడ్ విహంగం విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ఇందులో 6 మందితో కూడిన విమాన బృందం తొలిసారి ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కాగా, ఈ విషయం తెలుసుకున్న ఓర్వకల్లు, పూడిచెర్ల, కన్నమడకల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సిజెజెడ్ విహంగం ల్యాండ్ అవ్వగానే వాటిని తిలకించేందుకు పెద్దఎత్తున పోటీపడ్డారు. విహంగం వద్దకు చేరుకొని ఫోటోలకు ఫోజులిస్తూ కనిపించారు. విహంగంను నడిపిన విజయవాడకు చెందిన కో ఫైలెట్ రాజశేఖర్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఫైలెట్ మహమ్మద్ రిజ్వాన్‌తో కరచాలనం చేసేందుకు జనం పోటీపడ్డారు. హైదరాబాద్ నుండి 25 నిమిషాలలో విహంగంలో కర్నూలుకు వచ్చినట్లు ఫైలెట్ మహమ్మద్ వివరించారు. ఓర్వకల్లులో తొలిసారి విహంగం న్యాయం చేయాల్సి రావడంతో కొద్దిగా టైడ్ అనిపించిందని, ఆ తర్వాత ఆకాశంలో చుట్టూ పరిస్థితులను అవగాహన చేసుకొని ల్యాండింగ్ చేసినట్లు చెప్పారు. కర్నూలు జిల్లాలో తొలిసారిగా నిర్మించిన విమానాశ్రయంలో సిజెజెడ్‌ను ల్యాండింగ్ చేయడం ఆనందంగా అనిపించిందన్నారు. ఆకాశాన పరంగా తీసుకుంటే హైదరాబాద్ బేగంపేట నుండి 100 మైల్స్, ఇక్కడి నుండి కడపకు 150 మైల్స్, విజయవాడకు కూడా ఇంచుమించుగా ఇదే విధంగా ఉండవచ్చని ఫైలెట్, కోఫైలెట్ అభిప్రాయపడ్డారు. ఇక విహంగంలో ఫైలెట్, కో ఫైలెట్‌తో పాటు టర్బో ఏవియేషన్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ ఉమేష్, రాష్ట్ర ఇంధన, పెట్టుబడి, మౌలిక సదుపాయాల ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్‌తో పాటు మరో ఇద్దరు వచ్చారు. ఎయిర్‌పోర్టు రన్‌వేలో జెట్ విమానం దిగిన అనంతరం అప్రాన్‌కు చేరుకుంది. దాదాపు గంటపాటు ఎయిర్‌పోర్టులో ఉన్న జెట్ విమానం ఆ తర్వాత తిరిగి హైదరాబాద్‌కు వెళ్లింది. విమానం తిరిగి వెళ్తున్న సమయంలో రన్‌వేకు సమీపంలో ఓ కుక్క సంచరించడం ఎయిర్‌పోర్టు సిబ్బందిని కొంత కలవరపెట్టడం గమనార్హం.

ఈశ్వర్ వర్సెస్ వివేక్

ఆంధ్రప్రభ, హైదరాబాద్: ధర్మపురి ఎన్నికల వివాదం కొనసాగుతోంది. తనకు వ్యతిరేకంగా మాజీ ఎంపీ వివేక్ ప్రచారం చేశాడని, ఓడించాలని చూశాడని మాజీ చీఫ్‌విప్, ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ నేరుగా సీఎం కేసీఆర్‌ను కలిసి ఫిర్యాదుచేయడం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి విన్నవించడం పార్టీలో కలకలం సృష్టిస్తోంది. ధర్మపురి ఎమ్మెల్యేతో పాటు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మరికొందరు అభ్యర్థులు కూడా ఫిర్యాదుచేయడం సెగలు పుట్టిస్తోంది. ఈ నేపథ్యంలో వివేక్ తాజా ఫిర్యాదులపై స్పందించారు.

ఆరోపణలు అబద్ధం : వివేక్

ఎన్నికల్లో తాను చాలా సిన్సియర్‌గా పనిచేశానని, కోట్లు ఖర్చుపెట్టి పలువురు టీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని చూడడం అవాస్తవమని మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి సోమవారం అన్నారు. నేను ప్రచారం చేసిన మండలాల్లో అధికంగా మెజారిటీ వచ్చింది. ఆ విషయాలు ఇప్పటికే సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వివరించా. నా వ్యాపారంలో నష్టం రావడంతో నగదునిల్వలేక ఎవరికీ సాయం చేయలేకపోయా. ఆఖరికి అన్న వినోద్‌కు కూడా డబ్బు ఇవ్వలేనని చెప్పా. ధర్మపురి, కొత్తూరుతో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రచారం చేశా. ఈశ్వర్‌కు మెజారిటీ తక్కువరావడంలో నా పాత్ర ఏమీలేదు అని వివేక్ స్పష్టం చేశారు.

100 కోట్లతో మీడియా అకాడమీ భవనం

- ఏడాదిలోగా పూర్తి
- జర్నలిజం కోర్సు ప్రారంభిస్తాం
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏడాదిలోగా మీడియా అకాడమీ కొత్త భవనాన్ని నిర్మిస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ చెప్పారు. ప్రస్తుతమున్న భవనాన్ని కూల్చివేయడం జరిగిందని, కొత్త భవన నిర్మాణం కోసం ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో టెండర్ల ఖరారయ్యాయని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి కెసీఆర్ అనుమతి తీసుకుని త్వరలో కొత్త భవనానికి శంకుస్థాపన చేస్తామని ఆయన తెలిపారు. నూతన అకాడమీ భవనం పూర్తయితే, వంద కోట్ల రూపాయల నిధులతో శాశ్వత తరగతి గదులు ఏర్పాటు చేసి జర్నలిజం కోర్సులను ప్రారంభించాల్సివుందన్నారు. అలాగే జర్నలిస్టుల సంక్షేమ నిధికి వంద కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికై రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

బాధిత జర్నలిస్ట్‌కు కుటుంబాలకు సాయం!

సోమవారం సమాచార భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరిగింది. సమావేశంలో 47 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలు, తీవ్ర అనారోగ్యం బారిన పడిన 16 మంది వర్కింగ్ జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేయడానికి కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమ నిధికి రాష్ట్ర ప్రభుత్వం వంద కోట్ల రూపాయలను ప్రకటించి ఇప్పటి వరకు రూ.34 కోట్ల 50 లక్షలను విడుదల చేసిందన్నారు. అలాగే జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి ఇప్పటి వరకు 150 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు లక్షరూపాయల చొప్పున ఆర్థికసహాయం అందజేశామన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలకు రూ.3వేలు చొప్పున ఐదు సంవత్సరాల పాటు పెన్షన్, వారి పిల్లల్లో అర్హులైన 104 మందికి పదవ తరగతి వరకు ట్యూషన్ ఫీజు నిమిత్తం రూ.1000 చొప్పున చెల్లిస్తున్నామని ఆయన చెప్పారు. తీవ్ర అనారోగ్యం బారిన పడిన 52 మంది జర్నలిస్టులకు రూ.50 వేల చొప్పున 26 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు తొమ్మిది ఉమ్మడి జిల్లాలలో 5361 మంది జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణా తరగతులతో పాటు సోషల్ మీడియా, డాటా బ్యాంకింగ్, ఫీచర్ జర్నలిజం వంటి అంశాలపై కూడా దృష్టి సారించాలని సభ్యులు సూచించినట్లు అల్లం నారాయణ తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లెపల్లి లక్ష్మయ్య, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, డెక్కన్ క్రానికల్ పొలిటికల్ ఎడిటర్ గౌరీ శంకర్, సీనియర్ సంపాదకులు టంకశాల అశోక్, తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖాధిపతి సత్తిరెడ్డి, ఆలిండియా రేడియో డైరెక్టర్ ఉదయ్ శంకర్, సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు నాగయ్య కాంబ్లే, చీఫ్ ఇంజనీర్ కిశోర్ బాబు, కార్యదర్శి రాజమౌళి, మేనేజర్ జి. లక్ష్మణ్ కుమార్, అకౌంట్స్ అధికారి కె. యాదగిరి పాల్గొన్నారు.



ఇద్దరు ఏఈఓల దుర్మరణం

భైంసా, ప్రభన్యూస్: నిర్మల్ జిల్లా, భైంసా - నిర్మల్ జాతీయ రహదారి పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువ ఏఈఓలు మృతిచెందడం ఈ ప్రాంతంలో విషాదం నింపింది. దీంతో చిన్న వయస్సులో ఉద్యోగం పొంది ఆదుకుంటారని నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో నర్సాపూర్(జి) మండలంలో పనిచేస్తున్న ఇద్దరు ఏఈఓలు భైంసా మండలంలోని పెండ్‌పెల్లి గ్రామంలో విందుకు వచ్చారు. విందు ముగించుకుని సాయంత్రం 7 గంటల సమయంలో భైంసా వైపు తిరుగు ప్రయాణమయ్యారు. 61వ జాతీయ రహదారిపై వానల్‌పాడ్ గ్రామం దాటారు. టోల్ ప్లాజాకు కొద్ది దూరంలో వీరు నడుపుతున్న టీఎస్18బి 5493 నంబర్ గల గ్లామర్ ద్విచక్రవాహనం ఇసుక లోడ్‌తో వెళుతున్న ఏపీ01ఎక్స్ 5854 నంబరల్ గల ట్రాక్టర్ ట్రాలీని వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ద్విచక్ర వాహనం వేగంగా రావటంతో ద్విచక్రవాహనం నడుపుతున్న విక్రమ్ తల పగిలి రక్తస్రావమైంది. వెనుక కూర్చున్న మరో ఏఈఓ అక్షయ్ కుమార్ రెండు కాళ్లు విరిగాయి. అక్కడే ఉన్న ఆటోలో వెంటనే బాధితులను భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో ఇద్దరిని అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగానే విక్రమ్ మృతిచెందాడు. నిజామాబాద్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న అక్షయ్ సైతం తెల్లవారుజామున మరణించాడు. సోమవారం ఈ విషయం తెలుసుకున్న అధికారులు, వ్యవసాయ శాఖ ఉద్యోగులు వేకువజామునే ఆసుపత్రికి చేరుకున్నారు. ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మృతదేహాలను సందర్శించి బాధిత కుటుంబాలను ఓదార్చారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి అమరేష్ కుమార్, మార్క్‌ఫెడ్ డీఎం కోటేశ్వర్‌రావు, ఏడీఏ అంజిప్రసాద్, ఏఈఓలు రాంచందర్ నాయక్, సోమలింగారెడ్డి, టీఎన్‌జీవో భైంసా ప్రధాన కార్యదర్శి నాగుల శ్రీహరి, జిల్లాలో పనిచేసే ఏఈఓలు ఆసుపత్రికి తరలివచ్చారు. భైంసారూర్ ఎస్సై పున్నం చందర్‌తో మాట్లాడి సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

గిరిజన విద్యార్థిని ఆత్మహత్య

ఆదిలాబాద్ రూరల్, ప్రభన్యూస్ : ఆదిలాబాద్ జిల్లా, భీంపూర్ మండలం గుంజాలకు చెందిన గిరిజన విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఆత్రం చంద(19) ఉట్నూర్ కెబి కాంప్లెక్స్‌లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతుంది. 15 రోజుల క్రితం జ్వరం వస్తుందని చెప్పి స్వగ్రామం గుంజాలకు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చూపించినా జ్వరం తగ్గక అనారోగ్యంతో ఉండటంతో మనస్తాపం చెందిన ఈనెల 24న పురుగుల మందు తాగిందని ఆదిలాబాద్ రిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది. భీంపూర్ ఎస్సై మొబిన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు, బైక్ ఢీకొని యువకులు మృతి

● మృతులు మేడ్చల్ జిల్లా బాచుపల్లి వాసులుగా గుర్తింపు



జోగిపేట, ప్రభ న్యూస్ : అన్న సాగర్ బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌ను బస్సును ఢీకొట్టిన ప్రమాదంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. మెదక్ జిల్లా, అందోల్ మండల పరిధిలోని అన్నసాగర్ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు సంబంధించిన వివరాలు జోగిపేట ఎస్.ఐ. వెంకటేశం తెలిపిన కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా, బాచేపల్లి, షాపూర్‌లకు చెందిన రాచకొండ నరేంద్, ప్రభు ఇద్దరు కలిసి టీవీఎస్ 08ఎఫ్‌జడ్ 2226 గల నెంబర్ వాహనంపై అల్లాదుర్గం వైపు వెళ్తుండగా సంగారెడ్డి డిపోకు చెందిన ఏపీ 28 జడ్4314 గల నెంబర్ ఆర్టీసీ బస్సు జోగిపేటకు వసున్న క్రమంలో అన్నసాగర్ జక్షన్ వద్ద ఎదురెదురుగా బస్సు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నరేందర్ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా ప్రభు యువకుడి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలి ంచగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రమాదం జరిగిన చోట ఇరు వైపులు వాహనాలు నిలిచిపోయాయి. జోగిపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం జోగిపేటలో ఆసుపత్రికి తరలించారు. వివరాలు సేకరించి, వారి బంధువులకు సమాచారం అందిస్తామని తెలిపారు. ఈ మేరకు ఎస్.ఐ. వెంకటేశం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు రెరా అనుమతి

● 15లోగా అపరాధ రుసుము చెల్లిస్తే రిజిస్ట్రేషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, టీఎస్-ఐఐసీ, యుడీఏ, డీటీసీపీ పరిధిలో 2017 జనవరి 1 తర్వాత ఆమోదం పొందిన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను రియల్ ఎస్టేట్ రెగ్యులేటరి అథారిటీ (రెరా) వద్ద నమోదు చేయించుకోని వారిపై చర్యలు తీసుకుంటామని రెరా ఛైర్మన్ రాజేశ్వర్ తివారి ప్రకటించారు. జనవరి 2017 నుంచి 2018 ఆగస్టు చివరి వరకు ఆమోదం పొందిన ప్రాజెక్టులు 30 నవంబర్ 2018లోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుందని ఆయన తెలిపారు. దీనికి సంబంధించి అనేకసార్లు పత్రికా ప్రకటనలు విడుదల చేశామని, రెరా వద్ద నమోదు చేసుకోని ప్రాజెక్టులపై 1 డిసెంబర్ 2018 నుంచి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టంగా ప్రకటించామని ఆయన గుర్తుచేశారు. ఈ మేరకు 28వ తేదీన జరిగిన సమావేశంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెరా నిర్ణయించిందని రాజేశ్వర్ తివారి తెలిపారు. డిసెంబర్ 31 తర్వాత వచ్చిన ప్రాజెక్టులన్నీ నిబంధనలు అతిక్రమించినట్లు పరిగణిస్తామని ఆయన స్పష్టంచేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఈ దరఖాస్తులను తిరస్కరించాల్సి ఉంటుందని తివారి స్పష్టంచేశారు. అయితే ఈ దరఖాస్తులను తిరస్కరించడం భావ్యం కాదని భావించి వెసులుబాటును కల్పించనున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు రెండు లక్షల అపరాధ రుసుము చెల్లించి జనవరి 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలిపారు. జనవరి 1 నుంచి 15వ తేదీలోగా దరఖాస్తులను అప్‌లోడ్ చేసుకున్న ప్రమోటర్లు ఆన్‌లైన్ ఫెనాల్టీ చెల్లించవచ్చునని తెలిపారు. ఈ వెసులుబాటును కూడా అంగీకరించని ప్రమోటర్ దరఖాస్తును రెరా చట్టం పరిధిలో ప్రాసెస్ చేయనున్నట్లు రాజేశ్వర్ తివారి తెలిపారు.

భార్యపై కోపంతో...పసికందును విసిరేశాడు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భార్యపై కోపంతో ఎనిమిది నెలల చిన్నారని రెండో అంతస్తునుంచి కిందకు పడేసిన ఓ కన్నతండ్రి ఘాతుకం అందరినీ నివ్వెరపరచింది. నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ నర్సింహ నగర్‌లో మహారాష్ట్రకు చెందిన దంపతులు మనోజ్, జాహ్నవిలు నివాస ముంటున్నారు. మనోజ్ వృత్తిరీత్యా డీసీఎం డ్రైవర్. వీరికి 8 నెలల పాప ఉంది. భార్యతో గొడవ పడిన మనోజ్... తన ఎనిమిది నెలల కుమార్తెను రెండో అంతస్తునుంచి కిందకు పడేశాడు. అయితే ఇది గమనించిన స్థానికులు వెంటనే పసికందును ఆసుపత్రికి తరలించడంతో ముప్పు తప్పింది. పాపకి ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం చిన్నారికి గాంధీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో జరిగిందని స్థానికులు తెలిపారు.

మహిళా పేషంట్‌తో అసభ్య ప్రవర్తన..

డాక్టర్‌పై రోగి భర్త, స్నేహితుల దాడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఓ మహిళా పేషెంట్‌తో అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఆమె భర్త డాక్టర్‌పై దాడికి పాల్పడిన ఘటన సోమవారం హిమాయత్‌నగర్‌లో చోటుచేసుకుంది. తెలిసిన వివరాల మేరకు హిమాయత్‌నగర్‌కు చెందిన పీడియాట్రిషన్ డా.మైకేల్ అరన్నవద్దకు వచ్చిన మహిళా పేషెంట్‌తో తప్పుగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఆమె భర్త తన స్నేహితులతో కలిసి డాక్టర్‌పై దాడి చేశాడు. దీంతో తనపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మైకేల్ నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దాడికి పాల్పడిన గులాం ముస్తఫా, అబ్దుల్ ఫైజల్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం డాక్టర్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

అమరావతి... కొలువుల కల్పవృక్షం



● పరిశ్రమలు, ప్రాజెక్టుల ద్వారా 7.7 లక్షల ఉద్యోగాలిచ్చాం

● రూ.15.48 లక్షల పెట్టుబడులతో మరో 32 లక్షల ఉద్యోగావకాశాలు


● వ్యవసాయ రంగంలో 55 శాతం ఉపాధి అవకాశాలు ● గ్రోత్ ఇంజిన్లుగా హెల్త్, టూరిజం ● తలసరి ఆదాయం పెంపులో పారిశ్రామిక, సేవా రంగాలే కీలకం

● పరిశ్రమలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై శ్వేతపత్రం విడుదలలో ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : గడిచిన నాలుగేళ్ళలో రాష్ట్రవ్యాప్తంగా నిరు ద్యోగ యువతకు 7.7 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. భారీ, మెగా ప్రాజెక్టుల ద్వారా 2.51 లక్షల మందికి, ఎంఎస్ఎంఈల ద్వారా 3.3 లక్షల మందికి, ఏపీ ఎస్‌డీసీ ద్వారా 1.78 లక్షలు ఏపీ ఐటీఏ సమన్వయంతో 0.13 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,622 భారీ, మెగా ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయని, తద్వారా రూ.15.48 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు రానున్న రోజుల్లో 32.35 లక్షల ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఉద్యోగాల కల్పనలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని ప్రజావేదికలో పరిశ్రమలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఈ నాలుగున్నరేళ్ళలో జరిగిన అభివృద్ధిపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ సంపద సృష్టి, తలసరి ఆదాయం పెంపొందించేందుకు పరిశ్రమ, సేవారంగాలదే కీలకపాత్రని అయితే చారిత్రాత్మక కారణాలవల్ల ఈ రెండు రంగాల్లో రాష్ట్రం కొంత వెనుకబడి ఉందని తెలిపారు.

12 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా నిర్దేశించుకుని పనిచేశామని, అయితే 10.5 శాతం వృద్ధిని సాధిం చగలిగామని చెప్పారు. 55 శాతం ఉపాధి మన రాష్ట్రంలో వ్యవసాయ రంగం నుంచేఉందని, ఈశక్తిని పారిశ్రామిక, సేవా రంగానికి మార్పుచేయగలిగితే తలసరి ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. అదే సమయంలో నైపుణ్యాభివృద్ధి కూడా అవసరమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో మరింత పురోగతి ఉన్నప్పుడే నిర్దేశిత లక్ష్యాలను అధిగమించగలమని చెప్పారు. కనీసం 13 నుంచి 14 శాతం వృద్ధి స్థిరంగా ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. సర్వీస్ సెక్టార్‌లో పర్యాటక రంగం అత్యంత కీలకమైనదని, హెల్త్, ఎడ్యుకేషన్ టూరిజం గ్రోత్ ఇంజిన్‌లుగా నిలుస్తాయన్నారు. 2014 కు ముందు రాష్ట్ర ఉత్పత్తి వృద్ధి రేటు జాతీయ సగటుకంటే తక్కువగా ఉందని, ఇప్పుడు 8.36 శాతంతో దేశఅన్నా ముందు వరుసలో ఉన్నామని తెలిపారు. పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు 2010-11 నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో వోక్స్ వ్యాగన్, ప్రోటాన్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు వెనుకంజ వేశాయన్నారు. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు ఇచ్చిన ఆర్థిక ప్రోత్సాహకాలు ఏపీకి దక్కలేదని, కేంద్రం చేయూతనిస్తే మరింత పురోగతి సాధించగలిగేవారమన్నారు. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు కేంద్రం గ్రాంట్ మంజూరు చేయలేదని, అయితే ఢిల్లీ- ముంబై పారిశ్రామిక కారిడార్‌కు మాత్రం నిధులు కేటాయించిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విమర్శించారు. గ్రీన్ ఫీల్డ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్, కడప ఉక్కు పరిశ్రమల ఏర్పాటుకు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదని, వీటిని కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ఇదిలా ఉంటే రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో పబ్లిక్ సర్వీస్ డెలివరి గ్యారెంటీ చట్టం 2017ను తీసుకువచ్చామని చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన 74 సేవలను నిర్ణీత కాలవ్యవధిలో అందించేందుకు ఈ చట్టం దోహదపడుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ డెస్క్ పోర్టల్ తీసుకువచ్చామని, మొత్తం 19 శాఖలు 69 సేవలను ఈ పోర్టల్ ద్వారా అందించే వెసులుబాటు కల్పించా మన్నారు. ఆటో మొబైల్ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే ఇసుజు, కియా మోటార్స్, అపోలో టైర్స్, అశోక్ లైలాండ్, భారత్ ఫోర్జ్, హీరో గ్రూప్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు వచ్చి ఉత్పత్తిని ప్రారంభించే దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు వెల్లడించారు. ఫిన్‌టెక్ వ్యాలీగా విశాఖపట్టణాన్ని తీర్చి దిద్దు తున్నామని, ఇప్పటికే అనేక ఐటీ సంస్థలు ప్రారంభ మయ్యా యని తెలిపారు. ఐటీ, సెల్‌ఫోన్ తయారీ రంగంలో ఫ్యాక్స్‌కాన్, సెల్‌కాన్, ఫ్లెక్స్‌ట్రానిక్స్, డిక్సన్, టిసిఎల్, వోల్టాస్, రిలయన్స్ ఉత్పత్తులు ప్రారంభిం చాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఫార్మా సూటికల్స్ రంగంలో స్పైరా, హెల్త్ కేర్, డాక్టర్ రెడ్డి ల్యా బ్స్, లూపిన్, లారస్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా, వెస్ట్ ఫార్మా, దివిస్ ల్యాబ్స్, నాట్కో ఫార్మా, కంపెనీలు వచ్చాయని తెలి పారు. ఈ సమా వేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్ రెడ్డి, ఐటి శాఖ ముఖ్యకార్యదర్శి విజయానంద్, పరిశ్రమల శాఖ కార్య దర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, సమాచార శాఖ కార్యదర్శి రామా ంజనేయులు, కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్, గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ఎల్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ముగ్గురూ ఒక్కటే



ప్రధాని మోడీ, కేసీఆర్, జగన్‌లు ఒక్కటేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. ప్రత్యేక హోదాకు కేసీఆర్ లేఖ రాస్తానంటే మీకేంబాదంటూ జగన్ తనను ప్రశ్నిస్తున్నారని, కేసీఆర్ లేఖ రాస్తే తనకెలాంటి అభ్యంతరం లేదన్నారు. మోడీని కేసీఆర్, జగన్‌లు కలసి ప్రత్యేక హోదా ఇచ్చేలా ఒప్పించవచ్చు కదా అని అన్నారు. పరిశ్రమలు ప్రత్యేక హోదాతో వస్తాయని చెబుతున్న జగన్ దీనికోసం కేంద్రాన్ని ఒప్పించేలా ప్రయత్నించాలని సూచించారు. అదే విధంగా ట్రిపుల్ తలాక్ బిల్లుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రిపుల్ తలాక్ చెల్లదని, చెప్పటాన్ని తాముకూడా అంగీకరిస్తామని, అయితే ఆ తరువాత క్రిమినల్ కేసులు పెట్టడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ముస్లింలు దేశంలో భాగమేనని గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వం కావాలనే ఇదంతా చేస్తుందన్నారు. ఇప్పటికే ఈ అంశంపై రాహుల్ గాంధీ, కేజ్రీవాల్, మమతా బెనర్జీతో పాటు ఇతర నేతలతో మాట్లాడానని ఈ బిల్లును వ్యతిరేకిస్తామని చెప్పారు. ముందు ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. అన్నా డీఎంకే లాంటి పార్టీలను అడ్డంపెట్టుకుని ఏదో రకంగా ఈ బిల్లును ఆమోదం పొందేలా కేంద్రం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. గతంలో ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై పార్లమెంట్‌లో చర్చకు ప్రయత్నిస్తే అన్నా డీఎంకే, టీఆర్ఎస్ వంటి పార్టీలు అడ్డుపడ్డాయన్నారు.

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు 8న ప్రారంభం

కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో ట్రయిల్ రన్ విజయవంతం అయిందని, ఈ ఎయిర్ పోర్టును జనవరి 8న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విమానయాన సర్వీసులు రాష్ట్రంలో పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని, ఎయిర్ కనక్టవిటి పూర్తిస్థాయిలో వస్తే రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దగదర్తి, కుప్పం నుంచి కూడా త్వరలో విమాన సర్వీసులు ప్రారంభ మవుతాయని తెలిపారు. అదే విధంగా జనవరి 9న రామాయపట్నం పోర్టు పనులతో పాటు అదే రోజు పేపర్ మిల్లు ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

కేంద్రంపై విసుర్లు

కడప ఉక్కు కర్మాగారం, దుగరాజ పట్నం పోర్టు ఏర్పాటు విషయంలో కేంద్రా న్ని ఎన్నిసార్లు అభ్యర్థించినా ఏదో ఒక సాకు చూపుతూ వెనుకకు తీసుకు పోయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా కాకినాడ పెట్రో కారిడార్ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. దీంతో పెట్రో కారిడార్ ఏర్పాటుకు తామే చొరవ తీసుకున్నామని, జనవరి 4న దీనికి సంబంధించి ఒక ఎంవోయు చేసుకుంటున్నామని తెలిపారు. దాదాపు రూ.62 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టురట్టు


● ఇద్దరు నిందితుల అరెస్టు..

● భారీగా కొకైన్ పట్టివేత



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భాగ్యనగరంలో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభానికి ముందుగానే ఓ అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టును టాస్క్‌ఫోర్స్ వెస్ట్ జోన్ టీమ్ రట్టు చేసింది. గోవాకు చెందిన జోసెఫ్ అలమేద, ఏపీ, పశ్చిమ గోదావరికి చెందిన యు.శంకర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ డ్రగ్స్ పెడ్లర్లు నూతన సంవత్సరం సందర్భంగా నగరంలో పలు పబ్‌లు, క్లబ్‌లకు డ్రగ్స్ సరఫరా చేయడానికి యత్నిస్తున్న సమ యంలో పోలీసులకు చిక్కారు. ఫిల్మ్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతంలో డ్రగ్స్‌ను విక్రయిస్తున్నారు. ఒక గ్రాము కొకైన్‌ను మూడు వేల రూపాయలకు నైజీరియన్స్ నుంచి కొనుగోలు చేస్తున్నారు. పట్టుబడ్డ ఈ ఇద్దరు ముఠా సభ్యులలో జోసెఫ్ అలమేద దానిని రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు విక్రయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. అదే డ్రగ్‌ను తనకు పరిచయమైన తన ముఠాలో సభ్యుడిగా జాయిన్ అయిన శంకర్‌కు రూ.7 వేలకు విక్రయించేవాడు. శంకర్ దానిని రూ.11 వేలకు విక్రయించి అక్రమార్జనకు పాల్పడ్డాడు. గోవా కేంద్రంగా ఈ డ్రగ్స్ దంగా నిర్వహించినట్లు పోలీసులు గుర్తిం చారు. భాగ్యనగరం డ్రగ్స్ హబ్‌గా మారిందని, డ్రగ్స్ మాఫియాలు భాగ్యనగరం కేంద్రకంగా డ్రగ్స్ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని, ఇప్పటికే డ్రగ్స్ చేరాల్సిన చోటకు చేరిపోయాయని, పబ్‌లు, క్లబ్‌లు, రీసార్ట్‌లు, పలు ఈవెంట్లకు సైతం డ్రగ్స్ చేరినట్లు సమాచారం. నగర శివారులో సైతం డ్రగ్స్ మాఫియాలు నిషేధిత డ్రగ్స్‌ను తయారు చేసి పలు ఈవెంట్లకు వాటిని సరఫరా చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలీసు, ఎక్సైజ్ బృందాలు గట్టి నిఘా కొనసాగించాయి. ఈ క్రమంలో భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. అరెస్టయిన ముఠా సభ్యులు జోసెఫ్ అలమేద, శంకర్‌లనుంచి దాదాపు పది లక్షల విలువ చేసే 89 గ్రాముల కొకైన్, మూడు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తుతో సహా ఇద్దరు ముఠా సభ్యులను తదుపరి విచారణ నిమిత్తం బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు.

చంద్రబాబుపై ఫిర్యాదు



హిమాయత్‌నగర్, ప్రభ న్యూస్ : ప్రభుత్వ భూమిని బినామీలకు ధారదత్తం చేసిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది ఇమ్మనెని రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ రోజు తెలంగాణ ఇన్‌స్పెక్టర్ జనరల్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కమిషనర్ ఫిర్యా దు చేశారు. 2004 సంవత్సరంలో ఆయన ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గచ్చిబౌలిలో సెంట్రల్ యూనివర్సిటీకు చెందిన 400 ఎకరాల ప్రభుత్వ భూమిని తన బినామీలకు అక్రమంగా కట్టబెట్టారని ఫిర్యాదులో చెప్పారు. ఐఎమ్‌జీ అకాడమీ భారత ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు ఈ భూమిని కేటాయించినట్లు ఆయన వివరించారు. సంస్థ రిజిస్ట్రేషన్ అయిన ఎనిమిది రోజుల్లోనే ఈ భూమిని ఆయన బినామీలు అయిన అహోబలరావు, ప్రభాకర్‌రావుకు రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఈ భూమి రిజిస్ట్రేషన్‌పై గతంలో కోర్టుల్లో చాలా మంది వ్యాజ్యాలు దాఖలు చేశారని, ఇప్పటివరకు ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని న్యాయవాది తెలిపారు. ఫ్లోరిడాలో ఉన్న ఐఎమ్‌జీ అకాడమీ అనే కంపెనీ ఈ కంపెనీకి అనుబంధ సంస్థ అని చూపించుకొని ప్రజలను మభ్యపెట్టి చంద్రబాబు నాయుడు 15 వేల కోట్ల నుంచి 20 వేల కోట్ల వరకు అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. 1461/2004 అనే ఈ భూమికి సంబంధించిన డాక్యుమెంట్ రిజిస్ట్రర్ ఆఫీస్‌లో నమోదైందని దానిని రద్దు చేయాల్సిందిగా తెలంగాణ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కమిషనర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన విలువైన భూమిని కాజేసిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై తెలంగాణ ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన చంద్రబాబు నాయుడిపై సెక్షన్ 82, 83 రిజిస్ట్రేషన్ ఆర్ట్ క్రింద ప్రాసిక్యూషన్ చెయ్యా లని న్యాయవాది రామారావు కోరారు.

నకిలీ స్టాంపుల కుంభకోణం కేసు...

తెల్గీతోపాటు అందరూ నిర్దోషులే



ఫైల్ ఫోటో

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నకిలీ స్టాంపు పేపర్ల కుంభకోణం కేసులో అబ్దుల్ కరీం తెల్గీతో సహా మిగతా నిందితులందరూ నిర్దోషులంటూ మహారాష్ట్రలోని నాసిక్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో కీలక సూత్రధారి, ప్రధాన ముద్దాయిగా అన్న అబ్దుల్ కరీం తెల్గీ బ్రెయిన్ ఫీవర్‌తో గత ఏడాది అక్టోబర్ 23న బెంగళూరులోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ స్టాంపు పేపర్ల కుంభకోణంలో తెల్గీని నవంబర్ 2001లో ముంబై ప్రత్యేక పోలీసు బృందం అరెస్టు చేశారు. తెల్గీతో సంబంధాలున్నాయన్న అను మానంతో దేశంలోని వేర్వేరు రాష్ట్రా లలోని పలువురు నేతలు, ప్రముఖులు, వ్యాపారులను కూడా అరెస్టు చేశారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఎంఎల్ఏగా ఉన్న అధికార పార్టీకి చెందిన నేతను కూడా ముంబై పోలీసులు అరెస్టు చేయడం సంచలనం రేకెత్తించింది. ఈ కేసులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో పని చేస్తున్న పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు. నకిలీ స్టాంప్ పేపర్ల రాకెట్ నడిపినట్లు తేలడంతో తెల్గీకి 30 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడింది. జైలు శిక్షతో పాటు అతడికి రూ. 202 కోట్ల భారీ జరిమానా కూడా పడింది. పరప్పణ అగ్రహారం జైల్లో తెల్గీ శిక్ష అనుభవిస్తుండగానే అతడు మృతి చెందాడు.

కర్నాటక రాష్ట్రం బెల్గావీ జిల్లా ఖానాపూర్‌కు చెందిన అబ్దుల్ కరీం తెల్గీ ఓ రైల్వే ఉద్యోగి కుమారుడు, బీకాం వరకు చదివిన ఆయన కూరగాయల వ్యాపారం చేసి సౌదీ అరేబియా వెళ్ళాడు. 1991లో అక్కడి నుంచి ముంబై వచ్చి చీటింగ్ కేసులో అరెస్టయ్యాడు. 1994లో స్టాంప్ వెండర్ లైసెన్సు పొందిన తెల్గీ నాసిక్‌లోని సెక్యూరిటీ ప్రెస్, మహారాష్ట్ర రెవెన్యూ శాఖ అధికారులతో సత్సంబంధాలు ఏర్పరచుకున్నాడు. అదే ప్రెస్ నుంచి స్టాంప్ పేపర్లు ముద్రించే రంగును తన వద్దకు తెప్పించుకుని నకిలీ స్టాంప్ పేపర్లు ముద్రించి 350 మంది ఏజంట్లతో యథేచ్ఛగా వాటిని విక్రయించాడు. 2000 సంవత్సరంలో బెంగళూరులో నకిలీ స్టాంప్ పేపర్లు రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

ఏపీలో ఒకే రోజు 7 నోటిఫికేషన్లు!

● 1386 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ శ్రీకారం

● గ్రూప్-1లో 169 పోస్టులు ● గ్రూప్-2లో 446 పోస్టులు

అమరావతి, ఆంధ్రప్రభ : కొత్త సంవత్సరంలో నిరుద్యోగులకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంచి శుభవార్తను అందించింది. ఒకటి కాదు .. రెండు కాదు ... ఏకంగా సోమవారం ఏడు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి, నూతన సంవత్సరంలో నిరుద్యోగులకు తీపి కబురందించింది. దీంతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 1,386 పోస్టుల భర్తీకి గాను ఏపీపీఎస్సి ఈ ఏడు నోటిఫికేషన్లు విడుదల చేయడం గమనార్హం. ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషనల్‌కు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్, నాన్ ఇంజినీరింగ్‌కు సంబంధించి 405 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను ఫిబ్రవరి 6 నుంచి అదే నెల 27 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అదే విధంగా ఏపీ ఫిషరీస్ డిపార్టుమెంట్‌లో ఖాళీగా ఉన్న 43 ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు కూడా నోటీఫికేషన్ విడుదల చేశారు. ఈ పోస్టులకు జనవరి 17 నుంచి ఫిబ్రవరి 8 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఏపీపీఎస్‌సీ తెలిపింది. గ్రూపు -2 సర్వీస్‌కు సంబంధించి మొత్తం 446 పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు జనవరి 10 నుంచి 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 308 లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు ఫిబవరి 5 నుంచి అదే నెల 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇక గ్రూపు -1కు సంబంధించి మొత్తం 169 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు.ఈ పోస్టులకు జనవరి 7 నుంచి వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇక ఏపీ ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ సబ్ సర్వీస్‌కు సంబంధించి 10 అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి కూడా ఏపీపీఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 8 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏపీ ఇన్‌ఫర్మేషన్ సర్వీస్‌కు సంబంధించి 5 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్‌ఫర్మేషన్ ఇంజనీర్ పోస్టులకు కూడా నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు ఈనెల 22 నుంచి ఫిబ్రవరి 12 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీపీఎస్‌సి ప్రకటించింది.

రూ.231 కోట్లతో పాదచారుల వంతెన

● సాలార్‌జంగ్ మ్యూజియం ఎదురుగా నిర్మాణం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ పాతబస్తీలోని సాలార్‌జంగ్ మ్యూజియం ఎదురుగా రూ. 231.50 కోట్లతో పాదడారుల వంతెనను నిర్మించాలని హైదరాబాద్ రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్ణయించింది. కార్పొరేషన్ ఐదవ బోర్డు సమావేశం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి నేతృత్వంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మ్యూజియం ఎదురుగా అద్భుతమైన పాదచారుల వంతెనను నిర్మించాలని ప్రతిపాదించి ఆమోదించింది. అదే విధంగా కులీకుతుబ్‌షా బహుళ అంతస్తుల కార్ పార్కింగ్ కాంప్లెక్స్, ప్రస్తుతం ఉన్న నయాపూల్ బ్రిడ్జికి అనుసంధానంగా పండ్ల విక్రయదారుల కోసం ప్రత్యేకంగా మూసీపై మరో బ్రిడ్జిని నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను సిద్దం చేసి బోర్డు ముందు ప్రతిపాదిస్తే ఈపీసీ విధానంలో నిర్మించేందుకు టెండర్లను ఆహ్వానించాలని బోర్డు నిర్ణయించింది.



సిడ్నీ హార్బర్‌లో నూతన సంవత్సర వేడుకలు...

సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు మనదేశం కొత్త సంవత్సరంలోకి అడుగిడింది. అయితే, మనకంటే ముందు 15 దేశాలు 2019లోకి ప్రవేశించాయి. ప్రపంచంలో మొట్టమొదటగా కిరిబతి దీవుల ప్రజలు 2018కి వీడ్కోలు చెప్పారు. భారత కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కిరిబతి, సమోవా, క్రిస్మస్ దీవులు నూతన సంవత్సరానికి ఘనంగా ఆహ్వానం పలికాయి. ఆతర్వాత న్యూజీలాండ్, రష్యా, ఆస్ట్రేలియా దేశాలు న్యూ ఇయర్ సంబరాల్లో మునిగితేలాయి. మన పొరుగు దేశాలు పాక్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ మనకంటే ఆలస్యంగా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నాయి. ఇక చిట్టచివరగా అమెరికాలోని చిన్న దీవులైన బేకర్ ఐలాండ్, హౌలాండ్ మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు (భారత కాలమానం) హ్యాపీ న్యూయర్ సంబరాలు జరుపుకోవడం ఆనవాయితి.

కొత్తగా... వింతగా... సంబరాలు

ప్రపంచం అంతా కొత్త సంవత్సరం సంబరాల్లో మునిగితేలుతోంది. మరికొన్ని దేశాలు కొద్ది గంటల్లో న్యూ ఇయర్‌లోకి అడుగుపెట్టబోతున్నాయి. గతం తాలూకు అనుభవాలను నెమరువేసుకుంటూ, భవిష్యత్‌పై కొత్త ఆశలతో జగత్తు 2019లోకి ప్రవేశించింది. న్యూ ఇయర్ ప్రాంతాలకే కాదు, వ్యక్తిగతంనూ గొప్ప అనుభూతి. నిర్దిష్ట లక్ష్యాలతో క్రమబద్ధ నడవడికకు శ్రీకారం చుట్టాలని ప్రతిఒక్కరు అభిలషిస్తారు. అయితే, ఈ వేడుకలు జరుపుకునే పద్ధతి ఒక్కో దేశంలో ఒక్కోలా ఉంటుంది. సంప్రదాయాలు, ఆచారాలను బట్టి ఆయా దేశాల్లో వేడుకలు మారుతుంటాయి. ప్రపంచంలోని అనేక ఆసక్తికరమైన వేడుకల్లో కొన్నింటి గురించి తెలుసుకుందాం.

డెన్మార్క్...



ఇక్కడి ప్రజలు సరికొత్తగా వేడుకలు జరుపుకుంటారు. గ్రీటింగ్‌లు, పుష్పగుచ్ఛాలకు భిన్నంగా పింగాణీ ప్లేట్లను పగలగొట్టడం ఇక్కడి సంప్రదాయం. వినడానికి వింతగా అనిపించే ఈపద్ధతి డెన్మార్క్ న్యూయియర్ సంప్రదాయంలో భాగమైంది. చాలా దేశాల్లో ఈరోజున కుటుంబ సభ్యులంతా ఒక చోటకు చేరుకుంటారు. ఆహ్లాదంగా గడుపుతారు. కానీ, డెన్మార్క్ పౌరులు మాత్రం పింగాణీ ప్లేట్లను విసురుకుని కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. స్నేహితులు, ఆప్తుల గుమ్మాల వద్ద ప్లేట్లను పగలగొట్టి అభినందనలు తెలుపుకుంటారు. ఎవరి గుమ్మం వద్ద ఎక్కువ ప్లేట్లు విరిగిపడి ఉంటాయన్న దాన్ని బట్టి వారి పాపులారిటీకి గుర్తింపు లభిస్తుంది.

చైనా



న్యూ ఇయర్ చైనీయులకు మెగా ఈవెంట్లలో ఒకటి. ఇది రంగుల మయమైన ఉత్తేజిత పండుగ దినం. ఉత్తేజకరమైనది. ఇక్కడి వేడుకలు వైవిధ్యభరితంగా ఉంటాయి. వేర్వేరు సంప్రదాయాలకు నెలవై ఉంటాయి. ఎరుపు రంగు ఎన్వలప్ కవర్‌లో డబ్బులు దాచివుంచడం వీటిలో ఒకటి. ఈ కవర్లను పెద్దలు ఆప్యాయంగా పిల్లలకు అందించి ఆశీర్వదిస్తారు. మరొక సంప్రదాయంలో, పెద్ద పెద్ద శబ్దాలతో బాణాసంచా కాల్చుతారు. చలి మంటల తరహాలో మంటలు వేస్తారు. భారీ ధ్వనులు, మంటలు దుష్టశక్తులను తరిమి కొడతాయని విశ్వాసం.

ప్రాంతం	సమయం
సమోవా,కిరిబతి	సోమ,మధ్యాహ్నం3.30
చథమ్ ఐలాండ్, కివీస్	3.45
న్యూజీలాండ్ (5నగరాలు)	సాయంత్రం, 4.30
రష్యా (6 నగరాలు)	5.30
ఆస్ట్రేలియా (8నగరాలు)	6.30
అడిలైడ్ (ఆస్ట్రేలియా)	రాత్రి 7.00
జపాన్, ద.కొరియా	8.30
చైనా, ఫిలిప్పీన్స్	9.30
ఇండోనేషియా, థాయ్‌లాండ్	10.30
మయన్మార్, కొకోస్‌దీవులు	11.00
బంగ్లాదేశ్	11.30
నేపాల్	11.45
శ్రీలంక, భారత్	మంగళవారం, 00.00
పాకిస్తాన్	00.30
ఆఫ్ఘనిస్తాన్	01.00
ఇరాన్	02.00
మాస్కో	02.30
జర్మనీ	04.30
బ్రిటన్	05.30
అర్జెంటైనా	8.30
కెనడా	9.30
అమెరికా	10.30
ఫ్రెంచ్	15.00
బేకర్,హౌలాండ్ దీవులు	17.30

కిరిబతి ఫస్ట్.. హౌలాండ్ లాస్ట్



45 బి.సి లో జూలియస్ సీజర్ క్యాలెండర్ ప్రామాణిక గుర్తింపు పొందిన తర్వాత నుంచే జనవరి 1న నూతన సంవత్సర దినోత్సవంగా వాడుకలోకి వచ్చింది. కాలక్రమంలో,

జనవరి 1 నే ఎందుకు?

రాజకీయ అవసరాల దృష్ట్యా సంవత్సరానికి రోజులు జోడించడం ప్రారంభించారు. చైనీయుల కాలచక్రానికి భిన్నంగా సౌర సంవత్సరాన్ని అనురించారు. ఆ తర్వాత కాలంలో కొత్త సంవత్సరం తేదీల విషయంలో తర్జనభర్జనలు జరిగాయి. భూభ్రమణ సమయం లెక్కింపు, లీఘు సంవత్సరాల ప్రామాణికతపై బేధాభిప్రాయాలు వచ్చాయి. చివరకు క్రీ.శ 1570లో పోప్‌గ్రెగొరీ జెస్యూట్ అనే ఖగోళశాస్త్రవేత్త కొత్త క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ నుంచి జనవరి 1ని న్యూ ఇయర్‌గా పరిగణించడంపై ప్రపంచమంతా ఏకాభిప్రాయానికి వచ్చిందని చరిత్ర చెబుతోంది.

రష్యా



ఈ కమ్యూనిస్టు దేశంలో కొత్త సంవత్సరానికి ఎలా స్వాగతం పలుకుతారో ఊహించగలరా? ఇప్పటి సంగతెలా ఉన్నా, గతంలో కమ్యూనిస్టు మూలాలు అధికంగా ఉన్న కాలంలో సంబరాలు ఉండేవి కావట. ఇలాంటి దశనుంచి మిగతా ప్రపంచంతోపాటు వైభవంగా వేడుకలు జరుపుకునే స్థాయికి సంప్రదాయాలు క్రమంగా మారుతూ వచ్చాయి. ఆసక్తికర విషయం ఏమిటంటే, ఓ కాగితపు ముక్కపై తమ ఆకాంక్షను రాస్తారు. అనంతరం దానికి నిప్పంటిస్తారు. కొంత కాలిన తర్వాత మిగతా భాగాన్ని మద్యం గ్లాసులో ముంచుతారు. కోరికలను తలచుకుంటూ మత్తుగా గమ్మత్తుగా మద్యం పార్టీని ఆస్వాదిస్తారు.

జపాన్...

న్యూ ఇయర్ వేడుకలలోనూ జపనీయులది ప్రత్యేకత. దీనికోసం వారికి ప్రత్యేక సంప్రదాయాలున్నాయి. నూతన సంవత్సర పండుగను ఓమిసోకా అని కూడా పిలుస్తారు. జనవరి1న బౌద్ధ దేవాలయాలలో సంప్రదాయ బద్ధంగా గంటలు మోగిస్తారు. సరిగ్గా 108 సార్లు ఇలా చేస్తారు. ఈనంబర్‌కు ప్రత్యేకత ఉంది. 108 మానవ కోరికల సంఖ్యకు ప్రతీకగా భావిస్తారు. ప్రతికూల భావోద్వేగాలను దూరం చేయాలని, మనస్సును



నూతనోత్తేజం చేయాలని, భవిష్యత్ లక్ష్యాలను నెరవేర్చాలని కోరుతూ వీరు గంటలను మోగిస్తారు. టోక్యోలోని జోజోజి ఆలయం వేడులకు ప్రసిద్ధి.

థాయిలాండ్



అంబరాన్నంటే సంబరాలకు, కొత్త జోష్‌కు కేరాఫ్ థాయిలాండ్. గమ్మత్తయిన పార్టీలకు ప్రసిద్ధగాంచిన ఇక్కడ, జనవరి 1 మరింత ఉల్లాసంగా జరుపుకుంటారు. ఇదంతా నాణేకి ఒకవైప్ మాత్రమే. మరొకవైపు సంప్రదాయ బద్ధంగా న్యూ ఇయర్ వేడుకలు భిన్నంగా జరుగుతాయి. సాంగ్‌క్రాన్‌గా పిలుచుకునే ఈ సంబరాలలో చిన్నా, పెద్దా.. ఆడా మగా అందరూ పాలుపంచుకుంటారు. ఒకరిపై మరొకరు నీళ్లు చల్లుకుంటారు. ఎదుటివారిపై నీళ్లు గుప్పించి హ్యాపీ న్యూ ఇయర్ చెప్పేందుకు ప్రజలు నీళ్ల బకెట్లతో వీధుల్లో సంచరిస్తుంటారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి ఆనందమయ క్షణాలను గడుపుతారు.



ఎవరి లెక్క వారిదే..

సార్వజనీనంగా జనవరి 1వ తేదీని న్యూ ఇయర్‌గా పాటిస్తున్నప్పటికీ, కొత్త సంవత్సరానికి ఆయా ప్రాంతాల్లో నిర్దిష్ట కాలమానాలు వాడుకలో ఉన్నాయి. యూరోపియన్ దేశాల్లో కొన్నిచోట్ల ఆర్థిక సంవత్సరం ప్రారంభాన్ని కొత్త సంవత్సరంగా పరగణిస్తారు. ఈ క్రమంలో మార్చి నెల న్యూ ఇయర్‌గా భావిస్తుంటారు. తెలుగు కేలండర్ ప్రకారం ఉగాదిని కొత్స సంవత్సరం ప్రారంభంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఉక్కు మహిళ...ప్రభంజనం

- మళ్లీ బంగ్లా ప్రధానిగా హసీనా
- పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగో సారి విజయం
- సుదీర్ఘకాలం దేశాన్ని పాలించిన నాయికగా రికార్డు

287
299

ఢాకా: బంగ్లాదేశ్ ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనా పార్టీ అవామీలీగ్ ఘన విజయం సాధించింది.బంగ్లాదేశ్ ప్రధానిగా షేక్‌హసీనా వరుసగా నాలుగోసారి ప్రధాని పీఠాన్ని దక్కించుకున్నారు. ఆదివారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ భారీ మెజారిటీ సాధించింది. 299 స్థానాలకు పోలింగ్ జరిగితే అధికార అవామీలీగ్ 287స్థానాల్లో విజయం సాధించింది. ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ పరాజయం పాలైంది. గోపాల్‌గంజ్ నియోజకవర్గంలో ప్రధాని హసీనా రికార్డు స్థాయిలో 2లక్షల ఓట్ల మెజారిటీతో బీఎన్‌పీ అభ్యర్థిపై గెలుపొందారు. బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన హసీనాకు భారత ప్రధాని నరేంద్రమోడీ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా అవామీ లీగ్, బీఎన్‌పీ కార్యకర్తల మధ్య చెలరేగిన హింసలో 17మంది ప్రాణాలు కోల్పోయారు.

మొత్తం 300 నియోజకవర్గాలు ఉండగా ఓ అభ్యర్థి మరణం తో 299 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 151స్థానాలును హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ ఒంటరిగానే సాధించింది. అవామీలీగ్ సొంతంగా 267 చోట్ల విజయం సాధించగా, కూటమిలోని మిత్రపక్షాల అభ్యర్థులు 20 సీట్లలో విజయం సాధించారు. కాగా ప్రతిపక్ష నేషనల్ యూనిటీ పార్టీ (ఎన్‌యూఎఫ్) కేవలం 8స్థానాలకే పరిమితమైంది. ఈ ఫలితాలను తిరస్కరిస్తున్నామని మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్ యూ ఎఫ్ కన్వీనర్ కమల్ హొస్సై న్ డిమాండ్ చేశారు. జైలులో ఉన్నమాజీ ప్రధాని ఖలిదా జియా నేతృత్వంలోని బీఎన్‌పీకి ఈసారి కూడా పరాజయం తప్పలేదు.

బంగ్లాదేశ్ ఉక్కుమహిళ షేక్ హసీనా మరోసారి ప్రజల మద్దతు పొందారు. నాలుగోసారి బంగ్లా ప్రధానిగా ఎన్నికయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత (1971) ఇప్పటి వరకు ఏ ఒక్కరూ నాలుగు సార్లు ప్రధానిగా ఎన్నికకాలేదు. బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్‌కు హసీనా స్వయానా కూతురు. దీర్ఘకాలం దేశానికి సేవలు అందించిన అవామీ లీగ్ నేతగా ఇప్పుడు హసీనా నిలిచారు. సుస్థిర అభివృద్ధికి బాటలు వేయడం ద్వారా విశేష ప్రజాదరణ పొందారు. కాగా, ప్రతిపక్షం మాత్రం ఆమెను నియంత అంటూ విమర్శిస్తున్నాయి. ఆదివారం 11వ పార్లమెంటరీ ఎన్నికల్లో హసీనా తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆమె ప్రత్యర్థి, మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చీఫ్ అయిన ఖలీదా జియా అవినీతి కేసుల్లో చిక్కుకుని 17 ఏళ్లు జైలు పాలైంది. దీంతో ఎన్నికల్లో పాల్గొనేందుకు అనర్హుడయ్యాడు.

- 1947 సెప్టెంబర్ 28న తుంగిపరాలో జన్మించారు. ముజిబుర్ రెహ్మాన్ ఐదుగురు సంతానంలో హసీనా మొదటి వారు. అణుశాస్త్రవేత్త ఎంఏ వాజెద్ మియాతో 1968లో వివాహం జరిగింది. 2009లో వాజెద్ మరణించారు. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు సజీబ్ వాజెద్ జాయ్, కుమార్తె సైమా వాజెద్ హుస్సేన్ పుతుల్.
- విద్యార్థి దశనుంచే రాజకీయాలవైపు ఆసక్తి చూపిన హసీనా, 1975లో తన కుటుంబంపై జరిగిన ఆత్మాహుది దాడి తర్వాత రాజకీయ ప్రవేశం చేశారు. 1981లో ఇండియాలో నివశిస్తున్న సమయంలో, ఆమె పార్టీ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆరేళ్ల స్వయంప్రకటిత బహిష్కరణ అనంతరం, 17 మే 1981లో ఆమె తిరిగి స్వదేశంలో అడుగుపెట్టారు. నాటి నుంచి నేటివరకు పార్టీ అధినేతగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు.
- మిలటరీ డిక్టేటర్ హుస్సేన్ మహ్మద్ ఇర్షద్‌ను గద్దె దించేందుకు జియా పార్టీ బీఎన్‌పీతో కలిసి 1983లో సంకీర్ణ కూటమిని ఏర్పాటు చేశారు. 1990లో నియంతను గద్దెదించారు. అయితే ఆ తర్వాత వీరిద్దరు ప్రత్యర్థులుగా మారారు. బ్యాటిల్ ఆఫ్ బేగమ్స్‌గా రాజకీయ క్షేత్రంలో నిలిచారు. దాదాపు 28 ఏళ్లు వీరిద్దరు ప్రధాన ప్రత్యర్థులుగా ఒకరు తర్వాత ఒకరు అధికారంలో కొనసాగారు.
- 1996లో షేక్ హసీనా తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. చిరకాల ప్రత్యర్థి జియాను ఓడించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రధానిగా తొలిసారి ఐదేళ్లపాటు సుస్థిర ప్రభుత్వానికి అధినేతగా హసీనా రికార్డు సృష్టించారు. తిరిగి రెండవసారి 2008లో ప్రధాని అయ్యారు. 2014లో ఎన్నికల్లో ప్రతిపక్షం బీఎన్‌పీ ఎన్నికలను బహిష్కరించడంతో మూడవసారి హసీనా ప్రధాని అయ్యారు.
- 2009 నుంచి ప్రతిఏటా సగటును ఆరు శాతం వృద్ధిరేటుతో దేశాన్ని ఆర్థికంగా ముందుకు నడిపించారు. హసీనా హయాంలో తలసరి ఆదాయం మూడు రెట్లకు చేరింది. 2017 నాటికి దేశ జీడీపీ 250 బిలియన్ డాలర్లకు చేరింది. గతేడాది వృద్ధిరేటు 7.28 మార్కును చేరింది.
- దేశ వృద్ధిరేటుకు వస్త్రపరిశ్రమ మూలస్తంభంగా నిలిచింది. దాదాపు 45 లక్షల మందికి ఉపాధి కల్పించింది. ఇస్లామిక్ అతివాదులను కట్టడిచేయడంలో హసీనా విజయవంతం అయ్యారు. ఈ అంశంలో మద్దతుదారుల నుంచి పెద్దఎత్తున ప్రశంలు వచ్చాయి. 2016లో ఢాకా కేఫ్‌లో ఐదుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఘటన అవామీలీగ్ ప్రభుత్వానికి పేరు తెచ్చిపెట్టింది.
- 1971 నాటి స్వాతంత్ర్య పోరాటంలో దారుణ నేరాలకు పాల్పడిన శక్తివంతమైన ఇస్లామిస్ట్ ప్రత్యర్థులపై విచారణ జరిపించిన ధీరవనితగా ఖ్యాతి గడించింది. 2014 ఏకపక్ష ఎన్నికలో విజయానంతరం ఆమె నియంతృత్వ పోకడలను అవలంబించారన్నది విమర్శకుల వాదన. ప్రతిపక్షాన్ని అణగదొక్కి, ఏకపార్టీ ఆధిపత్యానికి పాకులాడిందన్న ఆరోపణలు వచ్చాయి.



72 ఏళ్లకు ఆ జంట కలిసింది!



తిరువనంతపురం: 1940 కాలంలో స్వాతంత్ర ఉద్యమం ఎంత ఉధృతంగా ఉండేదో.. బ్రిటిష్ పాలకులు ఎంత కఠినంగా వ్యవహరించేవారో ఇప్పటి తరానికి పుస్తకాలు చదివి తెలుసుకోడమే తప్ప తెలియదు. అప్పుడు ఎంతమంది యువకులు వాళ్ళ జీవితాలను పణంగా పెట్టి స్వాతంత్ర్యం కోసం పోరాడారో కూడా ఎవరైనా చెప్తేనే తెలుసు కోవాలి. అలాంటి ఒక జంట కథే కేరళలోని తిరువనంతపురంలో వెలుగులోకి వచ్చింది. పెళ్లయిన పదినెలలకే సత్యాగ్రహం ఉద్యమంలో జైలు పాలవడంతో విడిపోయిన ఒక జంట డెబ్బై రెండేళ్ల తర్వాత మళ్ళీ కలుసుకుంది. 1946లో కేరళలోని కువుంబాయి గ్రామంలో 13ఏళ్ల శారద అనే యువతికి 17ఏళ్ల యువకుడు నారాయణన్‌కు పెళ్లయింది. పెళ్ళైన పదినెలలకే నారాయణ్ తన తండ్రితో కలిసి సత్యాగ్రహంలో పాల్గొనడానికి భార్యను వదిలేసి ఉద్యమంలోకి వెళ్లిపోయారు. ఆ సమయంలో పోలీసులు నిత్యం శారదను వేధించడంతో ఆమె తమ పుట్టింటికి వెళ్ళిపోయింది. రెండు నెలల తర్వాత నారాయణ్ ఉద్యమంలో పోలీసులక ు పట్టుబడటంతో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధించింది. కొన్నేళ్ల తర్వాత శారద కుటుంబ సభ్యులు ఆమెకు మరో పెళ్లి చేయడం.. 1957లో జైలు నుంచి విడుదలైన తర్వాత నారాయణ్ కూడా మరో పెళ్లి చేసుకోవడంతో ఆ కథ అంతటితో ముగిసిపోయింది.

ఇప్పుడు 2018 సంవత్సరానికి వస్తే శారదకు ఆరుగురు సంతానం. వారిలో ఇప్పుడు నలుగురే బతికుండగా.. నారాయణన్‌కు ఇద్దరు సంతానం. ఇప్పుడు ఆయనక ు కేవలం మనవరాలు శాంతా కవుంబాయి ఒక్కరే ఉన్నారు. శారద కొడుకు భార్గవన్ ప్రకృతి సేద్యం పనిమీద నారాయణన్ బంధువుల వద్దకు వెళ్లడం.. కుటుంబ చరిత్ర గురించి చర్చ రావడంతో ఇరు కుటుంబాలు ఆనాడు విడిపోయిన జంటను కలపాలని నిర్ణయించారు.

భార్య చనిపోయి ఒంటరిగా ఉంటున్న నారా యణన్‌ను తన మొదటి భార్య అయిన శారద కుమారుడే పట్టుబట్టి కలిపారు. తొలుత తన తల్లి అసలు బయటకు వచ్చేందుకుగానీ, మాట్లాడేందుకుగానీ అంగీకరించలేదని.. చాలా ఒత్తిడి తర్వాత ఒప్పుకొన్నారని భార్గవన్ సంతోషంగా చెప్పు కొచ్చారు. డెబ్బై రెండేళ్ల తర్వాత కలిసిన ఈ జంట మధ్య కాసేపు మౌనమే మాటలుగా మా రగా.. ఎవరికి ఎవరి మీద కోపం లేదని అంతా కాల నిర్ణయమే అంటూ ఒకరి కన్నీళ్లను ఒకరు తుడిచారు.

రైల్వే బోర్డు చైర్మన్‌గా వినోద్ కుమార్ యాదవ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఐఆర్ ఎస్ఇఇ రైల్వే బోర్డు ఛైర్మన్, భారత ప్రభుత్వ ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ నియమితులయ్యారు. ప్రస్తుత ఛైర్మన్ అశ్వనీ లోహాని స్థానంలో వినోద్ కుమార్ బాధ్యతలు చేపడతారు. ఉన్నత స్థాయి నియామకాల మంత్రివర్గ కమిటి వినోద్ కుమార్ నియామాకాన్ని సోమవారం ఆమోదించింది.వినోద్ కుమార్ యాదవ్ దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా జోన్‌ను అనేక రంగాలలో అభివృద్ధి చేశారు. 2017 -18 ఆర్థిక సంవత్సరంలో రూ.13673 కోట్ల ఆదాయాన్ని సాధించడంతో జోన్ చరిత్రలో ఒక రికార్డు నెలకొల్పింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి భారతీయ రైల్వేలోనే మొట్టమొదటి గ్రీన్ రైల్వే స్టేషన్‌గా సీఐఐ - ఐజీబీసీ గ్రీన్‌కో ప్లాటినం రేటింగ్ అవార్డు లభించింది. జోన్‌లోని అన్ని స్టేషన్లల్లో నూటికి నూరుశాతం ఎల్ఈడి లైటింగ్ ఏర్పాటు చేయడంలో వినోద్‌కుమార్ విశేషంగా కృషి చేశారు. 269 కాపలాలేని లెవెల్ క్రాసింగ్లను సంపూర్ణంగా తొలగించి భద్రత పట్ల ఆయన శ్రద్ధను కనబరిచారు. భారతీయ రైల్వేలోనే మొట్టమొదటిసారిగా ప్రధాన స్టేషన్లల్లో నగదు రహిత చెల్లింపులు జరిగే విధంగా వినోద్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. 186 కిలో మీటర్ల నూతన రైలు మార్గం, 63 కిలో మీటర్ల డబ్లింగ్, ట్రిప్లింగ్ రైలు మార్గాలు పూర్తి కావడం, స్వచ్ఛ రైలు, స్వచ్ఛ భారత్ ఉద్యమానికి ఊతంగా వినోద్‌కుమార్ యాదవ్ అనేక కార్యక్రమాలు చేపట్టారు. రైల్వే ఉద్యోగుల పిల్లల కోసం మెగాజాబ్ మేళా, ఉద్యోగుల కుటుంబాల కోసం పాస్‌పోర్టు మేళా, ఉద్యోగుల విదేశీయానంకై రాయితీలు వంటి కార్యక్రమాలను వినోద్ కుమార్ యాదవ్ చేపట్టారు.

ఏఐసీసీ అధికార ప్రతినిధిగా దాసోజ్ శ్రావణ్‌కుమార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత దాసోజ్ శ్రావణ్‌కుమార్‌ను ఏఐసీసీ అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నియమించారు. రాహుల్ ఆదేశాల మేరకు ఏఐసీసీ కమ్యునికేషన్ ఇంచార్జి రణదీప్‌సింగ్ సుర్జీవాల శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 10 మంది ఏఐసీసీ అదికార ప్రతినిధులను నియమించగా.. రాష్ట్రం నుంచి దాసోజ్‌కు అవకాశం రావడంపైన పలువురు కాంగ్రెస్ నేతల అభినందనలు తెలిపారు. ఇప్పటికే టీ పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధిగా ఉన్న శ్రావణ్‌కుమార్ ప్రజా సమస్యలపైన ఎప్పటికప్పుడు స్పందింస్తూ అధికార టీఆర్ఎస్‌ను ఇరాకటం పెట్టడంలో కీలకపాత్ర పోశిస్తారు. నీటిపారుదల, విద్యుత్, దళితుల సమస్యలు, దాడులపై పవర్‌పాయింట్ ప్రజేంటషన్ కూడా ఇచ్చారు. కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలోని ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటి చేశారు. యూపీఐ చైర్ పర్సన్ సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు ప్రముఖ నేతల ప్రసంగాలను తెలుగులోనూ అనువాదం చేయడంలో పార్టీలో ప్రముఖ గుర్తింపు పొందారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో సుదీర్ఘంగా పని చేసిన దాసోజ్ శ్రావణ్‌కుమార్ విద్యార్థి ఉద్యమాల్లో కూడా కీలకంగా పని చేశారు. ఉస్మానియా యూనివర్సిటిలో ఎంబీఏ, ఎంతో పాటు అర్గనైజేషన్ సైకాలజీలో పీహెడీ పట్టా పొందారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తననకు జాతీయ స్థాయిలో పదవి ఇవ్వడం అభినందనలు తెలిపారు. టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,కొప్పుల రాజు, జైరాం రమేష్‌తో పాటు పార్టీ ముఖ్యనేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మలాంటి పోలీస్

మానవత్వం చాటిన మహిళా కానిస్టేబుల్

- భర్త ప్రోత్సాహంతో చనుబాలిచ్చిన పోలీస్
- రెండు నెలల పసికందుకు పాలిచ్చి ప్రాణదానం
- అఫ్జల్‌గంజ్ ఠాణాలో వెల్లి విరిసిన మానవత్వం
- ఉన్నతాధికారుల ప్రశంస



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నూతన సంవత్సరం ప్రారంభ వేళ.. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతున్న తరుణంలో ఓ మహిళా కానిస్టేబుల్ మాన వీయతను చాటింది. రెండు నెలల పసికందుకు పాలిచ్చి ప్రాణం నిలిపింది. పోలీసు ఉన్నతాధికారుల ప్రశంసలనందుకుంది. ఈ పంఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి యాకుత్‌పురాకు చెందిన ఎండి ఇ్రఫాన్ అనే వ్యక్తి పాల కోసం గుక్కపెడతున్న రెండు నెలల పసికందును అఫ్జల్ గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చాడు. ఆదివారం రాత్రి 9-30 గంటల సమయంలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వద్ద ఎండి ఇర్ఫాన్ నుల్చొని ఉన్నాడు. ఆ సమయంలో ఓ ముస్లిం మహిళ తాగిన స్థితిలో తన దగ్గరకు వచ్చి రెండు నెలల పసికందును ఇచ్చి నీళ్లు తీసుకొస్తానని చెప్పి తిరిగి రాలేదు. ఆ పసికందు గుక్క తిప్పుకోకుండా ఏడుస్తోంది. ఆ సమయంలో ఏం చేయాలో ఇర్ఫాన్‌కు తోచలేదు. దీంతో ఆ పసికందును తీసుకుని యాకుత్‌పురాలోని తన ఇంటికి వెళ్లి పాలకోసం గుక్కపెడుతోందని భావించి పాలు తాగించేందుకు యత్నించాడు. అయితే, ఆ పాలను ఆ పసికందు తాగలేదు. దీంతో తన స్నేహి తులు, బంధువులతో పసికందును తీసుకుని ఇర్ఫాన్ అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అఫ్జల్‌గంజ్‌లో రాత్రి విధులు నిర్వహిస్తున్న ఇ-కాప్స్ ఎం.రవీందర్ (పీసీ 2821)కు పసికందును అప్పగించారు. ఆ పసికందు పాల కోసం ఏడుస్తుందని గ్రహించిన రవీందర్ క్షణం కూడా ఆలస్యం చేయకుండా మెటర్నటీ లీవ్‌లో ఉన్న తన భార్య బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రియాంక(డబ్ల్యూపీసీ 5538) కు విషయాన్ని ఫోన్ ద్వారా వివరించాడు. భర్త ఫోన్‌లో పాప ఏడుపు విని రవీందర్ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోనికి తీసుకున్న ప్రియాంక క్షణం కూడా ఆలస్యం చేయకుండా క్యాబ్‌లో అఫ్జల్‌గంజ్ పీఎస్‌కు చేరుకుని ఆ పసికందుకు పాలిచ్చి ప్రాణం నిలిపింది. ఆ పసికందు అరగంట పాటు పాలు తాగిందని ప్రియాంక భర్త రవీందర్ తెలిపారు. తమకు రెండు నెలల బాబు ఉన్నాడని, ఆ బిడ్డను కూడా తమ బిడ్డగానే బావించామని రవీందర్ పేర్కొన్నాడు. అంతేకాదు, పాప విషయం తెలవగానే పెంచుకుందామని తన భార్య ప్రియాంక తెలిపిందన్నాడు. ఏది ఏమైనా తక్షణం అవసరమైన తరుణంలో ఆ పసికందుకు పాలిచ్చి ప్రాణం నిలిపిన దంపతులు ప్రియాంక, రవీందర్‌లను పోలీసు కమిషనర్ అంజనీకుమార్ తదితర పోలీసు ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులంటే క్రౌర్యంగా ఉంటారని అంద రూ అంటుంటారని, వారిలో కూడా మానవత్వం ఉంటుందని ప్రియాంక, రవీందర్ దంపతులు నిరూపించారన్నారు. కాగా, భర్త రవీందర్ ఫోన్ చేసిన సమయంలో భార్య ప్రియాంక నిద్రపోతోంది. అయితే, భర్త చెప్పిన విషయాన్ని ఆకళింపు చేసుకుని ఆ పసికందును రక్షించాలని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆకలితో అలమటిస్తున్న పసికందుకు పాలిచ్చి వెళ్లింది. అనంతరం ఆ పసికందు ఏడుపు ఆపడంతో ఆ పసికందు ఎవరిదై ఉంటుందని పోలీసులు అన్వేషణ కొనసాగించినా ఫలితం లేకపోవడంతో ఆ పసికందును పేట్లబురుజు గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం పోలీసులు అన్వేషణ కొనసాగించిన తరుణంలో ఆ పసిపాప తల్లిదండ్రుల ఆచూకీ లభ్యమైంది. వారి పేర్లు ఫిరోజ్‌ఖాన్, షబనా బేగంలు. వారికి ఇద్దరు సంతానం సమ్రీన్ బేగం(5), ఫాతిమా బేగం(2). ఆదివారం రాత్రి తన కూతురు రెండు నెలల పసికందు ఫాతిమాబేగంను ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వద్ద ఒకరికి ఇచ్చానని తెలిపింది. ఆ సమయంలో తాను కల్లు తాగి ఉన్న నేపథ్యంలో తన బిడ్డను ఎవరికీ ఇచ్చానన్న విషయాన్ని మర్చిపోయానని పోలీసులకు తెలిపింది. ఇక షబనా బేగం భర్త ఫిరోజ్‌ఖాన్ కూడా మద్యం, వైటనర్‌కు బానిస. సెల్‌ఫోన్ చోరీ కేసులో గతంలో ఫిరోజ్‌ఖాన్‌ను అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్టు చేశారు. కాగా, షబనాబేగం, ఫిరోజ్‌ఖాన్‌లను హాస్పిటల్‌కు పోలీసులు తీసుకెళ్లారు. పాప వీరిని గుర్తించడంతో వారికి పోలీసులు అప్పగించారు. పాపకు పాలిచ్చి ప్రాణాలు కాపాడిన ప్రియాంక, అందుకు సహకరించిన భర్త రవీందర్‌లలో ప్రియాంక 2014 బ్యాచ్‌కు చెందినవారు కాగా, రవీందర్ 2010 బ్యాచ్‌కు చెందినవారు. ఆ దంపతులు చూపిన చొరవ ఓ పసికందు ప్రాణ రక్షణకు పడిన తపన.. పాలిచ్చి రక్షించిన వైనం పోలీసు ఉన్నతాధికారులను సైతం కదిలించింది. ఇక ఈ దంపతులకు అభినందనలు తెలుపుతూ ఇలాంటి మంచి పనులకు ముందుండాలని, ముందుంటారని ఆకాంక్షిస్తూ హైద రాబాద్ పోలీసు కమిషనర్ అంజనీకుమార్ తన తరపు నుంచి ఓ చిరు కానుకని సైతం ఆ దంపతులకు అందించారు. మీడియా సమావేశానికి హాజరైన ప్రియాంక, రవీందర్ దంపతులు తమ రెండు నెలల బాలుడిని కూడా వెంట తీసుకొచ్చారు.

మార్పుల్లేవ్

సీఎం కార్యాలయంలో ఉన్నతాధికారుల కొనసాగింపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక హోదాల్లో పనిచేస్తున్న పలువురు అధికారులను కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి ఉత్తుర్వులు జారీచేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్. నర్సింగరావును సీఎం కార్యా లయంలో ముఖ్య కార్యదర్శిగా, విశ్రాంత ఐఎఫ్ ఎస్ అధికారిగా పని చేసి సీఎం కార్యా లయంలో ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న కె.భూపాల్‌రెడ్డి, మరో ఐఏఎస్ అధికారి పి.రాజశేఖరరెడ్డి స్పెషల్ కార్య దర్శిగా, స్మితా సబర్వాల్‌ను కార్య దర్శిగా, సందీప్ కుమార్ సులానియా, మాణిక్‌రాజ్‌లను కార్య దర్శు లుగా కొనసాగిస్తూ ఉత్త ర్వులు జారీ అయ్యా యి.ఎన్నికల సమ యం లోనూ వీరంతా ముఖ్య మంత్రి కార్యా లయంలో ఆయా హోదాల్లో పనిచేశారు. తిరిగి అధికారం చేప ట్టాక కూడా వీరిని తన కార్యా లయంలో కొనసాగించాలని ఇచ్చి న ఆదేశానుసారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామక ఉత్తర్వులు జారీచేశారు.

న్యూ ఇయర్ జోష్..



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భాగ్యనగరంలో నూతన సంవత్సర వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పబ్‌లు, క్లబ్‌లు, రిసార్ట్‌లతో పాటు పలు ఈవెంట్లల్లో యువత పాల్గొని సందడి చేసింది. వచ్చే పాటలకు లయబద్ధంగా డాన్సులు చేస్తూ 2018కి వీడ్కోలు పలుకుతూ ఫుల్ జోష్‌తో 2019ని ఘనంగా స్వాగతించింది. ఎప్పటి మాదిరిలానే ఈ మారు నూతన సంవత్సర వేడుకల్లో యువతే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యువతను ఆకర్షించే విధంగా ఈవెంట్ నిర్వాహకులు సైతం పలు కార్యక్రమాలను చేపట్టారు. సోమవారం రాత్రి 8 గంటల నుంచి 1 గంట వరకూ ఈ వేడుకలను నిర్వహించారు. వారం రోజులుగా పబ్‌లు, క్లబ్‌లు, రిసార్ట్‌లతో పాటు పలు చోట్ల ఈవెంట్‌ల నిర్వాహణకు నిర్వాహకులు శ్రమించారు. ఆసక్తికరమైన కార్యక్రమాలకు రూపకల్పన చేసి యువతను ఆకట్టుకోగలిగారు. 12 గంటలు కొట్టగానే ఆయా ఈవెంట్లలో పాల్గొన్న యువత వెల్‌కమ్ 2019 అని పెద్ద పెట్టున నినదించింది. వేడుకలు ఉత్సాహభరిత పూరిత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకునేందుకు అనువుగా పోలీసులు పలు ఆంక్షలను విధించారు. బేగంపేట ఫ్లైఓవర్ మినహా మిగతా ఫ్లైఓవర్‌లను మూసివేశారు. నిర్ణీత సమయం వరకే మద్యం అమ్మకాలకు అనుమతినిచ్చారు. ఈవెంట్‌లలో మద్యం తాగిన వారిని తిరిగి వారి గమ్యస్థానానికి చేర్చాల్సిన బాధ్యతలను సైతం ఈవెంట్ నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. డీజేలకు అనుమతినివ్వలేదు. అశ్లీల నృత్యాలపై నిషేధం విధించారు. ఈవెంట్ నిర్వాహకులు ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాలతో పాటు లోపల ఈవెంట్ నిర్వహణను సైతం సీసీ కెమెరాల నిఘాలో ఉంచాలని ఆదేశించారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్ వద్ద హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ కేక్‌ను కట్ చేసి నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. రోడ్లపై తాగి తందనాలు ఆడితే జైలు తప్పదన్న హెచ్చ రికలను సైతం పోలీసు శాఖ అందించింది. ఒంటిగంట దాటిన తర్వాత డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించింది. ఇందుకు ముందుగానే సోమవారం ఉదయం నుంచి డ్రంకెన్ డ్రైవ్ చేసి వాహనాలు నడపరాదని, సీటుబెల్ట్ ధరించాలన్న హెచ్చరికలతో కూడిన బ్యానర్లను భాగ్యనగరంలోని ప్రధాన జంక్షన్లల్లో ప్రదర్శించింది. ఇన్సిడెంట్ ఫ్రీ, యాక్సిడెంట్ ఫ్రీ లక్ష్యంగా పలు చర్యలను తీసుకుంది. మరోవైపు నూతన సంవత్సర ప్రారంభ ఘడియన నగరంలో పలు ప్రాంతాల్లో ప్రజలంతా వీధులపైకి వచ్చి పరస్పరం హ్యాపీ న్యూఇయర్ చెప్పుకున్నారు. పూర్తిస్థాయిలో ఉత్సాహభరిత పూరిత వాతా వరణంలో ప్రజలంతా రోడ్లపైకి వచ్చి 2019కి ఘనస్వాగతం పలికారు. గమ్యస్థానానికి చేరే యువత స్పీడ్‌ను కంట్రోల్ చేసేందుకు ముందు జాగ్రత్త చర్యగా ఫ్లైఓవర్లను మూసివేశారు. మరోవైపు బిల్డింగ్‌లపై స్నేహితులతో కలిసి ఓ ఈవెంట్‌లాగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకునేందుకు సైతం పోలీసు పర్మిషన్ తప్పనిసరి చేశారు. గతం కంటే భిన్నంగా ఈ మారు పోలీసులు పలు రకాల ఆంక్షలు అమలుచేశారు. అందుకు తగ్గ విధంగా ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. ఈ విధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేని విధంగా ప్రశాంత వాతావరణంలో ఉత్సాహభరితమైన రీతిలో న్యూఇయర్ వేడుకలను జరుపుకునేందుకు ఈ నిబంధనలని పోలీసులు పేర్కొన్నారు.

నూతన సంవత్సరానికి 1.36లక్షల మొక్కలతో స్వాగతం



రాజమహేంద్రవరం, ప్రభ న్యూస్ : నూతన సంవత్సరానికి విశ్వవ్యాప్తంగా స్వాగతం తెలపడానికి భారీ ఏర్పాట్లు చేసిన సంగతి తెలిసిందే. అయితే వినూత్న రీతిలో మొక్కలతో ఏర్పాటుచేసే ఆకృతులు దేశవ్యాప్త ప్రసిద్ధిగాంచిన కడియం నర్సరీల్లో విశేషంగా ఆకట్టుకుంటాయి. ఈ ఏడాది కూడా నర్సరీ రైతులు విరివనాలతో 2019కు స్వాగతం పలకడానికి భారీ ఏర్పాట్లు చేసారు. ముఖ్యంగా పల్ల వెంకన్న నర్సరీలో 1.36లక్షల స్వదేశీ విదేశీ మొక్కలతో రూపొందించిన న్యూఇయర్ కూర్పు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అందరూ ఐక్యతగా ఉండి దేశాభివృద్ధికి దోహదపడాలనే సందేశాన్నిచ్చేలా ఈ ఆకృతిని పాతికమంది కూలీలు వారంరోజులపాటు శ్రమించి రూపొందించినట్లు ఆ నర్సరీ రైతు పల్ల సుబ్రహ్మణ్యం తెలిపారు.


సోనియా, రాహుల్ ప్రమేయం లేదు

ఏకే ఆంటోని సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : మాజీ రక్షణ మంత్రి ఏకే ఆంటోని సంచలన వ్యాఖ్యలు చేశారు. యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి ఏ ఒప్పందంలోనూ ప్రమేయం లేని చెప్పుకొచ్చారు. అగస్టావెస్ట్ లాండ్ కుంభకోణం మధ్యవర్తి మిచెల్ క్రిస్టియన్ శ్రీమతి గాంధీ పేరును బయటపెట్టిన నేపథ్యంలో ఆంటోని ఈ వ్యాఖ్యలు చేశారు. ఎలాంటి రక్షణ ఒప్పందంలో సోనియా, రాహుల్ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. అగస్టా వెస్ట్‌లాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది ఖుడా తానేనని ఆంటోని వ్యాఖ్యానించడం గమనార్హం. తాను రక్షణ మంత్రిగా ఉన్నప్పుడే అగస్టా వెస్ట్‌లాండ్ ఒప్పందం జరిగిందన్న ఆంటోనీ.. ఒప్పందాల్లో...రక్షణ పరికరాల కొనుగోలులో సోనియా, రాహుల్ ఎన్నడూ జోక్యం చేసుకోలేదన్నారు.అగస్టా ఒప్పందంలో అవినీతి జరిగిందని ఇటలీ నుంచి నివేదిక వచ్చినప్పుడు తానే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించానని చెప్పారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే బీజేపీ తమ పార్టీ నాయకులపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆంటోని ఆరోపించారు. ప్రధాని మోడీ, ఆయన ప్రభుత్వంలోని వ్యక్తులే అగస్టా వెస్ట్‌లాండ్‌ను కాపాడేవారు.. ప్రమోటర్లు అని చురకలంటించారు. అగస్టా కేసులో యూపీఏ ప్రభుత్వం ఇటలీలోని మిలాన్ కోర్టులోనూ పోరాటం చేసిందన్నారు. తాము అధికారం నుంచి దిగిపోగానే మోడీ ప్రభుత్వం అగస్టా కంపెనీపై చర్యలు తీసుకోకుండా సదరు కంపెనీకి వత్తాసుపాడుతూ వచ్చిందని ఆరోపించారు.

కొత్త సీఐసీగా సుధీర్ భార్గవ



న్యూఢిల్లీ: నూతన చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా సుధీర్ భార్గవను కేంద్ర ప్రభుత్వం నియమించింది. సీఐసీ భార్గవతోపాటు మరో నలుగురు కమిషనర్లు కొత్తగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. కమిషన్‌లో మొత్తం 11మంది కమిషనర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం సీఐసీ తోపాటు మరో ముగ్గురు కమిషనర్లు మాత్రమే ఉన్నారు. తాజాగా మాజీ ఐఎఫ్ ఎస్ అధికారి యశ్వర్ధన్ కుమార్ సిన్హా, మాజీ ఐఆర్ఎస్ అధికారి వనజ ఎన్ సర్నా, మాజీ ఐఏఎస్ నీరజ్‌కుమార్ గుప్తా, మాజీ లా సెక్రటరీ సురేశ్‌చంద్ర ఈ నలుగురు సమచార కమిషనర్లుగా నియమితులయ్యారు. వీరి నియామకంతో సమాచార కమిషన్‌లో సభ్యుల సంఖ్య ఏడుకు పెరిగింది. సమాచార కమిషనర్లుగా వీరి నియామకాన్ని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదించారు. ప్రభుత్వంలో ఉన్నత ఉద్యోగాలు చేసినవారు బ్యూరోక్రాట్స్ కాకుండా లా, సైన్స్, సోషల్ సర్వీస్ మేనేజ్‌మెంట్, జర్నలిజం తదితర రంగాల్లోని నిపుణులకు నాన్‌బ్యూరోక్రాట్స్‌ను కమిషనర్లుగా ప్రాతినిధ్యం కల్పించాలని ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 12(5) ని పేర్కొంటూ మాజీ కమిషనర్ శ్రీధర్ ఆచార్యులు చేసిన విజ్ఞప్తిని తాజా నియామకాల్లో కేంద్రం విస్మరించింది. కాగా సమాచార కమిషనర్లుగా నియమితులైన నలుగురు బ్యూరోక్రాట్స్ అందరూ ఈ ఏడాదే పదవీ విరమణ చేశారు.

ఢిల్లీలో లొంగిపోయిన సజ్జన్‌కుమార్

న్యూఢిల్లీ: సిక్కు వ్యతిరేక అల్లర్లు (1984) కేసులో దోషిగా జీవితఖైదు శిక్షపడిన మాజీ కాంగ్రెస్ నేత సజ్జన్‌కుమార్ (73) సోమవారం ఢిల్లీ కోర్టు ఎదుట లొంగిపోయారు. మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అదితి గార్గ్ ఎదుట లొంగిపోయారు. అనం తరం సజ్జన్‌కుమార్‌ను ఢిల్లీలోని మండోలి జైలుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు. తీహార్ జైలుకు తరలించాలన్న సజ్జన్‌కుమార్ పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. అయితే తనకు భద్రత కల్పించి ప్రత్యేకవాహనంలో జైలుకు తరలించాలన్న వినతిని న్యాయమూర్తి ఆమోదించారు.

వణికిస్తున్న చలి-పులి!

లంబసింగిలో జీరో డిగ్రీల ఉష్ణోగ్రత

అమరావతి, ఆంధ్రప్రభ : తెలుగురాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకి పడిపోతున్నాయి. పెథాయ్ తుపాను తర్వాతి నుంచి చల్లని గాలులు ప్రజలను వణికిస్తున్నాయి. రాత్రి సమయాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. విశాఖ ఏజన్సీని చలి వణికిస్తోంది. లంబసింగిలో అత్యల్పంగా జీరో డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. చింతపల్లిలో 1.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా మినుములూరులో మూడు డిగ్రీలు, పాడేరులో నాలుగు డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. తెలంగాణాలో చలిగాలుల తీవ్రత అధికంగా ఉంది. ఏజన్సీ ప్రాంతాల్లో మూడు డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గత పదేళ్లతో పోలిస్తే 2010 డిసెంబర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



కుట్ర భగ్నం

ఇద్దరు పాక్ సైనికులు హతం

శ్రీనగర్: దాయాది దేశం పాకిస్తాన్ కుట్రలను భారత్ మరోసారి తిప్పికొట్టింది. జమ్ము కాశ్మీర్ సరిహద్దుల నుంచి చొరబాటుకు యత్నించిన ఇద్దరు పాక్ సైనికులను భారత జవాన్లు మట్టుబెట్టారు. నూతన సంవత్సర వేళ సరిహద్దుల్లో భారీ కుట్ర చేసిన నౌగామ్ సెక్టర్ లో ఎల్‌వోసి వద్ద భారత సైనికుల పోస్ట్‌లపైదాడులు చేసేందుకు పాక్ సరిహద్దు భద్రతా బృందం ప్రయత్నించింది. వెంటనే స్పందించిన భారత భద్రతా బలగాలు పాక్ సైనలను మట్టుబెట్టాయి. హతమైన వారిద్దరూ పాక్ సైనికులుగా గుర్తించారు.. ఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. భారత్‌లో భారీ దాడికి కుట్ర చేసినట్లు అనుమానిస్తున్నారు. హతమైన వారిద్దరూ పాకిస్తాన్ సైనిక దుస్తుల్లో వచ్చారని.. వారిద్దరూ దట్టమైన అడువుల గుండా భారత్ లోకి ప్రవేశించినట్లు ఆర్మీ అధికారులు తెలియజేశారు. ఆర్మీ పోస్టు సమీపంలోకి రాగానే వారి కదలికలను గుర్తించి.. మన సైన్యం వెంటనే కాల్పులు జరపడంతో ఇద్దరూ మృతి చెందినట్లు వివరించారు.



తలాక్ బిల్లుకు బ్రేక్

• సెలెక్ట్ కమిటీకి పంపాలని విపక్షాల తీర్మానం • 90 శాతం విపక్షాలు మద్దతిచ్చాయి: గులాంనబీ ఆజాద్ • సుప్రీంకోర్టు తీర్పు ప్రకారమే బిల్లు: న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ • ముస్లిం మహిళలకు కాంగ్రెస్ అన్యాయం: విజయ్ గోయల్ • అధికార, విపక్ష సభ్యుల ఆరోపణలతో స్తంభించిన రాజ్యసభ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లుకు బ్రేక్ పడింది. సోమవారం ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు సభా కార్యక్రమాలకు అడ్డు తగిలాయి. సుమారు 11 పార్టీలకు చెందిన ఎంపీలు ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. నోటీసుపై తొలుత చర్చ జరిగిన తర్వాతే ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశాయి. సభలో సగానికి మించి ఎంపీలందరూ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేస్తున్నారని విపక్ష నేత గులాంనబీ ఆజాద్ అన్నారు. విపక్ష సభ్యులు ఇచ్చిన తీర్మానంపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. స్టాండింగ్ కమిటీకి, సెలెక్ట్ కమిటీకి పంపకుండా అడ్డుకోవడం సమంజసం కాదని అన్నారు. ముఖ్యమైన ఈ బిల్లు అనేక మంది జీవితాలపై ప్రభావం చూపుతుందన్నారు. స్టాండింగ్ కమిటీ పరిశీలన లేకుండా హడావిడిగా పాస్ చేయించుకోవడం సమంజసం కాదన్నారు. తాము ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చ జరగాలని అన్నారు. లోక్‌సభలో బిల్లు పాసైనప్పటికీ రాజ్యసభ రబ్బర్ స్టాంప్ కాదని కాంగ్రెస్ పక్ష ఉప నేత ఆనంద్‌శర్మ అన్నారు. ఈ బిల్లుపై శాసనకర్తల పరిశీలన చేయాలని కోరారు. తాము ఈ బిల్లును వ్యతిరేకించడం లేదని దీని పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపాలని కోరుతున్నామని టిఎంసి నేత డెరెక్ ఒబ్రెయిన్ అన్నారు. 15 పార్టీలు ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని రూల్ 125కింద నోటీసు ఇచ్చాయన్నారు. 90 శాతం మంది విపక్ష సభ్యులంతా ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కోరుతున్నాయన్నారు. అయితే విపక్షాల వాదనను ప్రభుత్వం తిప్పికొట్టింది. సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే ట్రిపుల్ తలాక్ బిల్లును తెచ్చామని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ఈ బిల్లుపై విపక్షాల ఎలహాలు వినేందుకు, చర్చకు తాము సిద్ధమని అన్నారు. మానవత్వంతో ఆలోచించి ఈ బిల్లు కు మద్దతివ్వాలని కోరారు. ఈ బిల్లును పెండింగ్ పెట్టేందుకు తాము అంగీకరించే ప్రసక్తి లేదన్నారు. ముస్లిం మహిళలకు న్యాయం చేయాలని అన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ సమ ర్థించిందని, చర్చలో పాల్గొన్నదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి విజయ్‌గోయల్ అన్నారు. ముస్లిం మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై చట్టం చేయాలని సుప్రీంకోర్టు సైతం కోరిందన్నారు. సెలెక్ట్ కమిటీ పేరుతో కాలాయాపన చేసేందుకు కాంగ్రెస్ పార్టీ చేసేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ఓ వైపు బిల్లు పాస్‌చేయిస్తామనే అంటూనే సెలెక్ట్ కమిటీకి పంపడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమన్నారు. ముస్లిం మహిళలక న్యాయం జరగకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డుపడుతోందని ఆరోపించారు. మహిళలకు సమానత్వం ఇవ్వకుండా రాజకీయాలు చేస్తోందన్నారు. ఈ బిల్లుపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.అధికార, విపక్షాల మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలతో రాజ్యసభ దద్దరిల్లింది. దీనికి తోడు సభ పోడియం వద్ద అన్నాడిఎంకె ఎంపీలు నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలకు అడ్డుపడ్డారు. ఈ నేపథ్యంలో సభాకార్యక్రమాలను సాధ్యం కావడం లేదని సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌నారాయణ్ ప్రకటించారు. ఇటు లోక్‌సభలోనూ విపక్షాల ఆందోళన మధ్య ప్రశ్నోత్తరాల కార్యక్రమం, జీరో అవర్‌ను కొంతసేపు కొనసాగించారు. అనంతరం మధ్యాహ్నం సమావేశమైన సభ పద్దులపై చర్చను చేపట్టింది. మోడీ ప్రభుత్వంలో గ్రామాలన్నింటికి రోడ్లు వేశామని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. ఆయుష్మాన్ భారత్‌తో పేదలకు వైద్యసహాయం అందజేస్తు న్నామన్నారు. చౌక ధరల కు వంటగ్యాస్‌ను పేదలకు ఇస్తున్నా మని వివరిం చారు. యూపీఏ హయాంలో మొండి బాకీలకు లక్షల కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. అయితే రాఫెల్‌పై కూడా చర్చ జరపాలని ప్రతిపక్ష నేత మల్లికార్జునఖర్గే డిమాండ్ చేశారు. అనంతరం ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సవరణ బిల్లుపై చర్చను ప్రారంభించగా సభలో మరింత గందరగోళం చెలరేగింది. దాంతో సభా కార్యక్రమాలు బుధవారానికి వాయిదా పడ్డాయి.

అందరికీ ఒకే చట్టం ఉండాలి: సుజనా

దేశంలో ప్రతి ఒక్కరికి వివాహ చట్టం విషయంలో ఒకే రూల్ ఉండాలనేదే తమ పార్టీ సిద్ధాంతమని టీడీపీపీ నేత సుజనా చౌదరి అన్నారు. దేశంలో ఒక్కో కులానికి ప్రభుత్వం ఒక్కో రూల్ తీసుకొని వస్తోందన్నారు. వివాహచట్టం ప్రతి మతానికి సమానంగా ఉండాలన్నారు. ఈ చట్టంతో ముస్లింల కు అన్యాయం జరుగుతుందన్నారు.

20 రాష్ట్రాలు.. 100 రోజులు



• సార్వత్రిక ఎన్నికలకు బీజేపీ బహుముఖ వ్యూహం • కేడర్‌లో జోష్ నింపేలా మోడీ పర్యటనలు • వీక్‌గా ఉన్న రాష్ట్రాలపై స్పెషల్ ఫోకస్ • గతంలో కోల్పోయిన 123 స్థానాలు చేజిక్కించుకునేలా వ్యూహాలు • ప్రభుత్వ విజయాలే ప్రచారంలో ప్రధాన ఎజెండా

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరోసారి కేంద్రంలో అధికారాన్ని దక్కించుకునేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. ఎన్నికలకు మరో 4 నెలలే మిగిలి ఉండటంతో 100 రోజుల్లో 20 రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటనలు చేయాలని మోడీ ఓ నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.గత ఎన్నికల్లో 282 స్థానాలతో తిరుగులేని విజయాన్ని నమోదు చేసిన బీజేపీ.. వచ్చేలోక్‌సభ ఎన్నికల్లో అంతకు మించిన అఖండ విజయాన్ని నమోదు చేయాలని కృత నిశ్చయంతో ఉంది. అయితే బీజేపీ పెట్టన కోటలా ఉంటే మధ్యప్రదేశ్, రాజస్థాన్,చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సహా దక్షిణాదిలోని కర్నాటకలోనూ అధికారాన్ని కోల్పోవడం కొంత ఇబ్బంది కలిగించే విషయమే అయినా.. వీటి ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై ఏ మాత్రం పడకుండా వ్యూహరచన చేస్తోంది. ఇందుకోసం ఆయా రాష్ట్రాల్లో కలిసివచ్చే భాగస్వామ్య పక్షాలను కలుపులని ప్రతిపక్షాలను దెబ్బతీయాలని భావిస్తోంది. దేశంలోని 20 రాష్ట్రాల్లో బీజేపీ శ్రేణులను మరింతగా ఉత్తేజపరిచేలా మోడీ పర్యటనలు ఉపయోగపడతాయని సీనియర్లు చెబుతున్నారు. కేడర్‌లో జోష్ నింపి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచే దిశగా చర్యలు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అభిరుచులకు అనుగుణమైన అంశాలను ప్రచారాంశాలుగా మోడీ పర్యటనలు సాగనున్నట్లు పార్టీ వర్గాలుపేర్కొంటున్నాయి.

వివిధ వర్గాలను ఆకర్షించేలా వ్యూహాలు

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లను తమవైపు తిప్పుకునేలా బీజేపీ వ్యూహాలకు పదునుపెంచింది. మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, యువత ఇలా వివిధ వర్గాలతో మోడీ స్వయంగా సంభాషించడం ద్వారా ఆయా వర్గాలను ఆకట్టుకోనున్నారు. ఇప్పటికే నమో యాప్ ద్వారా వివిధ వర్గాలతో మమేకమౌతున్న మోడీ.. ప్రస్తుత పరిస్థితులు.. సంక్షేమ పథకాల అమలు.. సమస్యలు.. పరిష్కారమార్గాలపై ఆరా తీస్తున్నారు. ఆయా వర్గాలను ఉత్తేజ పరిచేందుకు మహిళా విభాగం, యువ మోర్చా లాంటి వాటిని విస్తృతంగా వాడుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

మిషన్ 123

2019 సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం కోసం బీజేపీ మిషన్ 123 ని అమలు చేస్తోంది. ప్రస్తుతమున్న 282 స్థానాలకు అదనంగా 123 స్థానాలను తమ ఖాతాలో వేసుకోవాలన్నదే బీజేపీ మిషన్ 123. వీటిలో గత సార్వత్రిక ఎన్నికల్లో చేజారిపోయినవే ఎక్కువ కావడంతో మొత్తం 20 రాష్ట్రాల్లోని ఈ 123 స్థానాలను 25 క్లస్టర్లుగా విభజించి మోడీ తన వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, ఒడిశా, అసోం రాష్ట్రాల్లో బీజేపీ బలాన్ని పెంచుకోవాలన్నదే మోడీ అభిమతంగా తెలుస్తోంది. ఈ మూడు రాష్ట్రాల్లో 77 లోక్‌సభ స్థానాలుండగా.. బీజేపీ గతంలో కేవలం 10 ఎంపీ స్థానాల్లోనే గెలిచింది. ఈనేపథ్యంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఈ మూడు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ బీజేపీని బలోపేతం చేయాలని మోడీ నిర్ణయానికివచ్చినట్లు సమాచారం. మిషన్ 123 కార్యాచరణలో భాగంగానే మోడీ.. ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో పర్యటనలు ప్రారంభించారు. ఒడిశా పర్యటన సందర్భంగా డిసెంబర్ 24న ఐఐటీ భువనేశ్వర్‌ను ప్రారంభించిన మోడీ.. ఆ మరుసటి రోజు బ్రహ్మపుత్ర నదిపై (అసోంలో) దేశంలోనే అతిపెద్ద రైల్ కమ్ రోడ్ బ్రిడ్జికి శ్రీకారం చుట్టారు. ఈనెల 4న మరోసారి అసోంలోని సిల్చార్‌లో పర్యటించనున్నారు. ఇలా వరస పర్యటనతో ప్రజల మదిలో బీజేపీకి చెరగని ముద్రవేస్తే సార్వత్రిక ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లోనూ విజయం సులువౌతుందన్నది బీజేపీ హై కమాండ్ అభిమతంగా తెలుస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఒడిశాలోని 21 ఎంపీ స్థానాల్లో 20 స్థానాలను నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజు జనతాదళ్ హస్తగతం చేసుకోగా.. బీజేపీ కేవలం ఒక ఎంపీ స్థానంతో సరిపెట్టుకుంది. అసోంలోని 14 లోక్‌సభ స్థానాలకు ప్రస్తుతం 7 బీజేపీ ఖాతాలో ఉండగా.. మరో నాలుగింటినైనా హస్తగతం చేసుకోవాలని బీజేపీ పావులు కదుపుతోంది. పశ్చిమబెంగాల్‌లో మొత్తం 42 ఎంపీ స్థానాలుండగా.. గత ఎన్నికల్లో కేవలం 2 స్థానాలతో సరిపెట్టుకున్న బీజేపీ ఈసారి కనీసం డబుల్ డిజిట్ కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 5న ఒకసారి 15న రెండోసారి ఒడిశాలో పర్యటించి బీజేపీ శ్రేణులను మోడీ ఉత్తేజం చేయనున్నారు.

ఆ దొంగలకు కాపలాదారు సాయం..



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి ప్రధాని నరేంద్ర మోడీపై విరుచుకుపడ్డారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసి.. దేశం వదిలి పారిపోయే వారికే నరేంద్ర మోడీ కాపాలాదారు అని రాహుల్ విమర్శించారు. మోడీ తనను తాను దేశానికి కాపలాదారుగా చెప్పుకుంటూ దొంగలా పని చేస్తున్నారు. తన బెస్ట్ ఫ్రెండ్స్ కోసం మోడీ రూ.41,167 కోట్ల బ్యాంకు సొమ్మును ఇచ్చారు 41వేల167 కోట్ల రూపాయలను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఒక ఏడాది పాటు వినియోగించొచ్చు. ఈ సొమ్ముతో కేంద్ర ప్రభుత్వం మూడు రాష్ట్రాల్లోని రైతుల రుణాలను రద్దు చేయగలిగేది. 40 ఎయిమ్స్ వైద్య సంస్థలను ఏర్పాటు చేయగలిగేది. అని రాహుల్ ట్వీట్ చేశారు.

మీరడగవలసింది ఈ ప్రశ్న..



న్యూఢిల్లీ: సోహ్రాబుద్దీన్ ఎన్ కౌంటర్ కేసు లో రాహుల్ వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ కౌంటర్ ఇచ్చారు. రాహుల్ జీ మీరు అడగవల సిన ప్రశ్న ఇది కాదు.. సోహ్రాబుద్దీన్ కేసు దర్యాప్తును ఎవరు ధ్వంసం చేశారు అని అడగాలి.. అప్పుడు సరైన సమాధానం వచ్చేది. దర్యాప్తు సంస్థల విచారణల గురించి మాట్లాడుతున్న వారు తాము అధికా రంలో ఉన్నప్పుడు సీబీఐ లాంటి సంస్థలను ఎలా వాడుకున్నారో గుర్తు చేసుకోవాలని జైట్లీ చురకలంటించారు.

ఏపీ చేజారిన యుద్ధ నౌక

విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి సీతారామన్ జవాబు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: నౌకా దళం సేవల నుంచి ఉపసంహరించిన విమాన వాహక యుద్ధ నౌక ఐఎన్ఎస్ విరాట్ ఆంధ్ర ప్రదేశ్ చేజారి పోయింది. విరాట్‌ను తమ రాష్ట్రానికి అప్పగించాల్సింది గా మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనకు సూత్రప్రా యంగా ఆమోదం తెలిపినట్లు రక్షణ శాఖ మంత్రి నిర్మల సీతారామన్ సోమవారం రాజ్యసభలో తెలిపారు.. 850 కోట్ల రూపాయలు వెచ్చించి ఐఎన్ఎస్ విరాట్‌ను హెటల్ కమ్ మ్యూజియంగా మార్చడానికి ఆసక్తి కనబరుస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం రక్షణ మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపిన విషయం వాస్తవమేనా? అదే నిజమైన ఆ ప్రతిపాదనకు సంపాదించిన వివరాలు ఏమిటి? అని రాజ్య సభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు రక్షణ మంత్రి సీతారామన్ రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం వెల్లడించారు.ఐఎన్ఎస్ విరాట్‌ను విశాఖపట్నం వద్ద అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ కమ్ హోటల్‌గా మార్చేందుకు ముందుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి అప్పగించాలని రక్షణ మంత్రిత్వ శాఖ అంగీకరించింది వాస్తవం కాదా అన్న మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ ఆ మేరకు తమ మంత్రిత్వ శాఖ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. డీ కమిషన్ చేసిన విమాన వాహక యుద్ధనౌక విరాట్‌ను హోటల్ కమ్ మ్యూజియంగా మార్చడానికి మహారాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించగా రక్షణ మంత్రిత్వ శాఖ అందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని మంత్రి తన జవాబులో పునరుద్ఘాటించారు.

విశాఖ-రాజమండ్రి మధ్య టోల్ వసూళ్లు రూ.1,775 కోట్లు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: విశాఖపట్నం - రాజమండ్రి మధ్య జాతీయ రహదారిపై ఉన్న మూడు ప్రధాన టోల్ గేట్ల నుంచి ఇప్పటి వరకు రూ. 1775 కోట్లు టోల్ వసూలు చేసినట్లు ఉపరితల రవాణా శాఖ సహాయ మంత్రి మన్సుఖ్ మాండవీయ సోమవారం రాజ్య సభకు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ విషయం వెల్లడించారు. విశాఖపట్నం - రాజమండ్రి మధ్య జాతీయ రహదారిపై అగనంపూడి, వేంపాడు, కృష్ణవరం వద్ద మూడు టోల్ గేట్లు ఉన్నట్లు మంత్రి తెలిపారు. అగనంపూడి టోల్ గేట్లో జులై 1998 నుంచి 25 డిసెంబర్ 2018 నాటికి 286.25 కోట్ల రూపాయలు, వేంపాడు టోల్ గేట్లో మే 2005 నుంచి 25 డిసెంబర్ 2018 నాటికి 844.99 కోట్ల రూపాయలు, కృష్ణవరం టోల్‌గేట్లో మే 2005 నుంచి 25 డిసెంబర్ 2018 నాటికి




644.23 కోట్ల రూపాయలు టోల్ ఫీజు కింద వసూలు చేసినట్లు మంత్రి వివరించారు. ఈ మూడు టోల్ బూత్‌ల టోల్ వసూలు సమయంలో జరుగుతున్న సుదీర్ఘ జాప్యం వలన వాహనదారులు, ప్రజలు తీవ్ర అగచాట్లకు గురవుతున్న విషయం వాస్తవం కాదా అన్న ప్రశ్నకు మంత్రి లేదని జవాబిచ్చారు. ప్రత్యేక సందర్భాలలో ట్రాఫిక్ పెరిగితే అదనపు సిబ్బందిని పెట్టుకుని టోల్ వసూలు సాఫీగా సాగిపోయేలా చూడవలసిన బాధ్యత ఒప్పందం ప్రకారం టోల్ ఏజెన్సీదేనని అన్నారు. యాజమాన్య హక్కుల బదిలీ ఒప్పందం (టీవోటీ) కింద వేంపాడు, కృష్ణవరం టోల్ ప్లాజాల దగ్గర లేన్ల సంఖ్యను 14, అదనంగా మరో రెండు లైన్లు విస్తరించుకునే సౌలభ్యం ఉన్నట్లు మంత్రి తెలిపారు. యూజర్ ఫీ నిబంధనల ప్రకారమే వాహనదారుల నుంచి ఫీజు వసూలు చేయడం జరుగుతుందన్నారు. టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ జాప్యం లేకుండా సాఫీగా ముందుకు సాగిపోయేందుకు హైబ్రీడ్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ (ఈటీసీ) వ్యవస్థను ప్రవేశ పెట్టడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

'కన్నుల పండువగా గోదా కల్యాణం'



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కన్నులపండువగా సాగిన గోదా రంగనాథ స్వామి కల్యాణ నృత్య రూపకాన్ని చూసి దేశ రాజధాని ఢిల్లీవాసులు పులకించిపోయారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఏపీ భవన్ లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఢిల్లీ తెలుగు అకాడమీ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స జనాత్మక సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కళారత్న డాక్టర్ కెవి సత్యనారాయణ బృందము ''గోదా కల్యాణం'' కూచిపూడి నృత్య రూపకానికి కళాప్రియులు కరతాళ ధ్వనులు చేశారు. కళారత్న డాక్టర్ కెవి సత్యనారాయణ శిష్య బృందం అమెరికా సంయుక్త రాష్ట్రాల నుండి విచ్చేసిన శ్రీయ లాలిత, శ్రీల హైందవి, శ్రీద వరాళి, ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన కూచిపూడి నాట్య కళాకారులచే''గోదా కళ్యాణం'' కూచిపూడి నృత్య రూపకం అద్భుతంగా ప్రదర్శించింది . ఢిల్లీ తెలుగు అకాడమీ తరపున డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కళారత్న డాక్టర్ కేవీ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని కళాకారులను, ప్రదర్శనను ఘనంగా సన్మానించారు. ధనుర్మాసం, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చక్కటి ప్రదర్శన ఇచ్చిన కళాకారులను అభినందించారు. డాక్టర్ రాళ్లబండి కవితా ప్రసాద్, డాక్టర్ డి విజయభాస్కర్, డా. కేవీ సత్యనారాయణ రచించిన గోదాదేవి శ్రీ రంగనాథుల కల్యాణ ఘట్టాన్ని ఈ రూపకంలో ప్రదర్శించారు.

మధ్యవర్తులు ఫ్యామిలీ బామ్ కావాలంటున్నారు



న్యూఢిల్లీ: అగస్టా వెస్ట్‌లాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల స్కామ్ మధ్యవర్తి క్రిస్టియన్ మైఖేల్ వెల్లడించిన వివరాలపై బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా స్పందించారు. మధ్యవర్తులందరూ ఫ్యామిలీ బామ్ కావాలంటున్నారని కాంగ్రెస్‌ను పరోక్షం గా ఎద్దేవా చేశారు. వ్యంగ్యంగా వరుస ట్వీట్లతో విమర్శల వర్షం కురిపించారు. మైఖేల్‌కు భారత్ లోని ఓ కుటుంబానికి మధ్య స్నేహబంధం వివ రించాలని మైఖేల్ తరఫు న్యాయవాదికి అమిత్ షా సోమవారం ట్వీట్ చేశారు. అగస్టా వెస్ట్‌లాండ్ కేసులో మధ్యవర్తి క్రిస్టియన్ మైఖేల్ తన న్యాయవాదికి శ్రీమతి గాంధీపై ప్రశ్నిస్తున్న వివరాలను ఎందుకు ఇచ్చారో ఎవరికైనా తెలుసా? అమిత్ షా ట్వీట్‌లో ప్రశ్నించారు. మరో ట్వీట్‌లో ఆ కాగితం తనకు అందిందని మైఖేల్ న్యాయవాది అంగీకరించారు. అది మందుల జాబితా అని ఆయన అనుకున్నారు. జండుబామ్, టైగర్‌బామ్ గురించి మనం విన్నాం..కానీ మధ్యవర్తి మైఖేల్ కోరుకుంటున్న ఫ్యామిలీ బామ్ ఏమిటో అని పేర్కొన్నారు. మూడో ట్వీట్‌లో మైఖేల్ న్యాయవాదికి కాంగ్రెస్ నేపథ్యంగురించి చెప్పాలి. ఆయన మైఖేల్‌కు, శ్రీమతి గాంధీకి వారధిగా కొనసాగుతున్నారని ట్వీట్ చేశారు. నాలుగో ట్వీట్‌లో దేశ ప్రయోజనాల కోసం 2008నాటి డాక్యుమెంట్లు గురించి మైఖేల్ న్యాయవాది మనకు చెప్పాలి. స్పష్టంగా తెలిసింది ఏమిటంటే మైఖేల్‌కు భారత్‌లోని ఓ కుటుంబానికి మధ్యస్నేహం కాలపరీక్షలో నిలిచిందని పేర్కొన్నారు. కాగా క్రిస్టియన్ మైఖేల్ తరఫున వాదిస్తున్న న్యాయవాది అల్జో కే జోసఫ్ గతంలో యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. మైఖేల్ తరఫున వాదనలు వినిపించేందుకు జోసఫ్ నియమితులయ్యారు. ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో ఆయనను కాంగ్రెస్ నుంచి బహిష్కరించారు.

ఏపీఎస్ ఆర్టీసీలో సమ్మె సైరన్?

• 18 డిమాండ్లతో ఎండీకి ఈయూ సమ్మె నోటీస్ • 13 తర్వాత ఏ క్షణమైనా సమ్మె బాట



అమరావతి, ఆంధ్రప్రభ: ముందుగా హెచ్చరించినట్లే ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేతలు సోమవారం ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబును, చైర్మన్ వర్ల రామయ్యను, లేబర్ కమిషనర్‌ను కలిసి, సమస్యల పరిష్కారానికి సమ్మె నోటీస్ అందజేశారు. వేతన సవరణ ప్రధాన డిమాండ్‌గా మొత్తం 18 అంశాలతో సమ్మె నోటీస్ అందజేశారు. 21 నెలలుగా పెండింగ్‌లో ఉన్న 14వేతన సవరణ ప్రధాన డిమాండ్‌తో పాటు సర్వీస్ కండీషన్స్ అమలు,అలవెన్సులు 100 శాతం పెంపుదల, విద్యా, వైద్య రంగాల వలె ఆర్టీసీని ఆదుకోవడం, పెండింగ్ కారుణ్య నియామకాల సమస్య, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులైజేషన్, సిబ్బంది కుదింపు, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, గ్యారేజీల్లో షెడ్యూల్-1 పునరుద్ధరణ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపులు, మెరుగైన పెన్షన్ సౌకర్యం, అర్హులందరికీ ప్రమోషన్లు, అక్రమ రవాణ అరికట్టడం, కార్గో సర్వీసుల బలోపేతం, ఔట్ సోర్సింగ్ రద్దు, డబుల్ డ్యూటీలు చేసే వారికి డబల్ వేతనం, సర్వీసులోని ఉద్యోగులకు ఉచిత రవాణ సౌకర్యం, ఇళ్ల స్థలాల కేటాయింపు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సమ్మె నోటీసులు అందజేశారు.

ఎప్పుడైనా సమ్మెకు దిగుతాం

ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.రావు,ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు ఈ సందర్భంగా బస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రధానంగా వేతనాల సవరణ సమస్యను సత్వరమే పరిష్కరించపోతే జనవరి 13 తర్వాత ఏ క్షణమైన ఆకస్మిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. ఈనెల 4వ తేదీన బస్ భవన్‌లోని ఈయూ రాష్ట్ర కార్యాలయంలో జరిగే కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో భవిష్యత్ పోరాట కార్యాచరణ, జేఏసీ ఏర్పాటును ఖరారు చేస్తామని చెప్పారు. ప్రతి నాలుగేళ్లకొకసారి జరగాల్సిన వేతన సవరణ 21 నెలలైనా అతీగతీ లేకుండాపోయిందని అన్నారు. గత గుర్తింపు సంఘం ఎన్.ఎం.యు హయాంలో వేతన సవరణ జరగాల్సి ఉండగా, యాజమాన్యం నష్టాలను సాకుగా చూపించి, 19 శాతం ఇంటీరియం రిలీఫ్‌తో సరిపెట్టిందన్నారు. డిమాండ్స్‌పై ఇప్పటి వరకు 5 సార్లు చర్చలు జరిపినా ఉద్యోగులు కోరుకుంటున్న 50 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేసేందుకు యాజమాన్యం తోసిపుచ్చిందన్నారు. సర్వీసు కండీషన్లు,100 శాతం అలవెన్సులు పెంపుపై స్పష్టమైన హామి రాని కారణంగా సోమవారం సంస్థ వీసీ, ఎండీతో పాటు లేబర్ కమిషనర్‌కు, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఆర్ అండ్‌బి)కి కూడా సమ్మె నోటీసులు ఇచ్చామన్నారు. తామిచ్చిన సమ్మె నోటీసులోని డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించపోతే 14 రోజుల తర్వాత, 41 రోజుల్లోపు సమ్మె చేసే అధికారం ఉన్నందున ఈనెల 13 తర్వాత ఏక్షణమైనా సమ్మెకు దిగుతామని దామోదరరావు స్పష్టంచేశారు. గుర్తింపు సంఘంగా తాము చేస్తున్న ఈ పోరాటానికి ఆర్టీసీలోని అన్ని కార్మికసంఘాలు మద్దతు పలికాయని, ఎన్ఎంయు మాత్రం ఈనెల 3న జరిగే యూనియన్ సమావేశంలో చర్చించి, స్పందిస్తామని చెప్పారని అన్నారు. ఈనెల 4న ఈయూ రాష్ట్ర కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో కలసివచ్చే అన్ని కార్మిక సంఘాలతో చర్చించి, సమ్మె సన్నాహక కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు. ఎండీని కలసిన వారిలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు రాష్ట్ర నాయకులు ఎం.హనుమంత రావు, జి.వి.నరసయ్య, ఎ.వి.రామ చంద్ర రావు, ఎం.శంకర్‌రావు, ఎం.డి.ప్రసాద్, ఎం.కోటేశ్వరరావు, టి.వి.భవాని, ఎస్.కె.సుభాని, పి.రామకృష్ణకృష్ణా రీజియన్ నాయకులు ఎన్‌హెచ్‌ఎన్. చక్రవర్తి, వై.శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రభుత్వంతో చర్చిస్తాం: వరహాలనాయుడు

వేతన సవరణ, ఇతర డిమాండ్లు ఎబబేనని, అయితే బాధ్యత గల యూనియన్‌గా తాము ముందుగా ఈ విషయమై ఏపీ సీఎంతోను, రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో చర్చి స్తామని తెలుగుదేశం పార్టీ అనుబంధ కార్మిక పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వరహాల నాయుడు విలేకరులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నా మన్నారు. కార్మికులకు మెరుగైన వేతన సవరణ జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకుని,సమ్మెను నివారిస్తుందని భావిస్తున్నామని ఆయన చెప్పారు. కాగా తమ సంఘం ఆధ్వర్యంలో కూడా ఈనెల 3 వతేదీన 'డిమాండ్స్ డే'ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఆర్టీసీ సిబ్బందికి బీమా

ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల బీమా పథకం అమలుకు సంబంధించి యాజమాన్యం అన్ని లాంచనాలను పూర్తి చేసింది. నేటి నుంచి ఈ పథకాన్ని ఆర్టీసీ అమలు చేనున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ఆర్టీసీ వీసీ, ఎండీ సురేంద్రబాబు సోమవారం డిహెచ్ఎఫ్ఎల్ ప్రమెరికా లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో భేటీ అయి, విధి విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగుల ప్రీమీయానికి సంబంధించి రూ. 8.5 కోట్ల చెక్కును బీమా కంపెనీ ప్రతినిధులకు అందజేశారు. ఆర్టీసీ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా ఈ బీమా పథకాన్ని అమలు చేయనున్నారు. సంస్థలో పని చేస్తూ, సొసైటీలో సభ్యుని ఉంటూ సహజంగా మరణిస్తే బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల బీమా సొమ్మును చెల్లిస్తారు. క్రెడిట్ సొసైటీలో 52 వేల మంది ఉద్యోగులు సభ్యులుగా ఉన్నారు. వీరందరికీ ఈ భీమా పథకం వర్తిస్తుంది. ఒక్కోసభ్యునికి రూ. 1,641 చొప్పున (ఏడాదికి) మొత్తం రూ.8.5 కోట్లను బీమా కంపెనీకి వీసీ,ఎండీ అందజేశారు. బీమా కంపెనీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ పథకం నేటి నుంచి ఏడాది పాటు అమలులో ఉంటుంది. గడువు మీరిన తర్వాత రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన విధి విధానాలను త్వరలో సొసైటీ సభ్యులకు తెలియజేయనున్నారు.

క్రీడాప్రభ



పాపకు జన్మనిచ్చిన రితికా సజ్దే

రోహిత్ ఇంట బుల్లి క్రికెటర్!

న్యూఢిల్లీ : టీమిండియా హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ తండ్రయ్యాడు. అతని భార్య రితికా సజ్దే ముంబైలో ఆదివారం పండంటి పాపకు జన్మనిచ్చింది. రోహిత్ ప్రస్తుతం ఆస్ట్రేలియా టూర్‌లో ఉన్నాడు. నాల్గో టెస్టు ఆడకుండా మెల్‌బోర్న్ నుంచి రోహిత్ శర్మ ఇండియాకు తిరిగిరానున్నాడు. జనవరి 12 నుంచి ప్రారంభమయ్యే వన్డేలకు మళ్లీ 8న ఆసీస్‌కు వెళ్లనున్నాడు. రోహిత్ శర్మ పాపకు తండ్రి కావడం సంతోషంగా ఉందని, అతని జీవితంలో కొత్త శకం ప్రారంభమైందని ఈ సందర్భంగా బీసీసీఐ అభినందనలు తెలిపింది. రోహిత్ తండ్రి అయ్యాడన్న విషయాన్ని రితిక బంధువు, సోహైల్ ఖాన్ భార్య సీమాఖాన్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించింది. తన కూతురును చూసేందుకు రోహిత్ ఆస్ట్రేలియా నుంచి ఇండియాకు తిరుగు పయనం అయ్యాడు. సిడ్నీలో జరిగే నాల్గో టెస్టుకు రోహిత్ దూరం కానున్నాడు. రోహిత్ తన స్నేహితురాలు, మేనేజర్ రితికాను 2015 డిసెంబర్ 13న పెళ్లి చేసుకున్నాడు. తాను తండ్రి కాబోతున్నాడన్న వార్తను ఆసీస్ మాజీ కెప్టెన్ మైఖెల్ క్లార్క్‌తో మొదటి సారిగా వెల్లడించాడు.

హర్మన్ భళా..!



ఐసీసీ వరల్డ్ టీ20 ఉమెన్స్ జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా ఎంపికైంది. ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ స్మృతి మందానా, లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ కూడా సభ్యులుగా ఉండనున్నారు. ఈ ఏడాదికిగాను అత్యుత్తమ మహిళా క్రికెట్ జట్లను ఐసీసీ ఎంపిక చేయగా, అందులో టీ20 విభాగంలో హర్మన్ ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా సెలెక్ట్ అయ్యింది. సోమవారం అత్యుత్తమ వన్డే, టీ20 జట్లను ఐసీసీ ప్రకటించింది. వన్డేల్లో మందానా, పూనమ్‌కు చోటు మాత్రమే దక్కింది. కెప్టెన్‌గా మాత్రం న్యూజిలాండ్ క్రికెటర్ సుజీ బేట్స్ ఎంపికైంది.

ఐసీసీ ఉమెన్స్ వరల్డ్ టీ 20 సారథిగా కౌర్

- వన్డే జట్టు కెప్టెన్‌గా కివీస్ క్రీడాకారిణి సుజీ బేట్స్
- రెండు ఫార్మాట్‌లలో మందానా, పూనమ్‌కు చోటు

మీడియా బ్రాడ్‌కాస్ట్ ప్రకటన

- ఐసీసీ టీ 20 వరల్డ్ కప్‌లో కౌర్ కీలక పాత్ర

దుబాయ్ : 2018లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రికెటర్‌లతో ఓటింగ్ ద్వారా జట్లను మీడియా-బ్రాడ్‌కాస్టర్స్ సభ్యులు ఎంపిక చేస్తారు. నవంబర్‌లో వెస్టిండీస్‌లో జరిగిన ఐసీసీ ఉమెన్స్ వరల్డ్ టీ20 కప్‌లో హర్మన్‌ప్రీత్ జట్టును సెమీ ఫైనల్ వరకు తీసుకెళ్లింది. ఈ టోర్నమెంట్‌లో కౌర్ 160.5 స్ట్రైక్‌రేట్‌తో 183 పరుగులు చేసింది. 2018లో హర్మన్ ప్రీత్ 126.1 స్ట్రైక్‌రేట్ తో 25 టీ20 మ్యాచులు ఆడి 663 పరుగులు చేసింది. ఎంఆర్‌ఎఫ్ టైర్స్ ఐసీసీ ఉమెన్స్ ప్లేయర్స్ ర్యాంకింగ్‌లో కౌర్ మూడో స్థానంలో కొనసాగుతోంది.

టీ20 జట్టులో ఐదు దేశాలు ఆటగాళ్లు ఉంటారు. అందులో నలుగురు ఐసీసీ ఉమెన్స్ వరల్డ్ టీ20 - 2018 ఆస్ట్రేలియా ఛాంపియన్‌లు ఉన్నారు. ఇద్దరు న్యూజిలాండ్, బంగ్లాదేశ్, ఇంగ్లండ్ నుంచి ఒక్కొక్కరు, భారత్ నుంచి ముగ్గురు ఉన్నారు. ఐసీసీ జట్టులో బంగ్లాదేశ్ నుంచి రుమానా అహ్మద్ మొట్ట మొదటి సారిగా ఎంపికైంది. వన్డే జట్టులో ఏడు దేశాల నుంచి క్రీడాకారులు ఉంటారు. ఇంగ్లండ్, ఇండియా, న్యూజి లాండ్, దక్షిణాఫ్రికా నుంచి ఇద్దరు చొప్పున ఎంపికయ్యారు. ఆస్ట్రేలియా, పాకిస్థాన్, వెస్టిండీస్ నుంచి ఒక్కొక్కరు చొప్పున జట్టులో సభ్యులుగా ఉన్నారు. న్యూజిలాండ్ క్రికెటర్ సుజీ బేట్స్ వన్డే జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్‌షిప్ తరువాత జట్టు ను రెండో స్థానంలో నిల్చోబెట్టడటంలో కీలకపాత్ర పోషించింది. 2018 క్యాలెండర్ ఇయర్‌లో 7 వన్డేలు ఆడింది. 438 పరుగులు చేసింది. ఇందులో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉన్నాయి. ఎంఆర్‌ఎఫ్ టైర్స్ ఐసీసీ ఉమెన్స్ ప్లేయర్స్ వన్డే విభాగంలో బేట్స్ ఏడో స్థానంలో ఉంది. ఇండియా నుంచి మందానా, యాదవ్, ఆస్ట్రేలియా హీల, న్యూజిలాండ్ నుంచి సుజీ బేట్స్ వన్డే, టీ20 జట్టుల్లో స్థానం సంపాధించుకున్నారు.

ఐసీసీ మహిళా టీ20 జట్టు (బ్యాటింగ్ ఆర్డర్) : హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్, భారత్), స్మృతీ మందానా (భారత్), అలైస్సా హేలీ (ఆస్ట్రేలియా, వికెట్ కీపర్), సుజీ బేట్స్ (న్యూజిలాండ్), నాటేటీ స్కీవర్ (ఇంగ్లండ్), ఎలైసె పెర్రీ (ఆస్ట్రేలియా), ఆష్లే గార్డనర్ (ఆస్ట్రేలియా), కాస్పెర్క్ (న్యూజిలాండ్), మెగాన్ స్కట్ (ఆస్ట్రేలియా), రుమానా అహ్మద్ (బంగ్లాదేశ్), పూనమ్ యాదవ్ (భారత్). **ఐసీసీ మహిళా వన్డే జట్టు (బ్యాటింగ్ ఆర్డర్):** సుజీ బేట్స్ (కెప్టెన్, న్యూ జిలాండ్), స్మృతి మందానా, టామీ బీమౌంట్ (ఇంగ్లండ్), డేన్‌వాన్ నీకెర్క్ (దక్షిణా ఫ్రికా), సోఫీ డివైన్ (న్యూజిలాండ్), హేలీ (వికెట్ కీపర్, ఆస్ట్రేలియా), మారింజన్నే (దక్షిణాఫ్రికా), డాటిన్ (వెస్టిండీస్), సానా మిర్ (పాకిస్థాన్), సోఫీ ఎక్లెస్టోన్ (ఇంగ్లండ్), పూనమ్ యాదవ్ (భారత్).

ఆశ్చర్యం వేసింది

వరల్డ్ టీ20 ఎలెవెన్ జట్టుకు కెప్టెన్‌గా నా పేరు ఖరారు కావడంతో ఎంతో ఆనందం వేసింది. నిజం చెప్పాలంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. గత రెండేళ్ల కాలం నుంచి అనుకున్నన్ని టీ20 మ్యాచులు ఆడలేదు. జట్టులో ఆత్మవిశ్వాసం కల్పించడం అనేది ఎంతో టఫ్‌గా భావిస్తున్నాను. టీ20లో మెరుగైన ఆటను కనబరుస్తాననే నమ్మకం నాలో ఉంది. కెప్టెన్‌గా ఎంపికవ్వడం వెనుక జట్టు సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉంది. వారంతా కష్టపడితే నేను ఈ స్థాయికి చేరుకోగలిగానడంలో సందేహం లేదు. ఈ గౌరవంతో నాలో ఎంతో ఆత్మవిశ్వాసం పెరిగిందని భావిస్తున్నాను. బీసీసీఐ కూడా నాపై ఎంతో నమ్మకం పెట్టుకుంది. బీసీసీఐ ఆశలు, ఆశయాలకనుగుణంగా ముందుకు వెళ్తాను. భవిష్యత్తులో మరింత మెరుగైన ఆటను ప్రదర్శిస్తాను.

మందానా ఐసీసీ 'ఉమెన్స్ క్రికెటర్'

ఏడాదిలో రెండు అవార్డులు



న్యూఢిల్లీ : భారత్ మహిళా జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మందానాకు అరుదైన గౌరవం దక్కింది. వన్డేప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో పాటు ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని సొంతం చేసుకుంది. లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ మందానా 2018లో 12 వన్డేలు ఆడి 669 పరుగులు చేసింది. 25 టీ20 మ్యాచుల్లో 622 పరుగులు చేసింది. ఓవరాల్‌గా 1291 పరుగులు చేసింది. ఒక క్యాలెండర్ ఇయర్‌లో రెండు ఐసీసీ అవార్డులు దక్కించుకున్న భారత మహిళా క్రికెటర్‌గా అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఐసీసీ అవార్డు దక్కించుకున్న రెండో మహిళగా నిలిచింది. బౌలర్ జులన్ గోస్వామి 2007లో ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. ఐదు మ్యాచులు ఆడి 124.35 స్ట్రైక్ రేట్‌తో 178 పరుగులు చేసింది. 2018లో వన్డేల్లో 66.90, టీ20లో 130.67 స్ట్రైక్ రేట్‌తో దూసుకెళ్లింది. ఐసీసీ వన్డే ర్యాంకింగ్‌లో ప్రస్తుతం మందానా 10వ స్థానంలో కొనసాగుతోంది. రెండు అవార్డులు దక్కించుకోవడంపై ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ రిచర్డ్‌సన్ అభినందనలు తెలిపారు.

ఎంతో సంతోషంగా ఉంది : మందానా

ఈ సందర్భంగా మందానా మాట్లాడుతూ.. రెండు అవార్డులు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దక్షిణాఫ్రికాలో చేసిన సెంచరీని ఇప్పటికీ మరిచిపోలేనని, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో ఎంతో అద్భుతంగా రాణించానని తెలిపారు. భారత్‌లో ఎక్కువ స్కోరు చేయడం లేదని విమర్శ తనపై ఉందని, దీన్ని అధిగమించడానికి శాయ శక్తులా కృషి చేస్తానని వివరించింది.

అలైస్సాకు 'టీ20 ప్లేయర్ ఆఫ్‌ది ఇయర్'

ఐసీసీ ఉమెన్స్ టీ20 ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ఆస్ట్రేలియా ఓపెనర్, వికెట్ కీపర్ అలైస్సా హేలీకి దక్కింది. వెస్టిండీస్‌లో ఆడిన ఆరు మ్యాచుల్లో 225 పరుగులు చేసింది. ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ఇంగ్లండ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్‌కు దక్కింది. 9 వన్డేల్లో 18, 14 టీ20ల్లో 17 వికెట్లు తీసుకుంది.



కంగ్రాట్స్ సింధు..

బీడబ్ల్యూఎఫ్ టోర్నీలో జపాన్ క్రీడాకారిణి నోజోమీని ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకున్న పీవీ సింధును కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన రాసిన లేఖను ఆ పార్టీ టీపీసీసీ రీసెర్చ్ సెక్రెటరీ అమీర్ జావీద్ పీవీ సింధుకు అందజేశారు. మరిన్ని విజయాలను సాధించాలంటూ ఆమెను లేఖలో అభినందించారు. ఫోన్‌లో ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు.



నెంబర్ 1గానే 2019లోకి

135 రోజులుగా టెస్టుల్లో విరాట్ అగ్రస్థానం

38,67వ ర్యాంకుల్లో పంత్, మయాంక్

న్యూఢిల్లీ : ఐసీసీ ప్రకటించిన ర్యాంకుల్లో టెస్టు బ్యాటింగ్ ర్యాంకుల్లో విరాట్ కోహ్లీ అగ్రస్థానంలోనే నిలిచాడు. 2018 ఏడాదిని నెంబర్ వన్ స్థానంతో ఘనంగా ముగించాడు. ఏడాదంతా పరుగుల వరద పారించాడు. బౌలింగ్‌లో రబడా కూడా అదే ఆధిపత్యాన్ని కొనసాగించాడు. మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో విలువైన 82 పరుగులు చేసినా అతడి ఖాతాలో మూడు రేటింగ్ పాయింట్లు తగ్గాయి. అయినప్పటికీ రెండో ర్యాంక్‌లోని కేన్ విలియమ్స్ (న్యూజిలాండ్) కన్నా 34 రేటింగ్ పాయింట్లు ఎక్కువగానే ఉండటం గమనార్హం. 135 రోజులుగా విరాట్ నెంబర్ వన్ స్థానంలో కొనసాగడం విశేషం. ఏడాది కాలంలో విరాట్ 1322 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో దక్షిణాఫ్రికా క్రీడాకారుడు రబడా మొదటి స్థానంలో ఉన్నాడు. 178 రోజులుగా రబాడ మొదటి స్థానంలో ఉన్నాడు. 10 టెస్టులు ఆడి 52 వికెట్లు తీశాడు. మెల్‌బోర్న్‌లో 9/86తో కెరీర్ అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసిన బుమ్రా 28వ స్థానం నుంచి 12వ స్థానానికి వచ్చాడు. షమీ 23వ ర్యాంకులో ఉన్నాడు. కమిన్స్ ఐదు స్థానాలు మెరుగుపడి మూడో స్థానంలో, జడేజా 6వ స్థానంలో, అశ్విన్ 8వ స్థానంలో ఉన్నారు. ఇక టీమిండియా ఓపెనర్ ఛటేశ్వర్ పుజారా నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. పంత్ 10 స్థానాలు పైకి ఎగబాకి 38వ స్థానంలో ఉన్నాడు. మెల్‌బోర్న్‌లో అరంగేట్రం చేసిన మయాంక్ అగర్వాల్ 76, 42 పరుగులు చేసి 67వ స్థానంలో నిల్చున్నాడు.



సెరెనా విలియమ్స్ 2019ను విజయంతో ఆరంభించింది. గ్రీస్ క్రీడాకారులు టిస్టిపాస్, మారియా సక్కరీతో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ పోరులో సెరానా వీలియమ్స్, ఫ్రాన్సెస్ టియాఫో జోడి విజయం సాధించింది. 44 నిమిషాల పాటు సాగిన ఆటలో 7-6 (7/3), 6-2 తేడాతో గ్రీస్ జంటపై విజయం సాధించింది.

ఇలా ఉంటే బాగుంటుంది...

నాల్గో టెస్టు జట్టుపై స్టీవ్‌వా, పాంటింగ్ వ్యాఖ్యలు



మెల్‌బోర్న్ : సిడ్నీ వేదికగా గురువారం నుంచి ప్రారంభమయ్యే నాల్గో టెస్టులో ఆసీస్ ఓపెనర్ ఆరోన్ ఫించ్ ఆడటం లేదని ఆసీస్ మాజీ కెప్టెన్లు స్టీవ్‌వా, రికీ పాంటింగ్‌లు ప్రకటించారు. లెగ్ స్పిన్నర్, ఆల్‌రౌండర్ మార్నస్ లాబుచాగ్నేకు కూడా జట్టులో అవకాశం కల్పించాలని భావించారు. సిడ్నీ టెస్టులో 11 మంది ఆటగాళ్లు ఎవరు ఉండాలనే జాబితాను టెస్ట్ లెజెండ్ స్టీవాగ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. మార్కస్ హరీస్, షాన్ మార్ష్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఆ తరువాత ఉస్మాన్ ఖాజా వస్తే మెరుగైన ఇన్నింగ్‌ను కొనసాగించొచ్చని వాగ్ భావిస్తున్నాడు. ట్రావిస్ హెడ్ నాల్గో స్థానంలో వస్తే బాగుంటుందని చెప్పుకొచ్చాడు. బౌలింగ్ విభాగంలో మకమిన్స్, మిచెల్ స్టార్క్, నాథన్ లయన్, జోష్ హాజల్‌వుడ్‌ను ఎంపిక చేశాడు. పెర్త్ ఇన్నింగ్‌లో కూడా ఫించ్ ఆటతీరు బాగాలేకపోవడంతోనే పక్కనపెట్టాలని భావిస్తున్నట్టు తన ఇన్‌స్టాగ్రామ్‌లో స్టీవా పోస్టు చేశారు.

నాల్గోటెస్టు.. ముగ్గురికి విశ్రాంతి

వారు వరల్డ్‌కప్‌కు కీలకం : ఆసీస్

మెల్‌బోర్న్ : టెస్టు సిరీస్ ముగిసిన తరువాత ఆసీస్-టీమిండియా మధ్య వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆసీస్ ఫాస్ట్ బౌలర్లు ప్యాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, హాజల్‌వుడ్‌కు మొదటి 3 వన్డేల్లో విశ్రాంతి కల్పించింది. జనవరి 12 నుంచి వన్డే పోరు మొదలవుతోంది. మున్ముందు బిజీ షెడ్యూల్ కారణంగా వారికి విశ్రాంతి ఇచ్చినట్టు తెలుస్తున్నది. కమిన్స్, మెల్‌బోర్న్‌లో జరిగిన టెస్టులో బ్యాటింగ్, బౌలింగ్‌లో మెరిశాడు. ఈ నిర్ణయం ఆతిథ్య జట్టును తికమక పెట్టడానికే అని ఆసీస్ కోచ్ జస్టిన్ లాంగర్ చెప్పుకొచ్చాడు. 2019లో బిజీ షెడ్యూల్ కారణంగా కొంత మంది ఆటగాళ్లకు విశ్రాంతి ఇస్తున్నట్టు వివరించాడు. వరల్డ్ కప్, యాషెస్ టూర్‌కు వీరు ముగ్గురు ఎంతో కీలకం అని, అందుకే శ్రీలంకతో జరిగే రెండు టెస్టులకు కూడా ఛాన్స్ ఇవ్వలేదన్నారు. ఇది మాకు పరీక్షే అయినా ఉన్న బౌలర్లతో మేనేజ్ చేస్తామని చెప్పుకొచ్చారు.

ఫైనల్లో బెంగళూరు బుల్స్



కోచి : రోహిత్ కుమార్ ఆల్ రౌండర్‌గా రెచ్చిపోవడంతో బెంగళూరు బుల్స్ మొదటి క్వాలిఫై రౌండ్‌లో విజయం సాధించింది. సోమవారం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో గుజరాత్ ఫార్చ్యూన్‌గెట్స్‌ను 41-29 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్ గెలుపొందింది. పవన్ షెరావత్ ఆట ముందు నుంచే దూకుడు ప్రదర్శించాడు. 13 రైడ్ పాయింట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. రోహిత్ కుమార్ 11 పాయింట్లు సాధించిపెట్టాడు. గుజరాత్ తరపున సచిన్ 10 పాయింట్లు సాధించగా, ప్రపంజన్ 5 రైడ్ పాయింట్లు చేశాడు. ఇక బెంగళూరు బుల్స్ ఫైనల్ పోరుకు సిద్ధమైంది. గుజరాత్ రెండో క్వాలిఫైర్ మ్యాచ్ ఆడనుంది. ఇంకా ఫైనల్ ఆశలు సజీవంగానే ఉన్నాయి. బెంగళూరు నుంచి పవన్ ఆట ప్రారంభమైన రెండో నిమిషంలోనే పాయింట్ సాధించగా, గుజరాత్ తరపు నుంచి సచిన్ రెండు పాయింట్లు అందించాడు. 7వ నిమిషం వద్ద ఇరు జట్లు 7 పాయింట్ల వద్ద ఉన్నాయి. మొదటి హాఫ్ ఆట ముగిసే సరికి గుజరాత్ జట్టు 14-13 ఆధిక్యాన్ని సాధించింది. ఎలిమినేట్ రౌండ్‌లో దబంగ్ ఢిల్లీని యూపీ యోధ 45-33 పాయింట్ల తేడాతో గెలుపొందింది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively
Interaction
For
Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
మంగళవారం 1 జనవరి 2019

కలకాలం నవ్వాలి!



కాలం మరో కొత్త సంవత్సరాన్ని మనకు కానుకగా తెచ్చింది. మన జీవితంలో మనం కాదనలేని కానుక ఏదన్నా ఉందా అంటే అది కాలమే. మనం కావాలన్నా వద్దన్నా...అది మన ముంగిట్లోనే ఉంటుంది. కాలానికి మనపైన ఉన్న ప్రేమ అలాంటిది. మరి తిరిగి మనం కాలానికి అంతటి ప్రేమని అందించాలంటే...ఏం చేయాలి....దానికేమీ ఇవ్వనక్కర్లేదు...మన పెదవులను కాస్త విప్పారిస్తే...చాలు కాలం నిండుగా నవ్వుతుంది...మన కాళ్లను కొంచెం ముందుకు కదిపితే చాలు...అది చైతన్యంతో చిందులు వేస్తుంది...మన మనసుని కాస్త మృదువుగా మారిస్తే చాలు...అది మానవతా హరివిల్లయి మన జీవితాల్లో రంగులు నింపుతుంది...మనజీవితాన్ని మనం ప్రేమిస్తే చాలు....విశ్వమంత ప్రేమని బదులుగా ఇస్తుంది... అందుకే కాలాన్ని కలకాలం నవ్వనిద్దాం....ఇలాచేద్దాం-

ఆనందానికి ఆహ్వానం పంపుదాం!

ఆనందంగా ఉండాలంటే ఏం కావాలి...బ్యాంకు బ్యాలన్సులు, బంగళాలు, గొప్ప ఉద్యోగాలు, చదువులు, విలాస వస్తువులు... ఇవన్నీ ఉంటేనే ఆనందంగా ఉండగలం అని చాలామంది అనుకుంటారు. అదే నిజమైతే ఈ ప్రపంచంలో ఒక్కశాతం మంది కూడా ఆనందంగా ఉండలేరు. ఆనందం అనేది ఒక మానసిక స్థితి. దానిని మనంతట మనంగా తెచ్చుకోవచ్చు. నూతన వత్సరంలో ఆనందాన్ని ఇచ్చే కొన్ని అలవాట్లను మనజీవితంలోకి ఆహ్వానిద్దాం-

☞ మన గురించి మనం ఏమనుకుంటు న్నాం అనేది మన ఆనందం పైన ప్రభావాన్ని చూపుతుంది.



చాలామంది చేసే పొరబాటు ఇదే తమకు ఏమేం లేవో వాటిని గుర్తు చేసుకుని...తమకు ఆనందంగా ఉండే అర్హత లేదని అనుకుంటారు. కానీ ప్రతిమనిషికీ తమ పట్ల తమకు పాజిటివ్ ఫీల్‌ని ఇచ్చే అంశాలు కొన్నయినా ఉంటాయి. వాటిని గుర్తించినప్పుడు ఆనందం పెరుగుతుంది.

☞ కొత్త విద్యలు నైపుణ్యాలు నేర్చుకోవటం వలన మనలో ఆనందం పెరుగుతుంది.

☞ మన మెదడు కూడా ఒక కండరం లాంటిదే. నెగెటివ్‌గా ఆలోచిస్తే...ఆ విషయంలోనే అది బలపడుతుంది. నెగెటివ్ విషయా లనే ఎక్కువగా గుర్తుపెట్టు కుంటుంది. అలా కాకుండా మెదడుకి పాజిటివ్ విషయాలను మాత్రమే గుర్తుపెట్టుకునేలా తర్ఫీదు ఇవ్వవచ్చు. సాధనమీద ఇది సాధ్యమవుతుంది.

☞ సోషల్ మీడియాకు విరామం ఇచ్చి మనుషులతో నేరుగా కలవటం అలవాటు చేసుకుంటే...ఆమేరకు మనకు ఆనందం దొరుకుతుంది.

☞ ఖరీదైన వస్తువులపైనే ఎక్కువ ఖర్చుపెట్టకుండా సాహస యాత్రలకు, కొత్త ప్రదేశాలను చూడటానికి, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడానికి డబ్బు ఖర్చుపెడితే మరింత ఆనందం దొరుకుతుంది.

☞ ఇతరులతో దయగా సహానుభూతితో వ్యవహరించండి.

☞ ఇతరులు మన గురించి ఏమనుకుంటారో, అవమానాలు ఎదురవుతాయేమో, అపజయం కలుగుతుందేమో లాంటి ఆలోచనల వలన మన అడుగులు ముందుకు పడవు. అలాకాకుండా నెగెటివ్ ఆలోచనలు వచ్చినప్పుడల్లా...దాన్ని ఆపి పాజిటివ్‌గా ఆలోచించడం అలవాటు చేసుకుంటే...ఆనందాన్ని ఆహ్వానించవచ్చు.

☞ మనకు నచ్చిన మంచి విలువలను పాటించినప్పుడు కూడా ఆత్మవిశ్వాసం దాంతో పాటు ఆనందంగా ఉండగల శక్తి కూడా పెరుగుతుంది.

☞ ప్రతిరోజు వ్యాయామం చేయండి. దీనివలన శరీరం రిలాక్స్ అవుతుంది. మెదడుకి శక్తి పెరుగుతుంది. అంతేకాదు...తమ శరీరతీరు పట్ల అసంతృప్తి ఉన్నవారు వ్యాయామంచేయటం వలన... ఆ అసంతృప్తి తగ్గుతుందని పరిశోధనల్లో తేలింది.

☞ వారానికి రెండు గంటలు ఇతరులకు సేవలు అందించడం వలన మన ఆనందం పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.



☞ నవ్వుని ఒక అలవాటుగా మార్చుకోండి. నవ్వు వలన నెగెటివ్ ఆలోచనలు, నొప్పులు తగ్గుతాయి. మానసిక స్థితి ఉల్లాసంగా మారుతుంది.

☞ వయసు పెరుగుతున్నపుడు బాధపడాల్సిన పనిలేదు..పెరుగుతున్న వయసు ఆనందాన్ని ఇస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

భావోద్వేగాలను సమతౌల్యం చేద్దాం!

ఇప్పుడు ఆరోగ్యం అంటే శారీరకమే కాదు... ఎమోషనల్ హెల్త్ కూడా అంటున్నారు. అనారోగ్యాలే కాదు...ఒక్కోసారి భావోద్వేగాలు సైతం మనల్ని భయపెడుతుంటాయి. కోపం ఆవేశం బాధ ప్రేమ ద్వేషం....ఇలాంటి భావోద్వేగాలన్నీ...మన చేతుల్లో ఉంటేనే మన జీవితం మన చేతుల్లో ఉంటుంది. లేకపోతే....కుక్క తోకని ఆడించడం కాకుండా...తోక కుక్కని ఆడించడంలాగే ఉంటుంది జీవితం. అందుకే ఈ నూతన సంవత్సరంలో భావోద్వేగాల సమతౌల్యంపైన దృష్టిపెడదాం. మన భావాలు, మన ఉద్వేగాలపై మనకు అదుపు రావాలంటే...ఎమోషనల్ హెల్త్ ని దృష్టిలో పెట్టుకుని కొన్ని విషయాలను సాధన చేయాల్సిందే.

ప్రకృతితో స్నేహం

మనలోని ప్రకృతి సవ్యంగా ఉండాలంటే బయట ఉన్న ప్రకృతితో స్నేహం చేయాలి. భావోద్వేగాలు మనసుని అల్లకల్లోలం చేస్తుంటాయి. ఇతరులు మనల్ని ఒకమాట అన్నా...ఇతరులను మనం ఒకమాట అనాల్సి వచ్చినా, ఒక వ్యక్తిపై మితిమీరిన ప్రేమ పొంగిపొర్లుతున్నపుడు, లేదా ఒకవ్యక్తిపై మనసంతా ద్వేషం నిండిపోయినప్పుడు లేదా ఆవేశమో ఆవేదనో ఊపేస్తున్నపుడు...ఇలాంటి సందర్భాల్లో మనల్ని మనం సంబాళించుకోలేక, మనసుని కల్లోలం చేస్తున్న ఉద్వేగాలను ఎలా ఆపాలో తెలియక తికమక పడుతుంటాం. ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటూ ఉంటాం. అలాంటి స్థితే ఎమోషనల్ ఇంబాలన్స్. ప్రకృతిలో కొంత సమయం గడపటం వలన మన లోపలి సంచలనాలు మాయమై ప్రశాంతత ఆవరిస్తుంది. శక్తి స్పష్టత కృతజ్ఞతాభావం లాంటి పాజిటివ్ భావాలు పెరుగుతాయి.

మీ కృతజ్ఞతని అక్షరాల్లో పెట్టండి

జీవితమనకు ఎన్నో బహుమతులను ఇచ్చినా వాటిని మనం పట్టించుకోము. అలాంటి ఒక మంచి విషయాన్ని ఎంపిక చేసుకుని దానిని పుస్తకంలో రాయండి. చదువు, తెలివితేటలు, ప్రేమించే మనుషులు మంచి ఉద్యోగం ఇలా...అది ఏదైనా కావచ్చు. ఇలా చేయటం వలన మనసుకి కృతజ్ఞతా భావం తెలుస్తుంది. మనవిలువ మనకు అర్థమవుతుంది. దీనివలన అనవసరమైన నెగెటివ్ ఎమోషన్లు తగ్గుతాయి. అలాగే జీవితంలో మీకు బాగా నచ్చిన వ్యక్తి కోసమో, పనికోసమో, అభిరుచికోసమో ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించండి.

చుట్టూ పాజిటివ్ వ్యక్తులు ఉండేలా...

మనచుట్టూ ఉన్నవారి ఆలోచనలు మనపై ప్రభావాన్ని చూపుతాయి. నెగెటివ్ వ్యక్తులు మనతో పాటు ఉంటే వారు మనలోని శక్తిని కూడా లాగేస్తారు. ఎప్పుడూ ఏదో ఒక విషయంపై లేదా ఎవరో ఒకరిపై ఫిర్యాదు చేసే నెగెటివ్ మనస్తత్వాలకు దూరంగా ఉండటం వలన.... అనవసరమైన భావోద్వేగాలకు గురికాకుండా ఉండగలం. పాజిటివ్‌గా ఆలోచించేవారితో ఉండటం వలన మన ఆలోచనలు, దృక్పథం కూడా అలాగే మారతాయి. శరీరం మనసు శక్తిమంతంగా తయారవుతాయి.

ఒక మార్గదర్శి ఉండాలి

జీవితంలో మన లక్ష్యాలు గమ్యాలను నిర్దేశించి...మనలోని అనవసరమైన నమ్మకాలను భయాలను పోగొట్టే ఒక మార్గదర్శి ఉంటే మరింత మంచిది. కలలను సాకారం చేసుకునేలా విశాలమైన దృక్పథాన్ని, ధైర్యాన్ని ఇచ్చే అలాంటి లైఫ్‌కోచ్‌లు ఉంటే...మన అడుగులు ఎప్పుడూ లక్ష్యసాధనవైపే ఉంటాయి. దాంతో మన ఎమోషనల్ హెల్త్ కూడా బాగుంటుంది.

ఒక మంచి అభిరుచిని పెంచుకోండి

ప్రతి మనిషికి తన మనసుకి నచ్చిన అభిరుచి ఒకటి ఉండాలి. దీనివలన మన అంతరంగంలో ఆనందం బాల్యం అలాగే ఉంటాయి. మొక్కల పెంపకం, రచనలు, ఆటలు, వంట, పాటలు....ఇలా అభిరుచి ఏదైనా అది మనతో మనకున్న అనుబంధాన్ని నిలిపి ఉంచుతుంది. అప్పుడు బయటి ప్రపంచాన్ని మరీ సీరియస్ గా తీసుకుని ఎమోషనల్ హెల్త్‌ని పాడుచేసుకోకుండా ఉంటాం.

ఇవేకాదు...

-వ్యాయామం చేయటం వలన ఎమోషనల్‌గా ఆరోగ్యంగా ఉండగలం. వ్యాయామంతో మనలో శక్తి పెరుగుతుంది. శక్తి పెరిగినప్పుడు దిగులు డిప్రెషన్ లాంటి బాధలు వేధించకుండా ఉంటాయి.

-రాత్రి నిద్రపోయే ముందు ఒకసారి రోజంతా ఏం జరిగిందో సమీక్షించుకుంటే...ఎక్కడ ఎమోషనల్ గా ఇబ్బందికి గురవుతున్నామో తెలుస్తుంది.

-మనం నివసిస్తున్న ప్రదేశాల్లో అనవసరమైన పనికిరాని వస్తువులు లేకుండా చూసుకోవాలి. దీనివలన మనసు ఆలోచనలు కూడా స్పష్టంగా సవ్యంగా ఉంటాయి.

-ఇవేకాదు..మనల్ని మనం, ఇతరులను క్షమించడం అలవాటు చేసుకోవటం వలన కూడా భావోద్వేగపరమైన ఆరోగ్యం బాగుంటుంది. క్షమించడం అంటే ఇతరుల్లోని చెడు లక్షణాలను ఒప్పుకున్నట్టు కాదు...మనకు మనం శాంతిని వెతుక్కోవటం.

కాలంతో కలిసి నడుద్దాం!

జీవితంలో అత్యంత బాధాకరమైన విషయాల్లో ఒకటి వృథాగా కరిగి పోయిన కాలం. కరిగిపోయిన కాలాన్ని ఏం చేసినా తిరిగి తెచ్చుకోలేము. అందుకే కాలం కంటే ముందు కాకపోయినా... కాలంతో పాటు కలిసి నడవాలి..అంటే కాలం వృథాగా కరిగిపోకుండా చూసుకోవాలి.

☞ కాలం మనచేతుల్లో ఉండాలంటే మన గుండెల్లో ఒక లక్ష్యం ఉండాలి. దానివెంట మన అడుగులు పడాలి. మనం చేస్తున్న పనులన్నీ మనల్ని లక్ష్యసాధనవైపు తీసుకువెళ్లేవిగానే ఉండాలి.



☞ ఫస్ట్ థింగ్స్ ఫస్ట్ ..పుస్తక సహరచయిత స్టీఫెన్ కోవే..ప్రకారం పనులను వాటి ప్రాధాన్యతల వారీగా విడగొట్టుకోవాలి. అప్పుడు అనవసరమైన పనులు ముందుకు వచ్చి మన కాలాన్ని తినేయ కుండా ఉంటాయి.

☞ అర్జంట్, ఇంపార్టెంట్, అర్జంట్ ఇంపార్టెంట్ రెండూ కాదు...ఇలా విభజించుకుంటే... ఏ పని ఎప్పుడు చేయాలి... దేనికి ఎంత సమయం ఇవ్వాలి...అనేది అర్థమవుతుంది.

☞ సమయం వృథా అనుకున్న పనులు అప్పగించినప్పుడు నో చెప్పటం అలవాటు చేసుకోవాలి. ఏదోఒక పనితో బిజీగా ఉండటం కాకుండా...చేసే ప్రతిపని కాలాన్ని సద్వినియోగం చేసేది అయిఉండాలి.

☞ ప్లాన్ లేకుండా పనిలోకి దూకేయకండి...అలా చేస్తే సమయం వృథా అవుతుంది. అలాగే రాత్రులు తప్పకుండా తెల్లవారి చేయాల్సిన పనుల ప్రణాళిక తయారుచేసుకోవాలి.

☞ పనిలో ఉన్నపుడు ఆటంకాలు ఎదురుకా కుండా చూసుకోవాలి. ఫోన్, టివి, స్నేహితులనుండి కాల్స్..లాంటివి లేకుండా చూసుకోవాలి.

☞ డబ్బుని ఖర్చుపెట్టుకునేటప్పుడు ఎలాగైతే...ప్రతిరూపాయి సవ్యంగా వెళుతుందా...లేదా అని చూసుకుంటామో, అలాగే కాలాన్ని ఖర్చుచేసేటప్పుడు కూడా....ఏం చేస్తున్నాం...అనేది దృష్టిలో ఉంచుకోవాలి.

☞ మంచి ఆహారం, కంటినిండా నిద్ర, వ్యాయామంఉండేలా చూసుకోవాలి. దీనివలన మన మెదడు మరింత శక్తిమంతంగా పనిచేస్తుంది. తక్కువ సమయంలో ఎక్కువ పని చేయగలం.

- వడ్లమూడి దుర్గాంబ

* రంగవల్లిక *

మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

అడ్రసు: లైఫ్ C/O ఆంధ్రప్రభ, 8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com



13 చుక్కలు
13 వరుసలు
సరిచుక్క



బోయిన్‌పల్లి రేణుక
చారకొండ
జి. నాగర్‌కర్నూల్



24 చుక్కలు
24 వరుసలు



జాస్తి భాగ్యలక్ష్మి
జయపురం
కృష్ణాజిల్లా



16 చుక్కలు
4 వరుసలు
4వచ్చేవరకు
సరిచుక్క



ఎం. ధనలక్ష్మి, కె.హెచ్.బి కాలని, నెల్లూరు





గోకవరపు సుహాసిని
మచిలీపట్నం

19 చుక్కలు
19 వరుసలు
సరిచుక్క

గిలిగింతలు











చింతన

పరిణామ క్రమంలో 'పరిణితి'చూపిన పాత్రలు


సాహిత్యం సమాజ హితం కోరుతుంది. సాహిత్యం ఒక కాలగమనచరిత్ర. సాహితీ సృజనలో పాత్రలుగా 'మానవ జీవిత నమూనాలు' చిత్రించబడతాయి. తిరిగి అవే కొత్తవారికి దిశానిర్దేశం చేస్తాయి. మహా భారతం, రామాయణం వంటి గ్రంథాల్లో అనేకానేక పాత్రలు వేయి సంవత్సరాలుగా సమాజ గమనంలో ఓ ప్రధాన భూమికను వహిస్తున్నాయి. క్రమానుగత పరంపరలో ఆటుపోట్లను తట్టుకుంటూ సాహసంతో, ఆవేశాలతో, ఆందోళనతో, విన మ్రతతో, విజయాలతో, రాజీలు, ఓటములతో జీవనయానం చేసిన స్త్రీ పాత్రలను గుర్తించి కాస్త చర్చించుకోవాల్సిన ఆవశ్యకత వర్తమాన భారతంలో ఉంది.

ప్రబ్రూత సత్యం కతరో జనానాం దోషోస్తియోనాచరి మనుష్యైః
ధార్ష్ట్యేనపుంభిః ప్రమదానిరస్తాః గుణాధికాస్తామనునాత్రచోక్తమ్

అని 'బృహత్ సంహిత' చెబుతుంది. దీనర్థం పురుషులు చేయని, స్త్రీలు మాత్రమే చేసిన దోషం ఏది ఉందో నిజం చెప్పండి. పురుషులు కేవలం మొండితనం వహించి స్త్రీలను నిరసిస్తున్నారు. గుణాలచేత వారు పురుషుల కంటె గొప్పవాళ్లు. మహాభారత రామాయణాల్లో శకుంతల, దమయంతి, మండోదరి, సుధేష్ణ వంటి వారిని పరిణామక్రమశీలనలో గమనించి విశ్లేషించుకోవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా ఈ నాలుగు పాత్రలు స్థూల పరిశీలన చేసే వేళ వారి మధ్య ఉన్న సారూప్య భేదాలను సైతం గమనించవలసి ఉంది. ఈ నలుగురు సమాజంలో 'నేను' ఒక భాగం అని నిర్ణయించుకుని అవసరమైన వేళ సమాజరీతిని వ్యక్తి కేంద్రంగా ఎత్తి చూపారు. తమకున్న ఉనికి, వ్యక్తిత్వం ఇది అని నిరూపించారు. అలాగని అనవసర దూషణలకు తావివ్వలేదు. తమకు జరిగిన అవమా నాలకు, తిరస్కారాలకు సమాధానం చెప్పవలసిన వారే తమది తప్పు అని ఎత్తి చూపటం పొరపాటని చెప్పారు. శకుంతల రాజ్యసభలో దుష్యంతుణ్ణి, సుధేష్ణ విరాట రాజును, సోదరుడు కీచకుని, మండోదరి తన భర్త రావణుని, దమయంతి భర్త నలుని కూడా తమ కోణం నుంచి వారి తప్పొప్పులను సున్నితంగా ఎత్తి చూపారు. కూడని పనులు రాజ్యానికి, రాజు లకు పనికిరావన్నారు. స్త్రీలను అవమాన పరిచే రాజులకు, రాజ్యానికి భవిష్యత్ లేదన్నారు. స్త్రీల పట్ల గౌరవప్రదంగా, బాధ్యతాయుతంగా ఉండాలని చెప్పా రు. వారి మాటలను హెచ్చరికలుగా గ్రహించలేనివారు (రావణుడు, కీచ కుడు) నాశనమయ్యారు. విన్నవారు (దుష్యంతుడు, విరాటరాజు) కీర్తివం తులై నారు. స్త్రీల ముందు చూపును నాటి సమాజం నీతి, నైతికత , ధర్మ నిష్ఠల పట్ల వారి అనురక్తిని పై పాత్రలు విపులంగా ఆయా సందర్భానుసారంగా వివరిం చటం పరిణామక్రమ దశలో స్త్రీ పాత్ర లకో ఉదాహరణ.


పై నాలుగు పాత్రలు సమాజం నుంచి, కుటుంబం నుంచి తాము నేర్చు కున్న అంశాలను తమ మాటలు, వ్యక్తిత్వం ద్వారా ప్రకటించాయి. ఉదాహరణకు ప్రశ్నించే తత్త్వం, తిర స్కారం ఎదురైన వేళ మడమ తిప్పని నైజం, ఎదుటివారి మనో నైజాన్ని గమనించినా ప్రకటించకపోవడం వంటి గొప్ప అంశాలు ఆయా పాత్రలకు వన్నెలద్దాయి.

శకుంతల తన జీవితాన్ని ధైర్యంతో ఎదుర్కొన్న స్త్రీ. అంతకు ముందు మేనక పాత్రను గమ నించాలి. విశ్వామిత్రుని తపోభంగం చేయమని ఇంద్రుడు ఆజ్ఞాపించగా వెంటనే ఇంద్రుడిని ప్రశ్నిస్తుంది. ' నీ వంటివాడినే భయపెట్టగల, శపించగల వారి వద్దకు నన్ను పంపటం భావ్యమా అని ప్రశ్నిస్తుంది. ఈ తత్వాన్ని శకుంతల నేర్చు కుంది. శాశ్వతమైన కుటుంబం, పిల్లల సంరక్షణ వంటివి స్త్రీకి ఎంత అవసరమో నేర్చుకుంది. ఆమెను తల్లిదండ్రులు చిన్నతనంలోనే వదలివేయడంతో శకుంతల చేత పెరిగింది. తద్వారా రక్షణ లేని బిడ్డ గతి తెలుసుకుంది. కనుకనే తమ ఇద్దరికి జన్మించిన బిడ్డకే రాజ్య పట్టాభిషేకం జరగాలని దుష్యంతునితో అంటుంది. స్త్రీకి భద్రత ఆమె సంతానపు వారసత్వ హక్కు గుర్తింపు పైనే ఆధారపడి ఉంటుంది. ఈ లోకవృత్త పరిశీలనా జ్ఞానం నుంచి గ్రహించినది, కుమారునితో శకుంతల రాజసభకు వెళ్లింది. దుష్యంతుడు ఆమె ఎవరో తెలియనట్లు చూశాడు. **'విరసంబులై కడు క్రూరముగా'** అతని చూపులున్నా యనుకుంది. ఇంతదూరం వచ్చాక వెనుకడుగు వేయకూడదనుకుంది. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని విలువ లను, ధర్మాన్ని, కుటుంబాన్ని, సహజ స్వచ్ఛ అనురాగ భావా లను ప్రకటించాలని కోరింది. పితృస్వామ్య సామాజిక వ్యవస్థలోని క్రూరమైన పురుష స్వార్థ చింతనను నగ్నంగా నిల బెట్టింది. ఆనాటి వ్యవస్థలో ఆడపిల్ల, స్థిరత్వం కోసం ఎంతగా పోరాటం చేయాలో తన మాటల్లో పరోక్షంగా సమాజానికి తెలి పింది.



శకుంతలకు తానున్న సమాజ స్వభావం, ధర్మశాస్త్రపు లోతులు తెలుసు. వాటి జ్ఞానంతో నిర్ణయాలు తీసుకోవడం తెలుసు. వాటి నేపథ్యం నుంచి ఓ వ్యక్తిగా జీవిత సమరం కొనసాగించింది శకుంతల.

మరో పాత్ర దమయంతి. నలుని భార్య. స్వయం నిర్ణయ శక్తి స్థిర సంకల్పంతో తన జీవితాన్ని చక్కదిద్దుకోగలిగిన చొరవగల స్త్రీ. దమయంతి, ద్రౌపది పాత్రల మధ్య పోలిక



ఉన్నది. ఆపన్న సమయాలలో అవసరమైన ధీరతను ప్రదర్శించినవి. ఎదురైన ప్రతి సంక్లిష్టతపు తనదైన స్వయం నిర్ణయాలతో చక్కదిద్దుకున్న వైనం ప్రశంసనీయం. రాకుమార్తె అయిన ఆమె నల చక్రవర్తిని ప్రేమించింది. అయితే దమయంతిని తమలో ఒకరిని వివాహం చేసుకోమని చెప్పాలని దేవతలు తమ రాయబారిగా నలునే పంపారు. మనిషికి, దేవునికి మధ్య తేడా తెలిసిన దమయంతి నలుడిని ప్రేమిస్తుంది. వరిస్తుంది. ఆ తర్వాత కాలంలో పుష్కరునితో జూదం ఆడి ఓడిపోతున్న భర్త ప్రవర్తనకు దుఃఖించలేదు. తన బాధ్యత తెలునుకుంది. ఓడిన కొద్దీ మగవాడిలో పట్టుదల, ఆసక్తి పెరుగుతాయి. ఇది ఆలోచించి పిల్లలను క్షేమంగా తన తండ్రి వద్దకు పంపుతుంది. రాజ్యం కోల్పోయిన నలుని వెంట అరణ్యానికి వెళ్ళింది. ఆ తర్వాత వారిద్దరూ విడిపోవడం పునః స్వయంవరం ప్రకటించి వచ్చిన రాజులలో ఒకరికి సారథిగా వచ్చిన నలుని గుర్తించడం తెలిసిందే. ఇటువంటి ఆలోచన చేసిన దమయంతి మేధ, అద్భుత సౌందర్యవతి అయిన ఆమె అందాన్ని మించిపో యింది. స్త్రీ శక్తికి, మేధో సంపత్తికి గొప్ప ప్రతీక దమయంతి.

సమాజంలో స్త్రీ కుటుంబానికి అధిక ప్రాధాన్యతనిస్తుంది. తన వారికోసం ఏమైనా చేయగలదు. ఇది బలమా? బలహీనతా అనేది చరిత్ర పుటల శషభిషల మధ్య అనాదిగా నలుగుతున్న అంశమే! దమయంతి, శకుంతలలు తమను తాము వ్యక్తీకరిం చుకునేందుకు, తమవారిని దక్కించుకునేందుకు తపన పడ్డారు. కాని సుధేష్ణలో తనవారి కోసం, తన దగ్గర పనిచేస్తున్న వారికి భరోస ఇవ్వలేని రాణివాసపు స్త్రీ కనబడుతుంది. బలహీన మనస్తత్వం ఆమెది. కనుకనే అటు భర్త, ఇటు ద్రౌపది వద్ద గౌరవం కోల్పోయింది. భర్త, సోదరుని మధ్య ఆమె వ్యక్తిత్వం లేని పాత్రగా మిగిలిపోయింది. సైరంధ్రిగా ఉన్న ద్రౌపదిని తన మందిరానికి పంపమని కీచకుడు, తన అక్కనే అడగడం, ద్రౌపదిని బలిపశువును చేయడానికి ఆమె సిద్ధపడడం, ఆమె బలహీనతను వ్యక్తం చేస్తోంది. ఈ పొరపాటే కీచక, ఉప కీచకులు భీముని చేతిలో హతమవడానికి కారణ మయింది. అయితే ఇదంతా ఆమెకు తనవారి పట్ల ఉన్న ప్రేమాభిమానాల వల్లనే జరిగిందనేది ఓ నమ్మలేని నిజం. సాహిత్యంలో కథ ప్రధానమైన అంశం. పాత్రలు దానిని ప్రకటించడానికి సహాయకారులుగా ఉంటాయి.

వాల్మీకి సృజించిన మండోదరి పాత్ర అద్భుతమైనది. భర్త పట్ల మమకారం, బిడ్డల పట్ల ప్రేమానురాగాలు, రాజ్య భద్రత పట్ల ఆమె భయం, గొప్ప వ్యక్తుల పట్ల ఆమెకున్న గౌరవం వాల్మీకి సమాజానికి చక్కగా చూపుతాడు.

ఆమె పాత్ర ఒకటి రెండుసార్లు మాత్రమే తారసపడుతుంది. తొలిసారిగా హనుమ సీతాన్వేషణకై లంకలో ప్రవేశించిన సందర్భంలో ఆమెను కవి వర్ణించిన తీరు సీతను గుర్తుకు తెస్తుంది. అన్వే షణలో భాగంగా అంతఃపురంలో చరిస్తూ మండోదరిని చూసి సీత అని భ్రమిస్తాడు. అయితే ఆమె ముఖంలో ప్రశాంతత చూసి కాదనుకుంటాడు. ఆ ఒక్క సన్నివేశంలోనే ఆమె కూడా సీత వంటి సాధ్వి అని పరోక్షంగా మనకు చెబుతారు. రావణ మరణానంతరం సుదీర్ఘమైన స్వగతంలో ఆవేదనతో, నమ్మ శక్యం కాని విభ్రమంతో ఆమె రావణుని విమర్శించటం వంటివి ఉన్నాయి. ఇది ఆమె నిండైన వ్యక్తిత్వానికి మచ్చు తునక. సీత తనకన్నా గొప్పది కాదనే అభిప్రాయం, తనకు భర్తపై గల ప్రేమను వ్యక్తీకరించటంలో ఏమాత్రం తీసిపోననే ఆత్మ సౌందర్యం ఉంది. ఎంతో ఆత్మవిశ్వాసం, స్వాభిమానం గల తన వంటి భార్య ఉండగా రావణుడు మరో ఆడదాని కోసం ఆశపడటం, ఆ కారణంగా ప్రాణం మీదకు తెచ్చుకోవడం అతని మనస్తత్వాన్ని బహిరంగం చేస్తుంది. రావణుని మరణం ఆమెకు నమ్మశక్యం కానిదే అయినా రాముని బలపరాక్రమాలు ఆమెకు తెలుసు. కనుకనే అతనిని ప్రశంసిస్తుంది. యుద్ధాల వల్ల అంతఃపుర స్త్రీలు ఎలా వీధిన పడతారో వివరిస్తుంది.

రామాయణ, మహాభారత గాథలలోని దమయంతి, శకుంతల, సుధేష్ణ, మండోదరి పాత్రల మధ్య కొన్ని పోలికలు, వైరుధ్యాలు ఉన్నాయి. కాని కాల పరిణామ క్రమంలో ప్రధాన మైన ఎదుగుదల, స్వయంశక్తితో ప్రశ్నించే తత్త్వం వంటివి ప్రధానంగా కనిపిస్తున్నాయి. మహాభారతంలోని పాత్రల మధ్య ఒకే రూపమైన సారూపత్య ఉంది. అది ఏమిటంటే సమా జంలో నేను అని కాకుండా సమాజం కోసం తాను, తన కుటుంబం అనే తపన కనబడుతుంది.

తెలుగు ప్రభావం చూపింది. ముఖ్యంగా తిక్కన తనదైన రచనా శైలి, నాటకీయతలు ఈ అంశ విస్తరణకు మరింత సొబగు చేకూర్చిందని చెప్పవచ్చు, వర్తమాన సమాజంలో పెరుగు తున్న అభద్రత అనిశ్చలతలకు పరిష్కారాలు పై నాలుగు పాత్రల చిత్రణలో గమనించవచ్చు. ఈ పాత్రల స్పందన తనకు తాను నిర్భయంగా ఆవిష్కరించుకుని తనకు కావలసిన దానిని తాను పొందిన వైనం ఓ మార్గదర్శకమని మరువకూడదు.


- భమిడిపాటి గౌరీశంకర్
9492858395

అదీ సమాచారం

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

భగవాన్ కొండమీద వుండగా కె.ఆర్.విశ్వనాథశాస్త్రి అనే పండితులొకరు మధుర ప్రాంతాల నుంచి వస్తూపోతూ వుండి, సంస్కృతంలో భగవాన్ చరిత్ర వ్రాసి ''రమణీయ విలాస మహాకావ్యం'' అని పేరు పెట్టి శ్రీవారికి సమర్పించారు. చాలాకాలం అది అచ్చుకాలేదు. ఆ వెనుక ప్రస్తుతం వున్న రమణాశ్రమం ఏర్పడింది కదా? అప్పుడూ చాలా రోజులు అచ్చుకాలేదు. నేను రమణాశ్రమానికి వచ్చిన కొంతకాలానికి, అంటే 1945లో ఆ పుస్తకం ఆశ్రమం పబ్లికేషన్‌గానే అచ్చయింది. సంస్కృతం కావడం వలన కొద్ది కాపీలే అచ్చువేశారు. ఆ పుస్తకాలు వచ్చిన కొత్తలో అంతా ఎంతో ఆసక్తితో చదివారు. అప్పుడు గిద్దలూరి సాంబశివరావుగారు ఇక్కడున్నారు. వారు గూడా ఆ పుస్తకం చదివి అందులో ఒకచోట భగవాన్ స్తోత్రం 9శ్లోకాలలో వుండటం చూచారట. అవి చాలా బాగున్నవనీ, తనకు తెలుగు అక్షరాలలో కావాలనీ, ఒకనాటి మధ్యాహ్నం భగవాన్ వద్ద ఎవరూ లేనప్పుడు మనవి చేసి ఆ పుస్తకం ఇచ్చి వెళ్లారట. రెండు గంటలు దాటిన వెనుక నేను భగవాన్ సన్నిధికి వెళ్లి నమస్కరించి లేవగానే భగవాన్ దగ్గరకు రమ్మన్నట్లు తలవూపితే వెళ్లాను. భగవాన్ పుస్తకం చూపుతూ, ''ఇదిగో చూడు విశ్వనాథశాస్త్రి వ్రాసిన ఈ చరిత్రలో 9శ్లోకాలతో నన్ను స్తుతించారు. ఆ 9 శ్లోకాలు సాంబశివరావుకు తెలుగక్షరంలో కావాలట. ఎవరిచేతనైన వ్రాయించుకోక, నాకప్పగించారు. నీవు వ్రాయగలవా?''అన్నారు భగవాన్. ''అల్లాగే! పుస్తకంలో చూచి వ్రాస్తాను. తప్పులున్న భగవాన్ దిద్దవచ్చును''అన్నా నేను. సరేనని అందుకుగాను తెప్పించిన కాగితము, పుస్తకము నా కప్పగించి, శ్లోకాలు గుర్తు చూపి బాధ్యత తీరినట్లు కూర్చున్నారు భగవాన్.

నాకు సంస్కృతాక్షరాలు అంత బాగా తెలియకున్నా, భగవాన్ దయవల్ల శ్లోకాలు గుర్తుపెట్టుకుని బసకు వచ్చి ఆ 9 శ్లోకాలు తెలుగక్షరాలలో వ్రాసి మర్నాడు శ్రీవారికిస్తే ఒకటి, రెండు చోట్ల భగవాన్ దిద్ది కాగితం నాకిస్తూ, ''సాంబశివరావు కిచ్చిరా''అన్నారు. తీసికొని వెళ్లి సాంబశివరావు గారి కిచ్చాను. వారు ''అయ్యో నీకిచ్చారా? భగవాన్ వ్రాసి యిస్తారని ఆశించాను గాని, లేకుంటే ఎవరిచేతనైనా వ్రాయించ లేకనా?''అన్నారు. ''నాకదేమీ తెలియదు. భగవాన్ వ్రాసి ఇవ్వమన్నారు యిచ్చాను''అన్నాను. వారెంతో కించతో ఆ కాగితమందుకున్నారు. నేను తిరిగి వచ్చి భగవానుతో ఆ విషయం మనవి చేశాను. ''ఆ! అదీ సమాచారం. ఎల్లాగైనా భగవాన్ చేత వ్రాయించి, ఆ కాగితం దాచుకోవాలని వారి వూహ. ఒక్కొక్కరికీ ఇదే అభిప్రాయం. ఇది వరకంటే ఏదో సరిపోయింది. ఇప్పుడు అక్షరం సరిగా కుదరదు. చెయ్యి వణుకుతుంది. ఏం జేసేది? అందుకే నిన్ను వ్రాయమన్నాను'' అన్నారు భగవాన్.




ఒక భక్తుడు నావైపు చూపి, ''ఇప్పుడు తెలు గంతా ఆమెగారు చూస్తు న్నారా ఏమి?'' అన్నారు. ''అవు నవును. ఆమె వచ్చిన వెనుక నాకు తెలుగుపని వదిలింది. అంతా అదే చూచు కుంటున్నది. ఆ సంగతి తెలిసి గూడా నన్ను వ్రాయమంటా రెందుకో? అదొక వేషం!'' అన్నారు భగవాన్. ఆ 9 శ్లోకాలు యిక్కడ పొందుపరుస్తున్నాను.

1. శ్లో॥ నిగమావలి, శిఖరేశయ, వినివేశిత చిత్తం
కుసుమాయుధ, భృశవైభవ, పరితర్జన శక్తమ్.
నిజ సత్కృతి, గణదూరిత, జనమానసమోహం,
భజదుత్తమ, నిఖిలేష్టద, మతిమానసమూహం.
2. శ్లో॥ మృదుభాషణ, పరిభాషిత, కలశాంబుధిసారం
సుదరీకృతవసతిం, గలలసితామలహారం.
శిశుతాగత, గురుతాయుజ, మరవింద దళాక్ష -
న్నశుభాపహ వరతారకమను మన్త్రణ దీక్షమ్.
3. శ్లో॥జితమానస, మతిమానుష, ముపమానవిహీనం,
శృతిపారగనుత, మామయగణ హృన్మహిమానం
ధరణీకృత, సుకృతవ్రజ, పరిపాక శరీరమ్,
రమణీగణ, విరతాస్తర, మభిరామ ముదారమ్
4. శ్లో॥ ప్రభవాభవ, విదమాశుగ, వినిరోధనవన్తం,
శుభవాసన మభవాయ చ భృశముద్య మువన్తమ్
పరవాదిన మదవారణ వినివారణసింహం,
నరకావహ కలుషాపహ సుగుణాలిమజిహ్మమ్.
5. శ్లో॥మమతాత్యజ మమలాశయ పరిశామ్యదహన్తం
సుమనోరమ భుజలాలిత వరదండయుతంతమ్
అతిమాత్రక తపసాశ్రిత గిరిరాజసుతేశం
మతినిర్జిత సురనాయక గురుమస్త మితాశమ్.
6. శ్లో॥భసితామల నిటిలాదిమ సకలావయవౌధం,
హసితన్యతి పరిభర్త్సిత హరిణాంగమయూఖమ్,
స్వకరార్పిత తృణఖాదన పరిపోష భృదేణం,
కరరాజితకరకం యతి సముదాయ ధురీణం
7. శ్లో॥ క్షమయాజిత వసుధం శుచియశ సంయుతిదేవం,
సమదర్శన పరిదర్శిత నిజసత్తమ భావమ్,
పరసున్దర జనన్తార సుతపఃఫలభూతం
మరణోద్భవ, భవసాధ్వస, ఘన వారక వాతమ్.
8. శ్లో॥ కరుణారస వరుణాలయ మతిమాత్ర మసంగం,
తరుణాకృతి మకృతాత్మ దురవలోక నిజాంగం,
జితమాయక సుకృతి వ్రజకృతమైశ్వర మూర్తిం,
మిత భోజన మవలోకన హృతభక్త జనార్తిమ్.
9. శ్లో॥ శరణాగత భరణాదర మరుణాచల వాసం,
తరుణారుణ కిరణావలి జయపండిత భాసం,
భవసాగర తరణావహ చరణాంబుజపోతం,
ప్రణమామ్యహ మసకృద్భువి రమణాహ్వయమేతమ్.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/



తిరుప్పావై

పాశురం 17

అమ్బరమే; తణ్ణీరే; శోఱే; అఱమ్ శెయ్యుమ్
ఎమ్బెరుమాన్! నన్దగోపాలా! ఎళున్దిరాయ్;
కొమ్బనార్క్కెల్లామ్ కొళుందే! కులవిళక్కే!
ఎమ్బెరుమాట్టి ! యశోదాయ్! అఱివుఱాయ్;
అమ్బర మూడఱుత్తోఙ్గి యులగళన్ద
ఉమ్బర్‌కోమానే! ఉఱఙ్గాదె ళున్దిరాయ్!
శమ్పొఱ్కళలడిచ్చెల్వా! బలదేవా!
ఉమ్బియుమ్ నీయు ముఱఙ్గేలో రెమ్బావాయ్

తాత్పర్యం!

ద్వారముల నుంచి లోనికి ప్రవేశించిన పిదప వస్త్ర మును, చల్లని తీర్థమును, అన్నమును విరవిగ దానము చేయు స్వామీ! నంద గోపాలుడా! మేల్కొనుమా! నీటి ప్రెబ్బలి మొక్క వంటి సుకుమార గాత్రులగు స్త్రీ జాతికంతటికి చిగురు వంటిదానా! గోప కులమును ప్రకాశింపజేయు మంగళదీపము వంటిదానా! మా అందరకు స్వామియైన దానా! కీర్తినిచ్చు యశోదమ్మా! తెలివి తెచ్చుకోవమ్మా! ఆకసమును ఛేదిస్తూ పెద్దగ పెరిగి లోకములను కొలచిన ఓ దేవదేవా! నిదురించక లేవయ్యా! ఎఱ్రని బంగరు పాదకడి యములు ధరించి శ్రీకృష్ణాను భవా న్నందించిన ఐశ్వర్యవంతుడా ఓ బలరామా! మీ తమ్ముడును, నీవును కూడా వెంటనే మేలు కోవలసినది అని ఈ నల్వురు లేపబడిరి.



- జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సౌజన్యంతో

సంవత్సర ఫలాలు

వేషరాశి: ఈ రాశి వారికి గురు/శని/కేతు గ్రహాల ప్రతికూలత ఉంది. కాబట్టి ప్రతి పనిలోనూ ఆచితూచి వ్యవహరించాలి. రాహుగ్రహ అనుకూలత ఉంది. కాబట్టి ధైర్యం కొనసాగుతుంది. వ్యవసాయ, సాఫ్ట్ వేర్ రంగాల వారికి అనుకూలం.

వృషభరాశి: ఈరాశి వారికి ఈ సంవత్సరం అను కూల గ్రహం బృహస్పతి. ప్రతికూల గ్రహాలు రాహువు/కేతు/ శనిలు. గట్టి ప్రయత్నాలతో విజయాలు సాధించగలుగుతారు. అభివృద్ధి వ్యాపార రంగం వారికి గతంలో కన్నా మెరుగ్గా ఉంటుంది. వైద్యవృత్తి వారికి అనుకూలం. న్యాయవాద వృత్తి వారికి శుభవార్తలు బలాన్ని పెంచుతాయి.

మిథునరాశి: ఈరాశి వారికి గురు/శని/రాహు/ కేతు గ్రహాలు ప్రతికూలం. కాబట్టి ప్రతి పనిలోనూ జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. మహిళలకు అక్టోబర్ 2019 తర్వాత చేపట్టిన కార్యాలు కలసి వస్తాయి.

కర్కాటకరాశి: ఈ రాశి వారికి ఈ సంవత్సరం అత్యంత అనుకూలం. అనుకూల గ్రహాలు గురు/శని/రాహువులు. చేపట్టని కార్యక్రమాలు కలసి వస్తాయి. శత్రుభీతి పోతుంది.

సింహ రాశి: ఈరాశి వారికి ఈ సంవ త్సరం ప్రతికూల గ్రహాలు కేతు/శని/గురు గ్రహాలు. అనుకూల గ్రహం రాహువు ఊహించని పరిణామాలు కృంగ దీస్తాయి.

కన్యారాశి: ఈరాశి వారికి అతి ప్రతికూల గ్రహాలు గురు/శనులు. ప్రతి పనిలోను శ్రద్ధ తప్పనిసరి. చిన్న చిన్న విషయాలు పెద్దవిగా మారి సమస్యలుగా మారతాయి.

తులారాశి: ఈరాశి వారికి గురు/శని/ కేతు గ్రహాలు అనుకూలం. ప్రతికూల గ్రహం రాహువు. విదేశీ వ్యవహారాలు లాభిస్తాయి. గతంలో కన్నా మెరుగైన అవకాశాలు అన్ని రంగాల వారికి కలసి వస్తాయి.

వృశ్చికరాశి: ఈరాశి వారికి గురు/శని గ్రహాలు ప్రతికూలం. కేతు గ్రహం అనుకూలం. ప్రతి పని లోనూ జాప్యాలు ఉంటాయి. వ్యయం పెరుగుతుంది. ఆదాయం అనుకున్న సమయానికి పొందలేకపోతారు. ఊహించని పరిణామాలు విస్మయాలని కలిగిస్తాయి.

ధనూరాశి: ఈ రాశి వారికి ప్రతికూల గ్రహాలు గురు/శని గ్రహాలు. నూతన సమస్యలు వృత్తిపరంగా ఉంటాయి. ఆకస్మిక ప్రతికూలత ఆర్థికంగా ఉంటుంది. శ్రమ అధిక మవుతుంది.

మకరరాశి: ఈ రాశి వారికి ఈ సంవత్సరం గురు/ రాహువులు అనుకూలం. ప్రతికూల గ్రహం శని. నూతన వస్తువు కొనుగోళ్లు, అభివృద్ధి ఉంటాయి. మానసిక ఉత్సాహం పెరుగు తుంది. వాహనసౌఖ్యం కొనసాగుతుంది. శ్రమతో కూడిన విజయాలు సంతృప్తిని కలిగిస్తాయి.

కుంభరాశి: ఈసంవత్సరం ఈ రాశి వారికి శని అత్యంత అనుకూలుడు. గురు/రాహు గ్రహాలు ప్రతికూలత కలిగిస్తాయి. క్లిష్టసమస్యలు పరిష్కరింపబడతాయి. ఆర్థిక విష యాలు అనుకూలం. కుటుంబ వ్యవహారాల్లో ఆకస్మిక చిక్కులు ఉంటాయి.

మీనరాశి: ఈరాశి వారికి ఈ సంవత్సరం అత్యంత అనుకూల గ్రహం బృహస్పతి. ప్రతికూల గ్రహాలు శని/రాహువులు. శుభవార్తలు వింటా రు. విద్యార్థులకి ప్రోత్సాహం పెరుగుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. గృహంలో మహిళలకు ప్రాధాన్యత పెరుగుతుంది.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

కులాసా

చలి తట్టుకోవడమెలా? 10 సూత్రాలు



కొన్ని ఆరోగ్య సమస్యలు చలికాలంలో తీవ్రంగా ఉంటాయి. ముఖ్యంగా ఆస్తమా, గొంతు నొప్పి ఎక్కువగా కనిపిస్తుంటాయి. వాతావరణం చల్లగా మారడంతో ఇటువంటి సమస్యలు పునరావృతమవుతుంటాయి.



జలుబు

చలికాలంలో చాలామంది నీళ్లవైపు రారు. ఎందుకంటే నీళ్లు చల్లగా ఉండటంతో చేతులు కడుక్కోవడం మానుకుంటారు. దీనివల్ల అర చేతుల్లో సూక్ష్మ క్రిములు ఉండిపోతాయి. అరిచేతుల్లో సూక్ష్మ క్రిములు ఉండటం వల్ల ఏదేని తినే పదార్థాన్ని అదే చేతితో తినడం వల్ల కడుపులోకి ఈ సూక్ష్మ క్రిములు వెళ్లిపోతాయి. దీంతో అనారోగ్య సమస్యలు వస్తాయి. కాబట్టి చలికాలంలో జలుబు భయం ఉన్నవాళ్లు కూడా చేతులు పరిశుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. దీనివల్ల సూక్ష్మ క్రిములు తొలగిపోవడమే కాదు జలుబు సమస్య కూడా సమసిపోతుంది. తలుపులకు, కిటికీలకు వేసిన కర్టెన్లతో తుడుచుకునే అలవాటు కూడా మంచిది కాదు. బ్యాక్టీరియా ఎక్కువగా ఉండేది కర్టెన్లలోనే అన్న విషయం మర్చిపోకూడదు.

మరో ముఖ్య విషయం ఏమంటే మీ ఇంట్లో లేదా ఇంట్లో ఉన్న వస్తువులు పరిశుభ్రంగా ఉండాలి. కప్పులు, గ్లాసులు, టవల్స్ పరిశుభ్రంగా ఉంటే చాలా మంచిది. మీ ఇంట్లో ఎవరైనా అనారోగ్యంగా ఉన్నట్లయితే వీటిని వాడే ముందు పరిశుభ్రమైనవి మాత్రమే వాడాలి.

చిట్కా: జలుబు ఉన్నవాళ్లు వెంటనే ఉపశమనం పొందడానికి గోరువెచ్చటిఉప్పునీటిని తీసుకుని అల్లం కలపాలి. దీన్ని సేవించినట్లయితే జలుబు నుంచి కొంతవరకు ఉపశమనం పొందొచ్చు.

గొంతు నొప్పి

గొంతునొప్పి అనేది చలికాలంలో ఎక్కువగా కనిపించే సమస్య. వైరల్ ఇన్‌ఫెక్షన్ వల్ల గొంతునొప్పి ఎక్కువగా ఉంటుంది. జ్వరం వచ్చే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. గది ఉష్ణోగ్రత వెచ్చగా ఉండేవిధంగా చూసుకోవాలి. చలికాలంలో మరీ చల్లగా ఉన్న గదుల్లో వెచ్చగా ఉండేవిధంగా జాగ్రత్త తీసుకోకపోతే గొంతు నొప్పి ఎక్కువవుతుంది.

చిట్కా: వేడి చేసిన నీటిని త్రాగాలి. దీనివల్ల వైరస్ చనిపోతుంది.

ఆస్తమా

ఆస్తమా రావడానికి ప్రధాన కారణాల్లో చల్లటి గాలి ప్రధాన కారణం. పిల్లికూతలు, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలు వస్తాయి. ఆస్తమా ఉన్న రోగులు చలికాలంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

చిట్కా: ఇంట్లో ఎక్కువగా ఉండాలి. ఆరుబయట తిరగకూడదు. చలి ఉన్నప్పుడు అస్సలు వెళ్లకూడదు. మీరు బయటకు వెళ్లదలచుకుంటే మాత్రం చెవులకు స్కార్ఫ్ కట్టుకోవాలి. దీంతో పాటు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలి. ఇన్‌హేలర్స్ కూడా ఉపశమనం కల్గిస్తాయి.

నోరో వైరస్

చలికాలంలో వాంతులు అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీన్నే నోరోవైరస్ అంటారు. కడుపులో ఇన్‌ఫెక్షన్ ఉండటం వల్ల ఇటువంటి వాంతులు అయ్యే చాన్స్ ఉంది. సంవత్సరంలో ఎప్పుడైనా వాంతులు రావచ్చు. కానీ చలికాలంలో ఈ వైరస్ చెలరేగిపోతుంది. ముఖ్యంగా హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, స్కూల్స్, హోటల్స్‌లో తినే ఆహారంలో ఈ వైరస్ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

ఈ రకమైన అనారోగ్యం ఎక్కువగా కనిపిస్తుంది. కొన్ని రోజులవరకు వాంతి అవుతున్నట్లు అనిపిస్తుంది.

చిట్కా: వాంతులు, డయేరియా అయ్యే వారంతా చలికాలంలో ఎక్కువ మోతాదులో ద్రావాలు తీసుకోవాలి. దీనివల్ల డయేరియాను త్వరగా అరికట్టవచ్చు. చిన్న పిల్లలు, వృద్ధులకు ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. నోటి ద్వారా ద్రావాలు తీసుకోవడం వల్ల వాంతులు, డయేరియాను అరికట్టవచ్చు.

నొప్పికలిగించే కీళ్లనొప్పులు

ఆర్థరైటిస్ ఉన్నవాళ్లు చలికాలంలో మరింత బాధపడతారు. కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉంటాయి. చలికాలంలో ఎముకల్లో నొప్పి తీవ్రంగా ఉంటుంది. ఎముకలు కొరికే చలి ఉంటే అంతే సంగతులు. వీరిలో ఉన్న ఆర్థరైటిస్ సమస్య తిరగబెడుతుంది. కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉంటాయి.

చిట్కా: చలికాలంలో ఇటువంటి సమస్య ఉన్నవాళ్లు ఆత్మనూన్యతకు గురవుతారు. నొప్పి బాగా ఉన్నప్పుడు సంబంధిత డాక్టరును సంప్రదించి చికిత్స తీసుకోవాలి. అంతేకాదు చలికాలంలో బయట తిరగకపోవడం మంచిది.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. స్విమ్మింగ్ చేయడం వల్ల కీళ్లనొప్పులు కొంతవరకు ఉపశమనం పొందినట్లే.



జలుబు పుళ్లు

బాగా ఒత్తిడికి గురయినప్పుడు చలికాలంలో జలుబు పుళ్లు ఏర్పడతాయి. వీటికి చికిత్స లేదు. కానీ జలుబు పుళ్లు రాకుండా అడ్డుకోవచ్చు. జలుబు పుళ్లు ఎక్కువగా వస్తున్నాయంటే మీరు అంత ఒత్తిడికి గురవుతున్నారని అర్థం.

చిట్కా: జలుబు పుళ్లకు దూరంగా ఉండాలంటే ఒత్తిడికి దూరంగా ఉండాలి. వేడినీటితో స్నానం చేయాలి. పార్కులో అరగంట లేదా ముప్పావుగంట నడవాలి. ఇష్టమైన సినిమాలను చూడాలి.

గుండెపోటు

చలికాలంలో గుండెపోటు రావడం సహజం. చలివల్ల రక్తపోటు పెరుగుతుంది. దీనివల్ల గుండె మీద అదనపు భారం పడుతుంది. కాబట్టి మీ గుండె బాగా అలసిపోతుంది. శరీర ఉష్ణోగ్రతను సమస్థితిలోకి తీసుకురావడానికి గుండె ప్రధానపాత్ర వహిస్తుంది. గుండె అనారోగ్యానికి గురికాకముందే జాగ్రత్తపడొచ్చు. చలికాలంలో గుండెపోట్లు ఎక్కువగా రావడానికి ఇదే ప్రధాన కారణం.

చిట్కా: మీ ఇల్లు వెచ్చగా ఉండేవిధంగా జాగ్రత్తపడాలి. మనం వినియోగించే గది ఉష్ణోగ్రత 18 సెంటీగ్రేడ్ల కంటే తక్కువ లేకుండా జాగ్రత్త వహించండి.

చేతులు, అరిపాదాలు చల్లగా...

రేనాడ్స్ ఫినామినన్ అనే వ్యాధి చలికాలంలో ఎక్కువగా వస్తుంది. దీనివల్ల వేళ్లు, మడమల రంగు మారిపోతుంది.

దీనివల్ల నొప్పి తీవ్రంగా ఉంటుంది. చలి పెరిగిన కొద్దీ ఈ నొప్పి అంతకంతకూ పెరుగుతుంది. వేళ్లు తెల్లగా మారిపోతాయి. ఉదా వర్ణంలోకి మారిపో తాయి. తర్వాత ఎరుపు వర్ణంలోకి మారొచ్చు. చేతుల్లో, పాదాల్లో రక్తప్రసరణ బాగా తగ్గిపోతుంది. ఈ సమస్య తీవ్రమైతే డాక్టరును సంప్రదించాలి. మందులు తీసుకోవాలి. కానీ మనలో చాలామంది ఇటువంటి సమస్యలున్నా అస్సలు పట్టించుకున్న పాపానపోరు.

చిట్కా: కెఫీన్ ఉన్న పదార్థాలను తినకూడదు. తాగకూడదు. దీనివల్ల పరిస్థితి విషమిస్తుంది. వెచ్చటి గ్లోవ్స్ సాక్స్, షూస్ వేసుకోవాలి. వెచ్చగా ఉండే విధంగా జాగ్రత్తపడాలి.

డ్రై స్కిన్

చలికాలంలో డ్రై స్కిన్ అనేది సర్వసాధారణమైన విషయం. వాతావరణంలో తేమ శాతం ఎక్కువైతే డ్రై స్కిన్ ఎక్కువవుతుంది. చలికాలంలో మాయిశ్చరైజింగ్ చేసుకోవడం అనివార్యం. లోషన్స్, క్రీములను చర్మానికి రుద్దడం వల్ల ఇటువంటి సమస్యను అడ్డుకట్టవేయొచ్చు. చర్మం తన సహజమైన రంగును కోల్పోదు.

చిట్కా: స్నానం చేసిన తర్వాత మాయిశ్చరైజ్ చేసుకోవడం మంచిది. మళ్లీ రాత్రిపూట చేయాలి. వెచ్చగా ఉండే విధంగా జాగ్రత్తపడాలి. బాగా వేడినీళ్లతో స్నానం చేస్తే డ్రైస్కిన్ అయ్యే ప్రమాదముంది. కాబట్టి గోరువెచ్చటినీటితో స్నానం చేయాలి.

ఫ్లూ

ఫ్లూ అనేది ప్రాణాంతకమైంది. ఎక్కువగా చనిపోయేది ఫ్లూ వల్లేనని గమనించాలి. ఎవరైతే 65 సంవత్సరాలు దాటుతారో వాళ్లు రిస్క్‌లో ఉన్నట్టే. గర్భిణీలు కూడా ఫ్లూ బారినపడే ప్రమాదముంది. దీర్ఘకాలికంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవాళ్లు కూడా ఫ్లూ బారినపడతారు. డయాబెటీస్, కిడ్నీ వ్యాధులు, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిసీజ్ వచ్చే ప్రమాదముంది. ఫ్లూ నాసల్ స్ప్రేని రెండు నుంచి 17 ఏళ్లలోపు పిల్లలకు ఇవ్వాలి. వాక్సిన్‌లు ఇవ్వడం వల్ల సంవత్సరం వరకు ఎటువంటి ఫ్లూలు రాకుండా జాగ్రత్తపడొచ్చు.

65 ఏళ్లు దాటిన వ్యక్తులు కూడా నిమోకోకల్ వాక్సిన్ తీసుకోవాలి. దీనివల్ల నిమోనియా రాకుండా అడ్డుకోవచ్చు.

చిట్కా: ఫ్లూ వస్తే వెంటనే జనరల్ ఫిజిషియన్‌ని సంప్రదించాలి. ఇంట్లో వైద్యం పనికిరాదు. తగు జాగ్రత్త చర్యలు తీసుకుంటే మంచిది.

డాక్టర్ రాహుల్ అగర్వాల్
ఎండి (జనరల్ మెడిసిన్)
సీనియర్ జనరల్ ఫిజిషియన్



ఎర్ర బొడిపి ఉందా.. జాగ్రత్త!



పయోజెనిక్ గ్రానులోమా అనేది ఒకరకమైన చర్మవ్యాధి అని చెప్పొచ్చు. ఇది చిన్నగా మొదలై క్రమేపీ పెద్దదవుతుంది.దీని ఆకారం గుండ్రంగా ఉంటుంది. ఎర్రగా ఉంటుంది. ఒక్కోసారి ఇది పగిలిపోవడం తీవ్ర రక్త స్రావం అవుతుంది. ఎక్కువ సంఖ్యలో రక్తనాళాలు ఒకే చోట కలవడం వల్ల ఇటువంటి పరిణామం సంభవిస్తుంది.

చిన్నపిల్లల్లో, యుక్త వయసులో ఉన్నవారికి ఇది వచ్చే అవకాశం ఉంటుంది. గర్భిణీల్లో ఇది తరచూ సంభవిస్తుంది. హార్మోన్ మార్పుల వల్ల ఈ చర్మ వ్యాధికి దారితీయొచ్చు.

ఏ భాగాల్లో పయోజెనిక్ గ్రానులోమా వస్తుంది?

☞ చేతులు, చేతి వేళ్లు, భుజాలు, ముఖం, మెడ, ఛాతి, వీపు

అంతేకాదు పెదవులు, కనురెప్పలు, జననాంగాలు, నోటి లోపల కూడా ఇవి పుడుతుంటాయి. అరుదైన కేసుల్లో మీ కంటి కార్నియాలో కూడా ఇది వచ్చే అవకాశం ఉంది. మీ కంటిలోపలి తెల్లటి భాగంలో వస్తుంది.

కారణాలు

పయోజెనిక్ గ్రానులోమా రావడానికి స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. గాయాల వల్ల ఇటువంటివి సంభవిస్తాయి. చర్మం మీద ఏదేని గాయం వల్ల కొన్ని రోజుల తర్వాత పయోజెనిక్ గ్రానులోమాకు దారితీస్తుంది.

వెన్ను బాధలకు ఆయుర్వేదం

తెలంగాణ రాష్ట్రం జనగాం జిల్లాకు చెందిన 40 ఏళ్ల వ్యక్తిఇప్పుడు సంతోషంగా దైనందిన కార్యకలాపాలు చేసుకోగలుగుతున్నారు. వృత్తిరీత్యా ఆటో డ్రైవర్ అయిన గూడ భాస్కర్ అనే వ్యక్తి గత కొంతకాలంగా తీవ్రమైన వెన్ను నొప్పితో బాధపడుతూ రెండు చేతులూ తీవ్రంగా అలసటకు లోనై వణికిపోతున్న ఇబ్బందికి గురయ్యాడు. దీనికి తోడు కాళ్లలో తీవ్రమైన కదలిక సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో ఆయన కదలలేని స్థితికి చేరిపోయారు. మంచానికే పరిమితమయ్యారు. ఇలాంటి స్థితిలో ఆయన అన్ని రకాలైన చికిత్స విధానాలను ఆశ్రయించి పరిష్కారం కోసం ప్రయత్నం చేశారు. అయితే తన అనారోగ్య స్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో ఆయన కేవీఎస్‌పిసి ఆస్పత్రిని చికిత్స కోసం ఆశ్రయించారు.

చీఫ్ ఆయుర్వేదిక్ స్పెషలిస్ట్ డాక్టర్ సజీ డిసౌజా వద్ద కన్సల్టేషన్ పొందారు. వివిధ రకాలూన నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆయనకు తీవ్రమైన సర్వైకల్ స్పాండిలైసిస్ సి3, సి4, సి5, సి6, సి7 వద్ద ఉందని తేలింది. దీంతో పాటుగా లంబర్ స్పాండిలైసిస్ ఎల్ 3, ఎల్ 4, ఎల్ 5, ఎస్ 1 లెవెల్ల వద్ద ఉందని తేలింది. వీటికి తోడుగా, వెన్నుపూసకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లుగా నిర్ధారణ అయ్యింది. కామన్ పెరాన్యియల్ (కాలి వద్ద బయటవైపు ఉన్న పొడుగాటి ఎముక సంబంధిత సమస్య) ఉందని కదలికకు సంబంధించినవి కూడా ఉన్నాయని వెల్లడైంది.



శస్త్రచికిత్స చేసి విజయవంతంగా చేసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సాజీ డిసౌజా మాట్లాడుతూ భాస్కర్ ఆరోగ్య సమస్యను పరిష్కరించి అంశాలను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనేక రకాలైన ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు అత్యుత్తమమైన పరిష్కార వైద్యంగా ఆయుర్వేదాన్ని ప్రజలు పరిగణిస్తున్నారు. ఇదే రీతిలో ఆటోడ్రైవర్‌గా తన జీవితం సాగిస్తున్న భాస్కర్ మా వద్దకు వచ్చారు. మా వద్దకు భాస్కర్ వచ్చిన సమయంలో ఆయన పూర్తిగా కదలలేని స్థితిలో ఉన్నారు. కనీసం నిలబడలేనంత స్థాయికి ఆయన అనారోగ్యం చేరింది. వీటికి తోడుగా ఆయన పూర్తిగా కదలలేని స్థితిలో ఉన్నారు. కనీసం నిలబడలేనంత స్థాయికి ఆయన ఆరోగ్యం చేరింది. వీటికి తోడు ఆయన తీవ్రమైన నొప్పితో విలవిలలాడిపో తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన అనారోగ్య సమస్యను నిశితంగా అధ్యయనం చేశాం. భాస్కర్ అనారోగ్య సమస్యపై స్పష్టత వచ్చిన నేపథ్యంలో ఆయనకు చికిత్స విధానాన్ని మూడు విభాగాలుగా విభజించాం. 14 రోజుల వ్యవధి గల ఈ కోర్సులో భాగంగా ఆయన వెన్నుపూసకు సంబంధించిన సమస్యలు, వెన్నుపూసను పునరుజ్జీవం చేయించడం, నరాల వ్యవస్థను బలోపేతం వంటి కీలక అంశాలను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగాం అని వెల్లడించారు.

చికిత్స ప్రక్రియ మొదలైన ఏడు రోజుల్లోనే ఆయనలో మార్పు రావడం కనిపించింది. ఆయన నొప్పి తగ్గడం మొదలైంది. తన రెండు కాళ్లపై నిలబడగలిగారు. దీంతోపాటుగా తన కాళ్లపై నడవడం మొదలుపెట్టారు. 14వ రోజు నాటికి, రోగి భాస్కర్ పూర్తిగా స్వతంత్ర్యంగా నిలిచారు. స్వేచ్ఛగా తనం త తాను నడవగలిగారు. స్వల్పంగా నామ మాత్రపు నొప్పి ఉన్నప్పటికీ ఆయన తన పనులు తాను చేసుకోగలిగారు. ఆయనకు నెలరోజుల పాటు మందులు సూచించి డిశ్చార్జి చేశాం. అనంతరం ఆయన్ను తదుపరి చర్యల ప్రకారం వైద్యుల సహా యం తీసుకోవాలని సూచించాం అని కోరారు.

లేచి నిలబడగలుగుతున్నాను

నేను కోలుకున్న తీరు నిజంగా అద్భుతం అనిపించింది. వైద్యులు, సిబ్బందికి మేం మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాం. వైద్యం తీరు మాకెంతో ప్రోత్సాహాన్ని అందించింది. నా ఆరోగ్య స్థితిని చూసి నేను కోలుకోవడం కష్టమని భావించాను. నా జీవితం ముగిసిపోయిందని అనుకున్నాను. ఎంతో నిరాశ నిస్పృహలకు లోనయ్యాను. ఈ ఆయుర్వేద విధానంపై నాకు మునుపెన్నడూ నమ్మకం లేదు. ఇలాంటి ఆలోచనతో ఉండి ఈ వైద్యాన్ని ఆలస్యంగా ఆశ్రయించినందుకు నేను చింతిస్తున్నాను. ఇప్పుడు నేను ఎంతో సంతోషంగా ఉన్నాను. నా కాళ్లు చేతులకు ఎలాంటి సమస్యలు లేవు. నా కాళ్లపై నేను నిలబడగలుగుతున్నాను అని భాస్కర్ సంతోషం వ్యక్తం చేశారు.

2019లో కీర్తి పెరగాలి... కాసులు కురవాలి...

నూతన సంవత్సర శుభాకాంక్షలు



* తెలుగు సినిమా ఖ్యాతి పెంచిన 2018
* కొత్త ఏడాదిలో మరిన్ని గొప్ప చిత్రాలు
* ఎదురుచూస్తున్న ప్రేక్షకులు

తెలుగు తెరపై వినోదాలు పంచిన ఏడాది గడిచిపోయింది. జయాపజయాలు, జ్ఞాపకాలు, అనుభవ పాఠాలు నేర్పించిన కాలచక్రం గిర్రున తిరిగింది. ఆశాభావంతో కొత్త ఏడాదికి టాలీవుడ్ స్వాగతం పలుకుతోంది. విజయాల శాతం పెరగాలని పరిశ్రమ వాసులు ఆశిస్తుంటే...మంచి అనుభూతిని అందించే సినిమాలు చూడాలని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ప్రారంభంలో వచ్చే సంక్రాంతి మొదలు మళ్లీ డిసెంబర్ దాకా ఆసక్తికరమైన చిత్రాలు రాబోతున్నాయి. ఈ సినిమాలు పరిశ్రమ కీర్తిని మరింత పెంచుతాయనడంలో సందేహం లేదు.



ఆరంభం అదరాలి..!

మంచి ఆరంభం సగం విజయం అంటారు. తెలుగు తెరకు సంక్రాంతితో కొత్త ఏడాది మొదలవుతుంది. ఇది పెద్ద సీజన్ కాగా...స్టార్‌ల సినిమాలు ముస్తాభవుతుంటాయి. ఈసారి సిరుల పండగకు నాలుగు చిత్రాలు వినోదాన్ని పంచేందుకు సిద్ధమవుతున్నాయి. విక్టరీ వెంకటేష్, వరుణ్ తేజ్ నటించిన ఫన్ అండ్ ఫ్రస్టేషన్ పండగను ఆస్వాదించే కుటుంబ కథా చిత్రంగా విడుదలవుతోంది. జనవరి 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొస్తోంది. దర్శకుడు అనిల్ రావిపూడికి నవ్వుల చిత్రాలను విజయవంతంగా తీసిన పేరుంది. ఈ చిత్రాన్నీ అదే కోవలో రూపొందించినట్లు టీజర్ చూస్తుంటే తెలుస్తోంది.

రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన వినయ విధేయ రామ జనవరి 11న తెరపైకి వస్తోంది. కుటుంబ కథా చిత్రంగా ఉంటూనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు దర్శకుడు బోయపాటి శ్రీను. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించింది. కైరా అద్వానీ నాయికగా అలరించబోతోంది. రజినీకాంత్ పేటా జనవరి 10న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా కొంతైనా బాక్సాఫీస్ దగ్గర ప్రభావం చూపించే అవకాశం ఉంది.

ఎన్టీఆర్ బయోపిక్ రెండు భాగాల్లో మొదటిది కథానాయకుడు జనవరి 9న ప్రేక్షకుల ముందుకొ స్తోంది. దిగ్గజ నటుడు చేసిన అనేక చిత్రాల సమాహారాన్ని ఈ కథలో చూపించబో తున్నారు. దర్శకుడు క్రిష్ రూపకల్పనలో బాలకృష్ణ నటిస్తూ చిత్రంలో అఖిల్ జల్సా రాయుడి పాత్రలో కనిపించబోతున్నారు.

ఫిబ్రవరిలో రాజకీయ వేడి..

ఈ నెలలో రాజకీయ నేపథ్య చిత్రాలు వేడి పెంచబోతున్నాయి. ఎన్టీఆర్, వైఎస్ఆర్ జీవిత కథా చిత్రాలు ఈ నెలలోనే ఒక రోజు తేడాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. ఎన్టీఆర్ బయోపిక్‌లో రెండో భాగం మహానాయకుడు ఫిబ్రవరి 7న విడుదలవుతుండగా...దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జీవితకథతో దర్శకుడు మహీ వి రాఘవ్ రూపొందిస్తున్న యాత్ర చిత్రం ఫిబ్రవరి 8న తెరపైకి వస్తోంది. మమ్ముట్టి వైఎస్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ రెండు సినిమాలు రాజకీయంగా ఎలాంటి సంచలనం సృష్టిస్తాయో అన్నది ఆసక్తికరంగా మారింది.

ద్వితీయార్థంలో సైరా...

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న చారిత్రక నేపథ్య చిత్రం సైరా నరసింహా రెడ్డి. తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథతో ఈ చిత్రాన్ని దర్శకుడు సురేందర్ రెడ్డి రూపొందిస్తున్నారు. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై రామ్ చరణ్ నిర్మిస్తున్న సైరా ఏడాది ద్వితీయార్థంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ నటిస్తున్న కొత్త చిత్రం డియర్ కామ్రేడ్. భరత్ కమ్మ అనే కొత్త దర్శకుడు ఈ సినిమాను రూపొందిస్తున్నారు. రశ్మిక మండన్న నాయికగా నటిస్తోంది. డిసెంబర్‌లో డియర్ కామ్రేడ్ ప్రేక్షకుల ముందుకు రానుంది.











నిర్మిస్తున్నారు.

వినోదాన్ని కొనసాగిస్తూ..

సంక్రాంతికి పెద్ద చిత్రాల సందడి ముగిశాక... మధ్య స్థాయి చిత్రాలు తెరపైకి వస్తున్నాయి. వీటిలో నిఖిల్ నటించిన ముద్ర సినిమా ఒకటి. జనవరి చివరలో ఈ సినిమా విడుదల కానుంది. జర్నలిజం నేపథ్యంలో సాగుతుందీ సినిమా. అఖిల్ హీరోగా నటించిన మిస్టర్ మజ్ను జనవరి 25న తెరపైకి వస్తోంది. దర్శకుడు వెంకీ అట్లూరి రూపొందిస్తున్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్ నాయికగా నటిస్తోంది. ఈ



ఏప్రిల్ సూపర్‌స్టార్‌దే...

మహేష్ బాబు నటిస్తున్న కొత్త చిత్రం మహర్షి ఏప్రిల్ 5న మన ముందుకు రాబోతోంది. దర్శకుడు వంశీ పైడిపల్లి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పూజా హెగ్డే నాయికగా నటిస్తోంది. ఈ చిత్రంలో మహేష్ ప్రవాస భారతీయుడిగా కనిపిస్తారు. మన దేశ ప్రజల కోసం మహర్షి ఎలాంటి కృషి చేశారన్నది ఆసక్తి కలిగిస్తోంది. వాణిజ్య విలువలు ఉంటూనే సందేశాత్మకంగా, స్ఫూర్తివంతంగా మహర్షి కథా కథనాలు ఉంటాయని తెలుస్తోంది. నాని హీరోగా నటిస్తున్న జెర్సీ సినిమా ఏప్రిల్ మూడో వారంలో ప్రేక్షకుల ముందుకొస్తోంది. క్రికెట్ నేపథ్యంతో సాగడం ఈ సినిమా ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.



జెండా పండక్కి...

రెబల్‌స్టార్ ప్రభాస్ నటిస్తున్న సాహో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా తెరపైకి వస్తోంది. భారీ నిర్మాణ వ్యయం, అంతర్జాతీయ స్థాయి సాంకేతికత విలువలతో సాహో తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది. తెలుగుతో పాటు తమిళ, హిందీ భాషల్లో సాహో విడుదల కానుంది. బాలీవుడ్ తార శ్రద్ధా కపూర్ ప్రభాస్ సరసన కనిపించనుంది.

త్రివిక్రమ్‌తో అల్లు అర్జున్



'నా పేరు సూర్య...' సినిమా తర్వాత అల్లు అర్జున్ కొత్త చిత్రం గురించి సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. మధ్యలో పలు ప్రాజెక్ట్‌ల గురించి వినిపించాయి. దీనిపై ఎవరూ అధికారిక ప్రకటన చేయలేదు. తాజాగా త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటిస్తున్నారని ప్రకటించారు. 'జులాయి', 'సన్నాఫ్ సత్య మూర్తి' తర్వాత వీరిద్దరు మరోసారి కలిశారు. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తాయి. కొత్త సంవత్సరం జనవరిలో షూటింగ్ ప్రారంభిస్తారు. అల్లు అర్జున్‌కు ఇది 19వ సినిమా.

అల్లు అర్జున్, త్రివిక్రమ్ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తిచేశారు. ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే వెల్లడిస్తారు. ఈ చిత్రానికి అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ నిర్మాతలు.

ఓ క్రికెటర్ ప్రేమ



నాని

నాని, శ్రద్ధా కపూర్ నటిస్తున్న 'జెర్సీ' చిత్రం ఫస్టు లుక్ విడుదల చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నాని క్రికెటర్‌గా కనిపిస్తారు. ఈ చిత్రంలో ఇంకా సత్యరాజ్, రోనిత్ కమ్రా, బ్రహ్మాజీ నటిస్తున్నారు.

సంగీతం: అనిరుధ్, ఛాయాగ్రహణం: సను వర్గీసీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం, సమర్పణ: పి.డి.వి. ప్రసాద్, నిర్మాత: సూర్యదేవర నాగవంశి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: గౌతమ్ తిన్ననూరి.

లవ్ లెటర్స్

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం '4 లెటర్స్'. కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే అనేది ఉప శీర్షిక. ఆర్. రఘురాజ్ దర్శకత్వం లో దొమ్మ రాజు హేమలత, దొమ్మ రాజు ఉదయ్ కుమార్ నిర్మిస్తు న్నారు. ఇప్పటికీ చిత్రీకరణ పూర్తిచేసు కున్న ఈ చిత్రం కోసం నిర్మాణా నంతర పనులు జరుపు తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ ''యువ తరం ప్రేమకథతో ఈ చిత్రం నిర్మిస్తు న్నాం. కలుసుకోవాలని వంటి చిత్రాన్ని తెరకెక్కించిన రఘురాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. కమర్షియల్ హంగు లతో, అన్ని వర్గాలను ఆకట్టుకునే వినోదాత్మక చిత్రమిది. త్వరలోనే పాటలు, సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని అన్నారు.

దర్శకుడు మాట్లాడుతూ ''కలుసు కోవాలని' తర్వాత కన్నడ, తమిళ సినిమాలు చేశారు. కొంత విరామం తర్వాత తెలుగు సినిమా చేస్తున్నాను. ఇది నేటితరం ప్రేమకథా చిత్రం. అందుకే కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే అనే ఉప శీర్షిక పెట్టాం. ప్రేమ పెళ్లి విషయంలో నేటి యువత ఆలోచనలు, అభిప్రాయాలు, వాస్తవాలు ఏమిటనేది వాస్తవానికి దగ్గరగా ఉండేలా చిత్రీకరించాం. బ్యాంకాక్‌లో పాటలను చిత్రీకరించాం'' అని చెప్పారు.




ఈ చిత్రానికి సంగీతం: బీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: చిట్టిబాబు. కె, నిర్మాతలు: దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్.

విశాల్ పెళ్లి..!



తెలుగు, తమిళ చిత్రాల హీరో విశాల్ (41) ఓ ఇంటివాడు కాబోతున్నాడు. పెద్దలు కుదిర్చిన వివాహం ఆయన చేసుకోబోతున్నట్టు తెలిసింది. నటి వరలక్ష్మితో ఆయనకు ప్రేమ వ్యవహారం ఉందని గతంలో ప్రచారం జరిగింది. అయితే దీనిపై వరలక్ష్మి స్పష్టత ఇచ్చింది. విశాల్‌తో కేవలం స్నేహం మాత్రమే ఉందని తెలిపింది. తాజాగా విశాల్‌కి త్వరలోనే నిశ్చితార్థం జరుగుతుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. విశాల్ ఎవరిని వివాహం చేసుకోబోతున్నారనే దానిపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. దీనిపై విశాల్ తండ్రి కొంత స్పష్టత ఇచ్చారు. అనిషా అనే అమ్మాయితో విశాల్ పెళ్లి జరుగుతుందని, హైదరాబాద్‌లోనే నిశ్చితార్థం నిర్వహిస్తామని తెలిపారు.

విశాల్ నటునిగానే కాదు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా బిజీగా ఉన్నారు. నిర్మాతల మండలికి, నడిగర్ సంఘానికి ఆయన అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు.



విడుదలకు సిద్ధమైన భగవాన్

రాజీవ్, శృతి జంటగా నటించిన చిత్రం భగవాన్. చందూ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. కేవై శేఖర్ బాబు, నిరంజన్ గౌడ్ సమర్పకులుగా వ్యవహరించారు. ఆశిష్ విద్యార్థి కీలక పాత్రలో నటించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న భగవాన్ సినిమా ఈ నెల 4న ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ...చిత్ర నిర్మాణంలో మేము చేసిన ప్రయత్నం భగవాన్. అన్ని వాణిజ్య అంశాలను కలిపి ఈ చిత్రాన్ని నిర్మించాం. మాస్ ప్రేక్షకులకు నచ్చేలా ఉన్నా..మిగతా వర్గాల వారినీ ఆకట్టుకుంటుంది. నటీనటులు కొత్త వారైనా బాగా నటించారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమిది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్నాం. మీ ముందుకొచ్చేందుకు సిద్ధమవుతున్నాం. అన్నారు. ఈ చిత్రానికి కెమెరా - తిరుమల, ఫైట్స్ - కృష్ణంరాజు, సంగీతం - కరుణాకర్, రచయిత - కోడి ప్రసాద్,